



# ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక: 62 | ఎడిటర్: మేనం శ్యామ్ | ఆదివారం 20-09-2026 | పేజీలు: 10


## సిరా చుక్క

అప్పు అందంగా పుట్టుతుంది..
కష్టంగా నెట్టుతుంది
ఏడుస్తూ కట్టుతుంది.
ఆలి పిల్లల ఆనందాలను
కనబడకుండా దోస్తుంది.
ఐశ్వర్యవంతులని భ్రమింపజేస్తూ
అపర కుచేలుర చేస్తుంది.
మనస్సాక్షి చస్తుంది
ఆత్మవంచన పెరుగుతుంది.
మనిషి కనిపించకగొంతు
వినిపిస్తేకలవరపాటుగా...
అగోఇచ్చినోడే వచ్చిండని
ఊహించుకుంటాంఉలిక్కిపడతాం.
అప్పుతెచ్చు ఆనందం
ఆరోగ్యానికి ప్రతిబంధం.
అవమానాలతో సంబంధం
అప్పు అనే పీడ నీడలా వెంటాడుతుంది.
నిలకడ లేకుండా చేస్తుంది.
నిలకడ లేని మనిషిని
నిత్యదరిద్రమై వెంటాడుతుంది
అప్పు నిప్పులా కాలుస్తుంది
నిలువునా కూలుస్తుంది.
అడ్డదారి సంపాదనకై
అడుగులు వేయిస్తుంది.
అందరిలో నిందెలపాలు చేస్తుంది.
మందులేని మనోవేధన కలిగిస్తుంది.
ఆస్తిపాస్తులెన్ని ఉన్నా !
అప్పులుంటే అన్నీ సున్నా.
అప్పు లేని వాడు అధిక సంపన్నుడు.
కొప్పు లేని వాడు ఆరోగ్యవంతుడు.

రాజి రెడ్డి శీలం. ఇనుగుర్తి

# 30 వేల మంది.. 350 కంపెనీలు

- ఉద్యోగాల కోసం కోదాడకు యువత వెల్లువ
- దేశంలోనే భారీ స్థాయిలో జాబ్‌మేళా నిర్వహించాం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- రైతులు భూములు అమ్మి చదివించిన బిడ్డలకు ఉద్యోగాలే లక్ష్యం
- మట్టిలో మాణిక్యాలకు అవకాశాలు కల్పించేందుకే ఈ మహా మేళా
- యువత జీవితాల్లో కొత్త అధ్యాయానికి నాంది
- స్పీకర్ గడ్డం ప్రసాద్-

**కోదాడ,హుజూర్‌నగర్** ప్రజలే మా కుటుంబ సభ్యులు: ఉత్తమ్ప్రజా వాయిస్,కోదాడ:నిరుద్యోగ యువతకు కొలువుల బాటలు వేసే లక్ష్యంతో కోదాడలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు అపూర్వ స్పందన లభించింది. దేశంలోనే అతిపెద్ద జాబ్‌మేళాగా కోదాడ మేళా నిలిచిందని రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. దేశంలో పేరు గాంచిన 350 కంపెనీలు మేళాకు తరలిరాగా.. 30 వేల మందికిపైగా నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం హాజరయ్యారని తెలిపారు.కోదాడ ఎమ్మెల్యే, జాబ్‌మేళా ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ నలమాద పద్మావతి రెడ్డి అధ్యక్షతన శనివారం జరిగిన కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, అనిల్‌కుమార్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నరసింహ తదితరులతో కలిసి మంత్రి మాట్లాడారు.



### రైతుల త్యాగానికి ప్రతిఫలం..

తెలంగాణలో రైతులు తమ భూములను అమ్ముకుని పిల్లలను చదివించారని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రైతుల కష్టంతో చదువుకున్న మట్టిలో మాణిక్యాలైన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ జాబ్‌మేళాను ఎంతో కష్టపడి నిర్వహించామని చెప్పారు. యువతకు ఉపాధి లభిస్తే వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని పేర్కొన్నారు. జాబ్‌మేళాలో కొందరికి అక్కడికక్కడే నియామక పత్రాలు అందిస్తున్నామని, మరికొందరికి కంపెనీలు పూర్తి స్థాయిలో ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు ఇస్తాయని తెలిపారు. ఉద్యోగాలకు సంబంధించి ఏ సమస్య ఉన్నా తన కార్యాలయాన్ని సంప్రదించాలని యువతకు సూచించారు.

### మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే: ఉత్తమ్

తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల ప్రజలే తమ కుటుంబ సభ్యులని పేర్కొన్నారు. ప్రజల ఆదరాభిమానాలతో గత 34 ఏళ్లుగా ఆరుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా, రెండుసార్లు ఎంపీగా సేవలందిస్తున్నానన్నారు.

### 60 వేల ఉద్యోగాలు కల్పించాం

కోదాడ మెగా జాబ్‌మేళా నిరుద్యోగ యువత జీవితాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలికిందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. యువతకు విద్యతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు సుమారు 60 వేల ఉద్యోగాలు కల్పించిందని తెలిపారు.ఒకే వేదికపై భారీ సంఖ్యలో కంపెనీలు, ఉద్యోగ అవకాశాలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. యువత తమ విద్యార్హతలు, నైపుణ్యాలను మెరుగుపరుచుకుని వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### ఉత్తమ్,పద్మావతి దంపతుల తపన: గుత్తా

కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల అభివృద్ధికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి,

మిగతా 2లో



# కేసీఆర్ కుటుంబ భూములపై విచారణకు కట్టుబడి ఉన్నాం

- మహేశ్ కుమార్ గౌడ్
- కేసీఆర్ కుటుంబానికి వందల ఎకరాల భూములు ఎలా వచ్చాయో చెప్పాలని డిమాండ్
- భూములు వారివే అయితే పత్రాలు చూపించాలని సవాల్
- కాళేశ్వరం విచారణపై సీబీఐకి లేఖ రాశామని వెల్లడి
- ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు బీజేపీ, బీఆర్ఎస్‌లకు లేదని వ్యాఖ్య
- ఖైరతాబాద్ ఉపఎన్నిక వస్తే కాంగ్రెస్ అభ్యర్థిదే విజయం అని ధీమా



**హైదరాబాద్, ప్రజా వాయిస్:**మాజీ సీఎం కేసీఆర్‌పై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర విమర్శలు చేశారు. కేసీఆర్ కుటుంబ సభ్యుల భూముల వ్యవహారంపై అధికారుల విచారణ కొనసాగుతోందని, ఈ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. శనివారం ఢిల్లీలో ఏబీఎన్‌తో మాట్లాడిన ఆయన.. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌కు సెండాఫ్ ఇచ్చేందుకు ఢిల్లీకి వచ్చినట్లు తెలిపారు.

### వందల ఎకరాలు ఎలా వచ్చాయి?

కేసీఆర్ కుటుంబానికి ఇన్ని వందల ఎకరాల భూములు ఎలా వచ్చాయని మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. ఆ భూములు వారివే అయితే అందుకు సంబంధించిన పత్రాలను చూపించాలని సవాల్ చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదలు, దళితులకు సొంతింటి కలను నెరవేర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని

మిగతా 2లో

# దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో ఊరట దక్కేనా

- ఎస్ఎల్‌పీ దాఖలు!
- ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా అనర్హత వేటుపై హైకోర్టు తీర్పును సవాల్ చేసిన దానం
- శనివారం సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు
- ఎస్ఎల్‌పీని విచారణకు స్వీకరిస్తుందా లేదా అనే దానిపై ఉత్కంఠ
- దానం పిటిషన్‌పై ఏకపక్ష ఆదేశాలు రాకుండా ఏలేటి, కాశిరెడ్డి కేవియట్లు
- ఖైరతాబాద్ స్థానం ఖాళీగా పరిగణించాలన్న హైకోర్టు తీర్పుతో తదుపరి పరిణామాలపై ఆసక్తి

2 లో



# కేటీఆర్ సుద్దపూస మాటలు ఆపాలి

- రేవంత్–కేటీఆర్ మైత్రి ప్రజలకు తెలుసు: బండి సంజయ్!
- సర్వే నంబర్లతో సహా అంశాలను చెబుతూ డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపణ
- కేసీఆర్ కుటుంబంపై ముందుగా క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్
- పొత్తూర్ లాజిస్టిక్ పార్క్, హోటళ్లు, రెస్టారెంట్లపై కేటీఆర్‌ను ప్రశ్నించిన బండి సంజయ్
- ఖైరతాబాద్ ఉపఎన్నిక అనివార్యం.. బీజేపీదే విజయమని ధీమా



**హైదరాబాద్, ప్రజా వాయిస్:** సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి కేటీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర విమర్శలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన.. రేవంత్‌రెడ్డి, కేటీఆర్ మధ్య మైత్రి ఏంటో ప్రజలకు తెలుసన్నారు. సర్వే నంబర్లతో సహా వివరాలు చెబుతూ కేటీఆర్ బాధపడకుండా ఉండేందుకు డైవర్ట్ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఎంపీలు, ఎమ్మెల్సీలను పంపించి కొత్తగా రాజకీయ డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు.

### అసలు అంశాలను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపణ

హద్దులు కొలవడానికి వెళ్తున్నారా అంటూ బండి సంజయ్ ప్రశ్నించారు. ఏఐసీసీకి ముడుపులు అందకపోవడంతోనే అసలు అంశం పక్కదారి పడుతోందని ఆరోపించారు. ముందుగా కేసీఆర్ కుటుంబంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కేటీఆర్

మిగతా 2లో

# హాఫీజ్‌పేట్‌లో మహిళలపై దాడి.. హోంగార్డ్‌పై వేటు!

- మహిళలపై దాడి చేసిన హోంగార్డ్ ఆనంద్‌ను సర్వీసు నుంచి డిస్మిస్ చేసిన అధికారులు
- వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఉత్తర్వులతో చర్యలు
- ఇప్పటికే ఆనంద్‌పై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్న మియాపూర్ పోలీసులు
- హోంగార్డ్ వ్యవహారంపై డీజీపీ సీవీ ఆనంద్ తీవ్ర ఆగ్రహం
- శిక్షణ, ఆదేశాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎవరినీ ఉపేక్షించబోమని స్పష్టం



# వరంగల్‌లో ప్రపంచస్థాయి విమానాశ్రయానికి కీలక అడుగు

- భూములు ఏఏఐకి అప్పగింత!
- మామునూర్ విమానాశ్రయానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ పూర్తి.
- సేకరించిన భూమిని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగించిన ప్రభుత్వం
- విమానాశ్రయ అభివృద్ధికి రూ.295 కోట్లు కేటాయించినట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి.
- పరిశ్రమలు, వాణిజ్యం, పర్యాటకం, ఐటీ రంగాలకు మరింత ఊతం లభిస్తుందని వ్యాఖ్య
- మామునూర్ విమానాశ్రయానికి పేరు సూచించాలని ప్రజలకు సీఎం పిలుపు



**వరంగల్, ప్రజా వాయిస్:** వరంగల్‌లో ప్రపంచస్థాయి విమానాశ్రయ నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. మామునూర్ విమానాశ్రయం కోసం అవసరమైన భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి, సేకరించిన భూమిని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగించినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. విమానాశ్రయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.295 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు.

### వరంగల్ అభివృద్ధికి కీలక గేట్‌వే

వరంగల్ విమానాశ్రయ కలను సాకారం చేసే దిశగా భూసేకరణ పూర్తి చేయడం ముఖ్యమైన అడుగు అని సీఎం పేర్కొన్నారు. మామునూర్ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే వరంగల్‌తో పాటు ఉమ్మడి వరంగల్ ప్రాంతంలో పరిశ్రమలు, వాణిజ్యం, పర్యాటక రంగాలకు మరింత ఊతం లభిస్తుందని తెలిపారు.

### పెట్టుబడులు.. ఉద్యోగ అవకాశాలకు ఊతం

మామునూర్ విమానాశ్రయం ద్వారా దేశ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించే అవకాశాలు పెరుగుతాయని రేవంత్‌రెడ్డి అన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు పారిశ్రామిక అభివృద్ధి, పర్యాటక రంగ విస్తరణకు ఇది దోహదపడుతుందని తెలిపారు. ఐటీ, సేవా రంగాల్లోనూ కొత్త అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు.

### హైదరాబాద్‌పై రవాణా ఒత్తిడి తగ్గే అవకాశం

వరంగల్ సమగ్ర అభివృద్ధిలో మామునూర్ విమానాశ్రయానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందని సీఎం అన్నారు. మెరుగైన విమాన రాకపోకలతో హైదరాబాద్‌పై రవాణా ఒత్తిడి తగ్గడంతో పాటు వరంగల్ ప్రాంతానికి మరిన్ని పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో వరంగల్ విమానాశ్రయ కల సాకారం దిశగా అడుగులు పడుతున్నాయని పేర్కొన్నారు.


### విమానాశ్రయానికి పేరు సూచించండి

మామునూర్ విమానాశ్రయానికి తగిన పేరును సూచించాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని విమానాశ్రయానికి పేరు నిర్ణయించే ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.

# ఎర్రవల్లిలో భూముల రీ-సర్వే.. మూడో రోజూ ముమ్మరం!

- సర్వే నంబర్ 325 భూములపై క్షేత్ర స్థాయిలో కొనసాగుతున్న పరిశీలన
- మూడు ప్రత్యేక బృందాలతో పాండవుల చెరువు, గుట్టలు, కాలువల హద్దుల గుర్తింపు
- శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా భూముల సరిహద్దుల నిర్ధారణ
- 113 ఎకరాల భూమి విలీనంపై పాత రికార్డుల ప్రకారం న్యాయం చేయాలని గ్రామస్థుల విజ్ఞప్తి
- సర్వే నివేదిక ఆధారంగా త్వరలో రైతులకు నోటీసులు జారీ చేయనున్న అధికారులు

2 లో



# దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో ఊరట దక్కేనా

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. శనివారం మధ్యాహ్నం అత్యున్నత న్యాయస్థానంలో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో దానం నాగేందర్ ఎస్‌ఎల్‌పీని సుప్రీంకోర్టు విచారణకు స్వీకరిస్తుందా లేదా అనే అంశంపై ఆసక్తి నెలకొంది.

### బీఆర్ఎస్ తరపున గెలిచి కాంగ్రెస్‌లో చేరిక

2023 అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ తరపున ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ అంశాలను ప్రస్తావిస్తూ బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అనర్హత పిటిషన్లు దాఖలు చేశారు.

### హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టుకు

పిటిషన్లను విచారించిన తెలంగాణ హైకోర్టు.. స్పీకర్ గడ్డం ప్రసాద్ గతంలో ఇచ్చిన నిర్ణయాన్ని పక్కనపెట్టి దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించింది. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ నిబంధనల ప్రకారం అనర్హత వర్తిస్తుందని పేర్కొంది. ఈ అనర్హత 2024 ఏప్రిల్ 23 నుంచి అమల్లోకి వస్తుందని తెలిపింది. ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానాన్ని ఖాళీగా పరిగణించాలని, తీర్పు ప్రతులను స్పీకర్ కార్యాలయం, ఎన్నికల సంఘానికి పంపాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

### ఎస్‌ఎల్‌పీ దాఖలుతో ఆటోమేటిక్‌గా స్టే కాదు

కేవలం ఎస్‌ఎల్‌పీ దాఖలు చేసినంత మాత్రాన హైకోర్టు తీర్పుపై ఆటోమేటిక్‌గా స్టే లభించదని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ముందుగా సుప్రీంకోర్టు పిటిషన్‌ను పరిశీలించి విచారణకు స్వీకరించాలా లేదా అన్నది నిర్ణయించాల్సి ఉంటుంది. పిటిషన్‌ను స్వీకరించి అప్పీల్‌కు అనుమతిస్తే హైకోర్టు తీర్పులోని న్యాయపరమైన అంశాలను సుప్రీంకోర్టు పరిశీలించే అవకాశం ఉంటుంది.

### ఏలేటి, కౌశిక్‌రెడ్డి కేవియట్లు

ఇదే కేసులో పిటిషనర్లు అయిన బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సుప్రీంకోర్టులో కేవియట్లు దాఖలు చేశారు. దానం నాగేందర్ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తే తమ వాదనలు కూడా వినాలని వారు కోరారు. దీంతో ఎస్‌ఎల్‌పీపై తదుపరి విచారణలో వారి తరఫు వాదనలు కూడా ప్రాధాన్యం సంతరించుకోనున్నాయి.


### ఖైరతాబాద్ ఉపఎన్నికపై ఉత్కంఠ

హైకోర్టు తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా పరిగణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో తదుపరి న్యాయపరిణామాలపై ఉత్కంఠ నెలకొంది. ఎస్‌ఎల్‌పీపై సుప్రీంకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది కీలకంగా మారింది. మరోవైపు అవసరమైతే ఉపఎన్నికకు సిద్ధంగా ఉన్నట్లు దానం నాగేందర్ ఇప్పటికే ప్రకటించారు.

# ‘నాలాపై నిర్మించారు’ జన్వాడ ఫాంహౌస్‌పై కాంగ్రెస్ నేతల సంచలన ఆరోపణలు.. !

- ఫాంహౌస్ నిర్మాణానికి అనుమతులు లేవని కాంగ్రెస్ ఎంపీలు ఆరోపణ
- నాలాపై ఫాంహౌస్ నిర్మించారని మల్లు రవి, చామల కిరణ్ కుమార్ వ్యాఖ్యలు
- ఫాంహౌస్ ఎవరి పేరుపై ఉందో స్పష్టత లేదన్న మల్లు రవి
- కేటీఆర్ స్నేహితుడే ప్రదీప్‌రెడ్డి
- భూములు ఎలా వచ్చాయని చామల కిరణ్ ప్రశ్న
- కాంగ్రెస్ నేతల పర్యటనను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ శ్రేణుల యత్నం.. ఉద్రిక్తత





**హైదరాబాద్, ప్రజా వాయిస్:** జన్వాడ ఫాంహౌస్‌పై కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు సంచలన ఆరోపణలు చేశారు. శనివారం కాంగ్రెస్ ప్రజా ప్రతినిధుల బృందం జన్వాడ ఫాంహౌస్ వద్దకు వెళ్లి అక్కడి భూములను పరిశీలించింది. ఫాంహౌస్ నిర్మాణానికి అనుమతులు లేవని, నాలాపై నిర్మించారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు.

### అక్రమాలను ప్రజలకు తెలియజేసేందుకే వచ్చాం

ఫాంహౌస్ భూములను పరిశీలించిన అనంతరం ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ.. జన్వాడ ఫాంహౌస్‌లోని అక్రమాలను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో అక్కడికి వచ్చినట్లు తెలిపారు. నాలాపై ఫాంహౌస్ నిర్మించారని, దాని నిర్మాణానికి అనుమతులు లేవని ఆరోపించారు. ఫాంహౌస్ ఎవరి పేరుపై ఉందనే విషయంలో స్పష్టత లేదన్నారు.

### భూములు ఎలా వచ్చాయన్న చామల కిరణ్

ఎంపీ చామల కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. ఫాంహౌస్ వద్దకు వస్తే కేసులు పెడతామని ప్రదీప్‌రెడ్డి హెచ్చరించారని ఆరోపించారు. ఇన్ని ఎకరాల్లో ఫాంహౌస్ ఎలా నిర్మించారని ప్రశ్నించారు. జన్వాడ ఫాంహౌస్ వద్ద డ్రోన్ ఎగురవేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు పెట్టారని గుర్తుచేశారు. కేటీఆర్ స్నేహితుడే ప్రదీప్‌రెడ్డి అని, ఆయనకు ఫాంహౌస్ భూములు ఎలా వచ్చాయని ప్రశ్నించారు.

### కేటీఆర్ కుటుంబానికి భూములపై ఆరోపణలు

కేటీఆర్ జన్వాడ ఫాంహౌస్‌లో అద్దెకు ఉంటున్నారని ప్రదీప్‌రెడ్డి గతంలో చెప్పారని చామల కిరణ్ తెలిపారు. పురపాలక మంత్రిగా కేటీఆర్ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. సత్యం రామలింగ రాజుకు చెందిన భూముల్లో ఫాంహౌస్ నిర్మించారని పేర్కొన్నారు. కేటీఆర్ సతీమణి శైలిమ పేరుతో, ఆయన అత్త పేరుతో కూడా ఇక్కడ భూములు ఉన్నాయని ఆరోపించారు. ఈ భూములన్నీ శతభిష ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందినవని చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు.

### కాంగ్రెస్ బృందాన్ని అడ్డుకునేందుకు యత్నం

మరోవైపు జన్వాడ ఫాంహౌస్ వద్ద కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. భూములను పరిశీలించేందుకు వచ్చిన కాంగ్రెస్ నేతల బృందాన్ని బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకునేందుకు ప్రయత్నించాయి. దీంతో పోలీసులు వారిని అడ్డుకుని పక్కకు నెట్టడంతో అక్కడ హైటెన్షన్ వాతావరణం ఏర్పడింది.

# హఫీజ్‌పేట్‌లో మహిళపై దాడి.. హోంగార్డ్‌పై వేటు!

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** నగరంలోని హఫీజ్‌పేట్ రైల్వేస్టేషన్ వద్ద మహిళపై దాడి చేసిన ఘటనలో హోంగార్డ్‌పై కఠిన చర్యలు తీసుకున్నారు. వికారాబాద్‌కు చెందిన తెలంగాణ పోలీస్ హోంగార్డ్ ఆనంద్‌ను సర్వీసు నుంచి డిస్మిస్ చేస్తూ ఆ జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఉత్తర్వులు జారీ చేశారు. మహిళ పై దాడి ఘటనకు సంబంధించిన వీడియో వెలుగులోకి రావడంతో పోలీస్ శాఖ చర్యలకు ఉపక్రమించింది.

### ఇప్పటికే కేసు నమోదు

మహిళపై దాడి చేసిన ఘటనలో హోంగార్డ్ ఆనంద్‌పై మియాపూర్ పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేశారు. అనంతరం అతడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

### డీజీపీ సీరియస్

ఈ ఘటనపై డీజీపీ సీవీ ఆనంద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హోంగార్డ్ ఆనంద్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. సిబ్బంది ఏ స్థాయిలో ఉన్నా.. ఎలాంటి పరిస్థితి ఎదురైనా ఇలాంటి ప్రవర్తనను క్షమించేది లేదని స్పష్టం చేశారు. పోలీసులకు ఇచ్చే శిక్షణ, ఆదేశాలకు విరుద్ధంగా వ్యవహరించడం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు.

### మహిళపై ప్రవర్తన ఖండనీయం

మహిళ పట్ల హోంగార్డ్ ఆనంద్ వ్యవహరించిన తీరు ఖండించదగినదని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది ప్రజలతో బాధ్యతాయుతంగా, గౌరవంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

# ఎర్రవల్లిలో భూముల రీ-సర్వే.. మూడో రోజూ ముమ్మరం!

**సిద్దిపేట, ప్రజా వాయిస్:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని ఎర్రవల్లి పరిధిలో సర్వే నంబర్ 325 భూముల రీ-సర్వే మూడో రోజు కూడా ముమ్మరంగా కొనసాగుతోంది. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ, సర్వే అధికారులు మూడు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి భూముల హద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు.

### శాటిలైట్ మ్యాపింగ్‌తో హద్దుల గుర్తింపు

పాండవుల చెరువు, గుట్ట ప్రాంతాలు, కాలువల హద్దులను అధికారులు శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా గుర్తిస్తున్నారు. క్షేత్రస్థాయిలో లభిస్తున్న వివరాలను పాత రికార్డులతో సరిపోల్చుతూ సర్వే ప్రక్రియను కొనసాగిస్తున్నారు.

### 113 ఎకరాల భూమిపై గ్రామస్థుల అభ్యంతరం

మరోవైపు శివారు వెంకటాపూర్ గ్రామానికి చెందిన 113 ఎకరాల భూమి విలీనంపై గ్రామస్థులు స్పందించారు. పాత రికార్డులను పరిశీలించి వాటి ఆధారంగా న్యాయం చేయాలని అధికారులను కోరుతున్నారు.

### రైతులకు త్వరలో నోటీసులు

ప్రస్తుతం కొనసాగుతున్న రీ-సర్వే పూర్తయిన అనంతరం నివేదికను అధికారులు సిద్ధం చేయనున్నారు. సర్వే నివేదిక ఆధారంగా రైతులకు త్వరలో నోటీసులు జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

# కేసీఆర్ కుటుంబ భూములపై విచారణకు కట్టుబడి ఉన్నాం

మొదటి పేజీ తరువాయి

చెప్పారు. 22ఏ అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని, ప్రతిపక్షాలు విష ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు.

### కాళేశ్వరం విచారణపై బీజేపీ నేతలకు ప్రశ్న

కాళేశ్వరం వ్యవహారంపై సీబీఐ విచారణ కోరుతూ లేఖ రాశామని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. విచారణ ఎందుకు చేపట్టడం లేదో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నెలాఖరులోగా పెండింగ్ డీసీసీలు, కార్పొరేషన్లు, ఇతర పదవుల భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తామని వెల్లడించారు.

### ఫిరాయింపులపై బీఆర్ఎస్, బీజేపీకి నైతిక హక్కు లేదని వ్యాఖ్య

హైకోర్టు తీర్పు బీఆర్ఎస్‌కు కనువిప్పు అని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డిలను బీఆర్ఎస్‌లో చేర్చుకుని మంత్రి పదవులు ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు బీజేపీకి కూడా లేదని, వివిధ రాష్ట్రాల్లో ఇతర పార్టీల నేతలను బీజేపీ చేర్చుకుందని ఆరోపించారు. 2014లో జరిగిన పార్టీ ఫిరాయింపులు, 2023లో జరిగిన ఫిరాయింపుల మధ్య వ్యత్యాసం ఉందన్నారు.

### ఎర్రవల్లి ఫాంహౌస్‌పై ప్రశ్నలు

జన్వాడ ఫాంహౌస్‌పై బీఆర్ఎస్ నేతలు మాట్లాడటాన్ని మహేశ్ కుమార్ గౌడ్ తప్పుబట్టారు. ఫాంహౌస్ సంస్కృతిని తీసుకొచ్చింది బీఆర్ఎస్ అని విమర్శించారు. ఎర్రవల్లి ఫాంహౌస్ ఎన్ని ఎకరాల్లో ఉందో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ ఫాంహౌస్ అంశంపై మూడు రకాల ప్రకటనలు చేశారని పేర్కొన్నారు. కేసీఆర్ ఫాంహౌస్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు.

### ఖైరతాబాద్‌పై కాంగ్రెస్ ధీమా

ఖైరతాబాద్ ఉపఎన్నిక ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ సిద్ధంగా ఉందని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. టికెట్ ఎవరికి ఇచ్చినా ఖైరతాబాద్ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. దానం నాగేందర్ విషయంలో ఏఐసీసీ నిర్ణయమే తుది నిర్ణయమని చెప్పారు. కడియం శ్రీహరిపై పార్టీ పరంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు.

### బీజేపీపై విమర్శలు.. కాంగ్రెస్ గెలుపుపై ధీమా

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ నేతలు ఆశపడుతున్నారని, అయితే రాష్ట్రంలో ఆ పార్టీకి అవకాశం ఉండదని మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. బీజేపీ మాటలకు, చేతలకు పొంతన లేదని విమర్శించారు. తెలంగాణలో బీఆర్ఎస్ క్షేత్రస్థాయిలో లేదని, బీజేపీ కూడా రాష్ట్రంలో ఎదగదని అన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన అభ్యర్థుల నివేదిక వచ్చిన తర్వాత ఎంపిక ప్రక్రియ చేపడతామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# 30 వేల మంది.. 350 కంపెనీలు

మొదటి పేజీ తరువాయి

ఎమ్మెల్యే పద్మావతి దంపతులు నిరంతరం కృషి చేస్తున్నారని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలనే తపన వారిలో ఉందని పేర్కొన్నారు.ఉమ్మడి నల్గొండ జిల్లాలో సాగునీరు, రహదారుల అభివృద్ధికి సుమారు రూ.10 వేల కోట్లతో వివిధ కార్యక్రమాలు చేపట్టేందుకు మంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. రైతుల పంటలను కాపాడేందుకు సాగునీటి వనరుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని చెప్పారు.రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని గుత్తా తెలిపారు. రైతు సంక్షేమం, సాగునీరు, రహదారుల అభివృద్ధితో పాటు యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

### పకడ్బందీగా ఏర్పాట్లు

జాబ్‌మేళా నిర్వహణకు అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నరసింహ ఆధ్వర్యంలో భద్రత, ఇతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ ప్రతినిధులు, ఇతర సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కేటీఆర్ సుద్దపూస మాటలు ఆపాలి

మొదటి పేజీ తరువాయి

సుద్దపూస మాటలు ఆపాలని వ్యాఖ్యానించారు.

### కేటీఆర్‌పై సంజయ్ ప్రశ్నల వర్షం

పొత్తూర్ లాజిస్టిక్ పార్క్‌ను కేటీఆర్ నడుపుతున్నారని, కొంతమందితో కలిసి హోటళ్లు, రెస్టారెంట్లు నిర్వహిస్తున్నారని బండి సంజయ్ ఆరోపించారు. ఖానాపూర్‌లో టికెట్ మార్చడానికి కారణమేంటని ప్రశ్నించారు. గతంలో ఆంధ్ర అడ్వకేట్లను విమర్శించిన కేటీఆర్.. ఇప్పుడు వారితోనే ఎందుకు సన్నిహితంగా ఉంటున్నారని నిలదీశారు.

### 200 మందికిపైగా ఉద్యోగ నియామక పత్రాలు

రోజ్‌గార్ మేళాలో భాగంగా 200 మందికిపైగా ఉద్యోగ నియామక పత్రాలు అందజేశామని బండి సంజయ్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల్లోని నిరుపేద యువతకు ఉద్యోగాలు కల్పించామని చెప్పారు.

### ఖైరతాబాద్ ఉపఎన్నికపై ధీమా

ఖైరతాబాద్ ఉపఎన్నిక అనివార్యమవుతుందని బండి సంజయ్ అన్నారు. ఆ ఎన్నికలో బీజేపీదే విజయమని ధీమా వ్యక్తం చేశారు.

# డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టిన కారు

- తృటిలో తప్పిన పెను ప్రమాదం!
- సిద్దిపేట నుంచి గజ్వేల్ వెళ్తుండగా అదుపుతప్పిన కారు
- ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకోవడంతో తల్లిదండ్రులకు తప్పిన ప్రాణాపాయం
- కూతురికి తల, ముక్కుకు తీవ్ర గాయాలు
- ప్రమాద సమయంలో అటుగా వెళ్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ వెంటనే స్పందన
- బాధితులను కారులో నుంచి బయటకుతీసి పోలీసు వాహనంలో ఆస్పత్రికి తరలింపు



**సిద్దిపేట, ప్రజా వాయిస్:** సిద్దిపేట నుంచి గజ్వేల్ వెళ్తున్న కారు డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న దంపతులకు ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. అయితే వెనుక సీట్లో కూర్చున్న వారి కూతురికి తీవ్ర గాయాలయ్యాయి. సిద్దిపేటలో పరీక్ష రాసిన కూతురిని గజ్వేల్‌కు తీసుకెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం.

### కూతురికి తీవ్ర గాయాలు

కారును తండ్రి నడుపుతుండగా.. భార్య ముందు సీట్లో, కూతురు వెనుక సీట్లో కూర్చున్నారు. కారు డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టడంతో ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకున్నాయి. దీంతో తల్లిదండ్రులు సురక్షితంగా బయటపడగా.. కూతురి తల, ముక్కుకు తీవ్ర గాయాలయ్యాయి.

### బండి సంజయ్ వెంటనే స్పందన

అదే సమయంలో సిరిసిల్ల వైపు వెళ్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రమాదాన్ని గమనించి వెంటనే తన వాహనాన్ని ఆపారు. భద్రతా సిబ్బందితో కలిసి ప్రమాదానికి గురైన కారు వద్దకు వెళ్లి బాధితులను కారులో నుంచి బయటకు తీసేందుకు సహాయపడ్డారు.

### పోలీసు వాహనంలో ఆస్పత్రికి తరలింపు

గాయపడిన కూతురితో పాటు కుటుంబ సభ్యులను వెంటనే పోలీసు వాహనంలో ఆస్పత్రికి తరలించేలా బండి సంజయ్ చర్యలు తీసుకున్నారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని పోలీసు అధికారులను ఆయన కోరారు. ప్రమాద సమయంలో కేంద్ర మంత్రి సకాలంలో స్పందించడంతో బాధిత కుటుంబానికి తక్షణ సహాయం అందింది.

# మామునూరు విమానాశ్రయానికి ‘రుద్రమ’ లేదా ‘కాకతీయ’ పేరు

- సందీప్‌రెడ్డి వంగా సూచన!
- వరంగల్ విమానాశ్రయానికి పేరు సూచించాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- ‘రుద్రమ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్’, ‘కాకతీయ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్’ పేర్లను సూచించిన సందీప్‌రెడ్డి వంగా
- కాకతీయుల చరిత్ర, సంస్కృతి, వారసత్వం ప్రతిబింబించేలా పేరు ఉండాలని దర్శకుడి అభిప్రాయం
- మామునూరు విమానాశ్రయం కోసం రూ.295 కోట్ల భూసేకరణ నిధులు కేటాయించిన ప్రభుత్వం
- సందీప్‌రెడ్డి వంగా సూచనకు ‘దట్స్ ది స్పిరిట్’ అంటూ సీఎం రేవంత్‌రెడ్డి స్పందన



**వరంగల్, ప్రజా వాయిస్:** వరంగల్ మామునూరులో నిర్మాణ దిశగా అడుగులు పడుతున్న విమానాశ్రయానికి ఏ పేరు పెట్టాలో సూచించాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను కోరారు. దీనిపై వచ్చిన వార్తా కథనాలను తన అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాలో పంచుకున్నారు. గత ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉన్నా వరంగల్ ప్రజల విమానాశ్రయ కలను నెరవేర్చలేకపోయిందని సీఎం విమర్శించారు. ప్రస్తుతం ప్రజాపాలనలో ఆ కల సాకారం అవుతోందని పేర్కొన్నారు.

### ‘ఇది కేవలం విమానాశ్రయం కాదు’

మామునూరు విమానాశ్రయం కోసం భూసేకరణకు ప్రభుత్వం రూ.295 కోట్లు కేటాయించిందని రేవంత్‌రెడ్డి తెలిపారు. అవసరమైన భూమిని ఇప్పటికే స్వాధీనం చేసుకుని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగించినట్లు వెల్లడించారు. ఈ విమానాశ్రయం పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉద్యోగాలు, పెట్టుబడులకు గేట్‌వేగా మారుతుందని పేర్కొన్నారు. మామునూరు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రయాణించే రోజు కోసం తాను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు.

### రెండు పేర్లు సూచించిన సందీప్‌రెడ్డి వంగా

సీఎం పిలుపుపై ప్రముఖ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా స్పందించారు. తన సొంత ప్రాంతమైన వరంగల్‌కు అంతర్జాతీయ విమానాశ్రయం రాబోతుండటంపై సంతోషం వ్యక్తం చేశారు. విమానాశ్రయానికి ‘రుద్రమ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్’ లేదా ‘కాకతీయ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్’పేర్లలో ఒకటి పెట్టాలని సూచించారు.

### కాకతీయుల చరిత్రకు గుర్తుగా పేరు

వరంగల్‌కు వేల సంవత్సరాల చరిత్ర ఉందని, కాకతీయుల సంస్కృతి, వారసత్వాన్ని గుర్తు చేసేలా విమానాశ్రయానికి పేరు ఉండాలని సందీప్‌రెడ్డి వంగా తన అభిప్రాయాన్ని వెల్లడించారు. విమానాశ్రయ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

### ‘దట్స్ ది స్పిరిట్’ అంటూ సీఎం స్పందన

సందీప్‌రెడ్డి వంగా చేసిన సూచనపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ ‘దట్స్ ది స్పిరిట్’ అంటూ సమాధానం ఇచ్చారు. దీంతో వీరిద్దరి సామాజిక మాధ్యమ పోస్టులు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. కాగా, సందీప్‌రెడ్డి వంగా ప్రభాస్‌తో ‘స్పిరిట్’ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే.

## 'ప్రజా వాయిస్' కథనానికి శరవేగ స్పందన

- గంటల వ్యవధిలోనే విద్యుత్ స్తంభం సమస్యకు పరిష్కారం
- హుటాహుటిన రంగంలోకి దిగిన విద్యుత్ శాఖ సిబ్బంది
- క్రాస్ ఆర్మ్ ఏర్పాటు చేసి వేలాడుతున్న వైర్లకు భద్రత
- ప్రమాదాన్ని నివారించడంతో ఊపిరిపీల్చుకున్న స్థానికులు
- 'ప్రజా వాయిస్'కు, విద్యుత్ శాఖ అధికారులకు ప్రజల ధన్యవాదాలు.



**ప్రజా వాయిస్, మిర్యాలగూడ.** మిర్యాలగూడ గ్రేడ్–1 మున్సిపాలిటీ పరిధిలోని ఈదులగూడెం బైపాస్ వద్ద అద్దంకి–నార్కేట్‌పల్లి–మేదరమెట్ల ప్రధాన రహదారిపై విరిగి ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభంపై 'ప్రజా వాయిస్'లో ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు శరవేగంగా స్పందించారు.'విరిగిన విద్యుత్ స్తంభం.. అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ఠ' అనే శీర్షికతో 'ప్రజా వాయిస్'లో కథనం ప్రచురితమైన కొద్ది గంటల్లోనే సంబంధిత విద్యుత్ శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడి పరిస్థితిని పరిశీలించిన అనంతరం పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి క్రాస్ ఆర్మ్ (కాసారం) ఏర్పాటు చేసి, వేలాడుతున్న విద్యుత్ వైర్లను సురక్షితంగా అనుసంధానించారు. దీంతో ప్రమాదకర పరిస్థితికి తాత్కాలికంగా పరిష్కారం లభించడంతో పాటు విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించారు.ప్రజా సమస్యను వెలుగులోకి తీసుకువచ్చిన 'ప్రజా వాయిస్' కథనానికి, అలాగే వెంటనే స్పందించి చర్యలు చేపట్టిన విద్యుత్ శాఖ అధికారులకు స్థానిక ప్రజలు, వాహనదారులు ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో మీడియా కథనాలకు అధికారులు స్పందించి చర్యలు తీసుకోవడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.

# కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతున్నరు

- కాంగ్రెస్ పార్టీ నాయకులు, పోలీసులు, ఎమ్మెల్యే తీరుపై సర్పంచ్ ఆగ్రహం
- గ్రామస్తుల అడ్డుకున్న పంచాయితీ భవనం కూల్చివేత
- ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే చర్యలా..?
- తీర్మానంలో గ్రంథాలయానికి కేటాయించి మర్మత్తులు
- పాలకవర్గాన్ని, చట్టాలను అవహేళన చేస్తున్నరు
- సర్పంచ్ భర్తను బలవంతంగా అరెస్ట్ చేసిన పోలీసులు
- పాత గ్రామ పంచాయతీ కార్యాలయం కూల్చివేతపై వివాదం





**ప్రజా వాయిస్, తిమ్మాపూర్** (సెప్టెంబర్ 19 ): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామంలో శనివారం తెల్లవారు జాము నుండి ఉద్రిక్తత చోటుచేసుకుంది. గ్రామ పాత గ్రామపంచాయతీని కూల్చేందుకు తమకు ఆర్డర్స్ ఉన్నాయంటూ అధికారులు గ్రామ పంచాయతీ వద్దకు వచ్చారు. దీంతో సర్పంచ్‌తో పాటు పాలకవర్గ సభ్యులు అడ్డుకున్నారు. అర్ధరాత్రి నుండి నడిచిన హైడ్రామా నడుమ ఉదయం పోలీసులు ఎంట్రీ ఇచ్చి బలవంతంగా పలకవర్గాన్ని అడ్డుకుని జేసీబీతో పాత గ్రామపంచాయతీ భవనాన్ని కూల్చుతున్నారు. దీంతో నోటీసులు ఇవ్వకుండా కుల్చడానికి రావడంతో సర్పంచ్‌తో పాటు పాలకవర్గ సభ్యులు అడ్డుకున్నారు. ప్రొసీజర్ పాటించకుండా ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని సర్పంచ్ సునీత ఆరోపించారు. తిమ్మాపూర్ సర్కిల్ పోలీసులతో భారీ బందోబస్తు నడుమ వచ్చిన అధికారులు సర్పంచ్ సునీత భర్త పొన్నం అనిల్ గౌడ్ ను బలవంతంగా అరెస్ట్ చేశారు. దీంతో అధికారులు, పాలకవర్గానికి తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కాగా అధికారులు మాత్రం తమకు కలెక్టర్ ఆదేశాలు ఉన్నాయంటూ వాదించారు. తమకు కూడా గతంలో కూల్చవద్దని గ్రామపంచాయతీ ఇతర అవసరాలకు పాత కార్యాలయాన్ని వినియోగించుకోవాలని గతంలో చెప్పినట్లు పాలకవర్గం వివరించింది. మన్నెంపల్లి గ్రామ యువత లైబ్రరీ కీ చెందాల్సిన భవనాన్ని అక్రమ కూల్చివేతను తీవ్రంగా కండిస్తుందని స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ లీడర్స్ కీ మాత్రమే ఎమ్మెల్యే న, మొత్తం నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే నా అని గ్రామ ప్రజలు, యువత అడుగుతుందన్నారు. ఎమ్మెల్యే మరియు గ్రామ అభివృద్ధి కీ ఏమాత్రం సహాయం చేయకుండా, గ్రామ అభివృద్ధికి అడ్డు గోడల నిలుస్తున్నారని, గ్రామ పంచాయతీ కూల్చివేతలో పూర్తి రాజ్యాంగ విరుద్ధంగా వ్యహరించడం సిగ్గుచేటని, రానున్న రోజుల్లో ఓటు అనే ఆయుధంతో మీకు సరైన సమాధానం, బుద్ధి చెప్పేందుకు ప్రజలు, యువత సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.



## వానొస్తే చెరువులను తలపిస్తున్న రహదారులు

- బాగారెడ్డి విగ్రహం వద్ద రోడ్డుపై వర్షపు నీరు వాగును తలపిస్తున్న దృశ్యం
- ప్రజలకు వాహన దారులకు రాకపోకలకు ఇబ్బందికరంగా మారిన వైనం..

**ప్రజా వాయిస్ జహీరాబాద్:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లో శనివారం సాయంత్రం కురిసిన చిన్న పాటి వర్షానికి చెరువులను తలపిస్తున్న బాగారెడ్డి విగ్రహం ఫ్లైఓవర్ వద్ద చెరువును తలపిస్తూ ప్రజా వాయిస్ చిక్కిన ఫోటో దృశ్యం. అంతేకాకుండా రోడ్డుకు సైడ్ నాలాలు లేకపోవడంతో వర్షం కురిసిన వర్షపు నీరు గంటల తరబడి రోడ్డుపైనే నిల్వ ఉంటూ వాహనదారులకు, కాలినడకన వెళ్లే ప్రజలకు ఇబ్బందికరంగా మారిన రహదారి.కావున వెంటనే మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ అధికారులు చొరవ చూపి శాశ్వత పరిష్కారం చూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు..

## వైరల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

- మల్కాపూర్ లో ప్రత్యేక వైద్య శిబిరం.. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన
- జ్వరం లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయొద్దు: డాక్టర్ షరీఫుద్దీన్



**పెద్ద శంకరంపేట ప్రజా వాయిస్ :**వైరల్ జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ షరీఫుద్దీన్ సూచించారు. మల్కాపూర్ గ్రామంలో సర్పంచ్ రాజేశ్వరి సుభాష్ ఆధ్వర్యంలో గ్రామ చావిడి వద్ద ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఆరోగ్య పరిరక్షణపై పలు సూచనలు అందించారు.శిబిరానికి వచ్చిన ప్రజలకు వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనారోగ్య లక్షణాలు ఉన్నవారిని గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని ఉన్నత వైద్య సేవల కోసం సంబంధిత ఆసుపత్రులకు పంపిస్తున్నట్లు వైద్యాధికారి తెలిపారు.వర్షాకాలంలో జ్వరం, జలుబు, దగ్గు వంటి అనారోగ్య లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, తాగునీటిని పరిశుభ్రంగా వినియోగించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యాదయ్య, గోపాల్, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ లో ఆకస్మిక తనిఖీ


- విద్యార్థుల సమస్యలు తెలుసుకున్న సీనియర్ సివిల్ జడ్జి ఏ.రాధిక
- సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ

**ప్రజావాయిస్/వికారాబాద్:** వికారాబాద్ రిక్షా కాలనీలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) హాస్టల్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఏ. రాధిక శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతి, మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్య పరిస్థితులను ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో మరుగుదొడ్లకు సంబంధించిన సమస్యలు అధికంగా ఉన్నట్లు ఎస్ఓ శ్రీమతి స్వరూప, సిబ్బంది ఆమె దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం హాస్టల్ భవనాన్ని పూర్తిగా పరిశీలించిన జడ్జి.. తక్కువ స్థలంలో అధిక సంఖ్యలో విద్యార్థులు వసతి పొందుతున్న విషయాన్ని గమనించారు.విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. హాస్టల్ సిబ్బంది నిర్వహిస్తున్న వివిధ రిజిస్టర్లను కూడా తనిఖీ చేశారు. హాస్టల్‌లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు, ఇతర వస్తువులను పరిశుభ్రంగా, సురక్షితంగా భద్రపరచాలని సిబ్బందికి సూచించారు.విద్యార్థులకు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించడంతో పాటు వారి సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు.ఈ ఆకస్మిక తనిఖీలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయవాది పి.రాము, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎన్. శ్రీనివాస్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తదితరులు పాల్గొన్నారు.



## సురయ్యపల్లిలో రేషన్ 'షాక్'

- ఇంటి పన్ను కడితేనే డిజిటల్ కార్డులు
- నూతన డిజిటల్ కార్డుల పంపిణీలో నిబంధనల ఉల్లంఘన
- పన్ను చెల్లిస్తేనే రేషన్ కార్డు అంటూ సెక్రటరీ 'హుకుం'
- సురయ్యపల్లి సెక్రటరీ తీరుపై మండిపడుతున్న జనం
- రేవంత్ రెడ్డి సర్కార్ ఆర్డర్ ఇచ్చిందా? లేక ఆఫీసరే రాచరికం నడుపుతున్నారా?




**ప్రజా వాయిస్ మంథని** ప్రజా సంక్షేమమే పరమావధిగా ఉచిత రేషన్ బియ్యం, డిజిటల్ కార్డులు అందిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం గగ్గోలు పెడుతుంటే.. క్షేత్రస్థాయిలో మాత్రం అధికారులు తమ సొంత చట్టాలను అమల్లోకి తెస్తూ పేదల పొట్ట కొడుతున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం కాగా, ఇంటి పన్ను కడితేనే కార్డు ఇస్తాం.. లేదంటే లేదు అంటూ ఓ గ్రామ పంచాయతీ కార్యదర్శి జారీ చేసిన హుకుం ఇప్పుడు స్థానికంగా తీవ్ర దుమారం రేపుతోంది. వివరాల్లోకి వెళ్తే...పెద్దపల్లి జిల్లా (లేదా సంబంధిత ప్రాంతం) సురయ్యపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో 19-9-2026 శనివారం రోజున ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు హనుమాన్ గుడి ప్రాంగణంలో నూతన డిజిటల్ రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. అంతవరకు బాగానే ఉన్నా, ఆ ప్రకటనలో పెట్టిన నిబంధనలే గ్రా ప్రజల మండిపాటుకు కారణమయ్యాయి. 2026-2027 సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్ను పూర్తిగా చెల్లిస్తేనే రేషన్ కార్డు ఇస్తామని, ఒకవేళ ఆర్ సిసి బిల్డింగ్ ఉండి ఇంటి పన్ను రూ. 1250 కంటే తక్కువ ఉంటే.. బలవంతంగా రూ. 1250 చెల్లించాల్సిందేనని స్పష్టం చేయడం గమనార్హం.




### అధికారులు స్పందించాలి..

డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీని ఇంటి పన్ను వసూళ్లకు ముడిపెడుతూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న సదరు పంచాయతీ కార్యదర్శిపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనల పేరుతో పేదలను వేధించకుండా, అర్హులైన అందరికీ ఎలాంటి షరతులు లేకుండా వెంటనే రేషన్ కార్డులు అందించాలని కోరుతున్నారు.

## అభివృద్ధికి ఆమడదూరంలో సంధ్యానగర్ పార్క్..!

- పచ్చదనం,వాకింగ్ ట్రాక్ తో ఆహ్లాదకర వాతావరణం కల్పించాలి
- తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను కలిసి వినతి పత్రాన్ని అందజేసి కోరిన ఆర మైసమ్మ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు



**ప్రజా వాయిస్//రాజేంద్రనగర్:**బండ్లగూడ జాగీర్ సంధ్యానగర్ కాలనీలోని పార్క్‌ను అన్ని వసతులతో అభివృద్ధి చేసి కాలనీవాసులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని ఆరమైసమ్మ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు.మాజీ కార్పొరేటర్ సాగర్‌గౌడ్ ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. పార్క్‌లో ప్రస్తుతం పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు లేకపోవడంతో స్థానికులు ఆశించిన స్థాయిలో వినియోగించుకోలేకపోతున్నారని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.నర్సింగ్ రావు మాట్లాడుతూ.. పార్క్‌లో పచ్చదనం పెంపొందించడం,వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడం, తాగునీటి వసతి కల్పించడం, కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేయడం వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు.దీంతో వృద్ధులు,మహిళలు,పిల్లలు పార్క్‌ను సౌకర్యవంతంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.అదేవిధంగా సంధ్యానగర్ కాలనీలో కొంతకాలంగా తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడం,అరకొరగా నీరు రావడం,నీటి ఒత్తిడి తక్కువగా ఉండటం వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.కాలనీలో నీటి సరఫరా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి, క్రమబద్ధంగా తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.పార్క్ అభివృద్ధితో పాటు తాగునీటి సమస్యను పరిష్కరిస్తే సంధ్యానగర్ కాలనీవాసులకు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని,ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు ఆరోగ్యకరమైన వాతావరణంలో సమయం గడిపేందుకు అవకాశం ఉంటుందని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ.. సంధ్యానగర్ పార్క్ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని పార్క్‌లో పచ్చదనం, వాకింగ్ ట్రాక్, కూర్చునేందుకు బల్లలు, నీటి వసతి వంటి మౌలిక సదుపాయాలు కల్పించేలా అధికారులతో మాట్లాడుతామని,కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిశీలించి, సక్రమంగా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అసోసియేషన్ సభ్యులకు హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

## 'ప్రజా వాయిస్' దెబ్బ.. కదిలిన యంత్రాంగం!


- మార్కెట్ రోడ్డు, మ్యాన్ హోళ్ల మరమ్మతు పనులు ప్రారంభం
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు, వాహనదారులు



ప్రజా వాయిస్ ఎఫెక్ట్....

**ప్రజా వాయిస్ గోదావరిఖని ఏళ్ల** తరబడి వేధిస్తున్న సమస్యలు.. కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న గుంతలు, రోడ్డు కంటే ఎత్తుగా లేచిన మ్యాన్‌హోళ్లు, అస్తవ్యస్తంగా తయారైన కూరగాయల మార్కెట్ రోడ్డు దుస్థితిపై 'ప్రజా వాయిస్' ప్రచురించిన వరుస కథనాలకు రామగుండం నగరపాలక సంస్థ అధికారులు చివరకు స్పందించారు. మిగతా ఏ ప్రధాన పత్రికలు పట్టించుకోని స్థానిక ప్రజా సమస్యను నిరంతరం వెలుగులోకి తెస్తూ 'ప్రజా వాయిస్' అందిస్తున్న కథనాలకు కార్పొరేషన్ యంత్రాంగంలో కదలిక వచ్చింది. రామగుండం కార్పొరేషన్ పరిధిలోని కూరగాయలు, చికెన్-మటన్ మార్కెట్ ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల పేరుతో వదిలేసిన ఎత్తైన మ్యాన్‌హోళ్లు, గుంతల వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్న తీరుపై 'ప్రజా వాయిస్' దినపత్రిక ఆధారాలతో సహా కథనాన్ని ప్రచురించింది. రోడ్డు సరిగ్గా లేక, వర్షం వస్తే నీరు నిలిచిపోయి వ్యాపారులు, వినియోగదారులు పడుతున్న అవస్థలను ప్రధానంగా ప్రస్తావించింది. ఈ వార్తకు తక్షణమే స్పందించిన కార్పొరేషన్ ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ సిబ్బందిని రంగాన దించి పనులను వేగవంతం చేశారు. రోడ్డు లెవెలింగ్ పనులు చేపడుతూ, మ్యాన్‌హోళ్లను వాహనాల రాకపోకలకు అనుకూలంగా సరిచేసే పనులను ప్రారంభించారు. అలాగే పారిశుధ్య పనులపై కూడా దృష్టి సారించారు. ఏళ్లుగా అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో నరకం చూసిన తమ సమస్యను ప్రాధాన్యతతో వెలుగులోకి తెచ్చి, పరిష్కారం లభించేలా చేసిన 'ప్రజా వాయిస్' పత్రిక యాజమాన్యానికి, విలేకరికి స్థానిక నివాసితులు, వ్యాపారులు, వాహనదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న పత్రికగా 'ప్రజా వాయిస్' మరోసారి తన పత్రికా ధర్మాన్ని చాటుకుందని వారు కొనియాడారు.


పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తక్షణమే స్పందించి రోడ్డు నిర్మించాలి



# రూ.9.99 లక్షల కరెన్సీతో కొలువుదీరిన గణనాథుడు

- భక్తులను విశేషంగా ఆకట్టుకున్న వినాయకుడి అలంకరణ

**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :**వినాయక నవరాత్రుల్లో భాగంగా సుల్తానాబాద్ పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో కొలువుదీరిన గణనాథుడు ప్రత్యేక అలంకరణతో భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాడు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడిని శుక్రవారం రాత్రి ఏకంగా రూ.9,99,999 విలువైన కరెన్సీ నోట్లతో సుందరంగా అలంకరించారు. రూ.20, రూ.50, రూ.100, రూ.500 నోట్లతో రూపొందించిన కరెన్సీ మాలలతో గణనాథుడిని అలంకరించడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు.కరెన్సీ నోట్లతో అలంకరించిన గణనాథుడిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక అలంకరణను ఆసక్తిగా తిలకిస్తూ భక్తులు గణనాథుడిని దర్శించుకున్నారు. అనంతరం చకిలం మారుతి లత, చిట్టిమల్ల వినయ్ వర్షిత దంపతులచే అర్చకులు పారువెల్ల అభిషేక్ శర్మ ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు కొమురవెల్లి రామ్మూర్తి, అధ్యక్షుడు కొమురవెల్లి భాస్కర్, కార్యదర్శి తోడుపునూరి రాజేంద్రప్రసాద్, క్యాషియర్ కొమురవెల్లి శ్రీనివాస్, పట్టణ మహిళా అధ్యక్షురాలు బాదం వాణితో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారస్తులకు అండగా.. ప్రజా వాయిస్ విలేకరి!!

- 30 ఏళ్లగా చేపల అమ్మకాలు చేస్తున్న సామాన్యుల పై పంచాయతీ అధికారులు చర్యలు
- మరి నేషనల్ హైవే పై ఏర్పాటు చేసిన బారికేడ్లు,సంత నిర్వహణ పై చర్యలు ఏవి అని ప్రశ్నించిన వైనం
- నిబంధనలు అందరికీ సమానంగా అమలు చేయాలన్న డిమాండ్
- కృతజ్ఞతలు తెలియజేసిన మత్స్యకారులు



**ప్రజా వాయిస్ బూర్గంపాడు** సారపాకలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, చిరు వ్యాపారుల జీవనోపాధి అంశాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. జాతీయ రహదారిపై వ్యాపారాలు నిర్వహించరాదని, వాహనదారులకు ఇబ్బందులు కలిగించేలా రోడ్డుపై వ్యాపారం చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సారపాక మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్ స్పష్టం చేసిన ఈ నేపథ్యంలో,రహదారి భద్రత విషయంలో అన్ని అంశాలపైనా సమాన దృష్టి పెట్టాలనే డిమాండ్ చేశారు.అయితే చిరు వ్యాపారుల సమస్యపై మన భద్రాద్రి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వెల్ఫేర్ సొసైటీ క్లబ్ సభ్యులు ప్రజా వాయిస్ విలేకరి స్పందించి వారికి అండగా నిలిచారు.సారపాక ప్రాంతం నేషనల్ హైవేపై ప్రతి ఆదివారం సంత నిర్వహిస్తుండగా, వాటికి లేని ఆంక్షలు, చర్యలు వీరిపై ఎలా తీసుకుంటారని ప్రశ్నించడం జరిగింది.30 ఏళ్లగా అదే స్థలంలో చేపలు అమ్ముకుంటు జీవనం కొనసాగించుకునే సామాన్యులపై ఇటువంటి చర్యలు సమంజసం కాదని ప్రత్యామ్నాయ స్థలం చూపించాలని కోరారు. దీనిపై స్పందించిన సర్పంచ్. ప్రత్యామ్నాయం చూపించే వరకు తాత్కాలికంగా రహదారికి వెనుక వైపునకు జరిపి వ్యాపారం కొనసాగించుకోవాలని వెసులుబాటు కల్పించారు. అయితే నేషనల్ హైవేపై ఎలాంటి వ్యాపారం నిర్వహించినా చట్టరీత్యా చర్యలు తప్పవని కూడా సర్పంచ్ స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. సారపాకలో జాతీయ రహదారిని ఆనుకుని కొనసాగుతున్న సంత, రోడ్డుపైకి విస్తరించిన వ్యాపారాలు, అడ్డదిడ్డంగా నిలిపే వాహనాలు, భారీ వాహనాల పార్కింగ్, హైవేపై ఐటీసీ ఏర్పాటుచేసిన బారికేడ్లు వంటి అంశాలు కూడా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయని పేర్కొంటున్నారు.జాతీయ రహదారిపై ఉన్న బారికేడ్లు, రహదారిపై ఏర్పడే అడ్డంకుల కారణంగా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. రహదారిపై అడ్డంకుల కారణంగా ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవిస్తున్న పరిస్థితులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతున్నారు. హైవేపై ఏర్పాటు చేసిన ప్రతి బారిగేట్స్, మలుపు, ప్రవేశ మార్గాన్ని భద్రతా ప్రమాణాల ప్రకారం పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.ఇక రోడ్డుపైనే కొనసాగుతున్న సంత కూడా సారపాకలో ప్రధాన సమస్యగా మారింది. సంత సమయంలో వందలాది మంది ప్రజలు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాలు ఒకేచోట చేరడంతో జాతీయ రహదారిపై రద్దీ పెరుగుతోంది. రోడ్డుపై సంత నిర్వహించడం వల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో పాటు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. గతంలో రోడ్డుపై సంత నిర్వహించబోమని చెప్పడంతో పాటు ప్రత్యేక స్థలం కేటాయిస్తామని ఇచ్చిన హామీ అమలు కాలేదని వారు ప్రశ్నిస్తున్నారు.అదేవిధంగా నేషనల్ హైవేకు ఇరువైపులా ఉన్న భూముల విషయంలోనూ అధికారులు సమగ్రంగా దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ భూములు, రహదారి హద్దులు, ఇతర భూములపై ఆక్రమణలు ఉన్నాయా అనే అంశంపై అధికారిక సర్వే నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా పెద్దల పేరుతో కొనసాగుతున్న భూ ఆక్రమణలను కూడా అరికట్టాలని, చిన్న వ్యాపారుల విషయంలో నిబంధనలు చెబుతున్నప్పుడు పెద్ద స్థాయిలో జరిగే ఆక్రమణలపైనా అదే విధంగా చర్యలు ఉండాలని ప్రజలు కోరుతున్నారు.ఈ మొత్తం వ్యవహారంపై స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కూడా ప్రత్యేక చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. సారపాకలో జాతీయ రహదారి భద్రత, సంత నిర్వహణ, రహదారి ఆక్రమణలు, పార్కింగ్, బారికేడ్లు, చిరు వ్యాపారుల సమస్యలను సంబంధిత అధికారులతో సమన్వయం చేసి శాశ్వత పరిష్కారం చూపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రహదారి అభివృద్ధితో పాటు ప్రజల ప్రాణ భద్రతకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు.

# కిష్టాపురం 2వ కాలువకు గండి


- రైతుల గోడు పట్టించుకోరా..?
- నాలుగు రోజులుగా వృథాగా పోతున్న సాగునీరు
- అధికారుల నిర్లక్ష్యంపై రైతుల ఆగ్రహం
- తక్షణమే గండి పూడ్చాలని బీజేపీ మండల అధ్యక్షుడు సతీష్ డిమాండ్



**ప్రజా వాయిస్,అనంతగిరి:** సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల పరిధిలోని కిష్టాపురం 2వ కాలువకు గండి పడి నాలుగు రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కాలువకు గండి పడిన విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు మరమ్మతు చర్యలు చేపట్టకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని బీజేపీ అనంతగిరి మండల అధ్యక్షుడు చింతకుంట్ల సతీష్ ఆరోపించారు.కాలువకు గండి పడటంతో సాగునీరు పెద్దఎత్తున వృథాగా ప్రవహిస్తోందని, పంటలకు అందాల్సిన నీరు సక్రమంగా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సాగు సమయంలో కాలువలకు మరమ్మతులు చేపట్టడంలో జాప్యం జరిగితే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కిష్టాపురం 2వ కాలువకు పడిన గండిని తక్షణమే పూడ్చి, సాగునీరు వృథాగా పోకుండా చర్యలు చేపట్టాలని సతీష్ డిమాండ్ చేశారు. నాలుగు రోజులుగా సమస్య అధికారులకు తెలిసినా పరిష్కరించడంలో జాప్యం చేయడంపై ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# మేడిపల్లి భూ దోపిడీపై కలెక్టర్ సమగ్ర విచారణ జరపాలి

- సామాజిక కార్యకర్త బెజ్జంకి అనిల్ డిమాండ్



**ప్రజా వాయిస్ సిద్దిపేట** సిద్దిపేట జిల్లా చిన్నకోదూర్ మండలం మేడిపల్లి గ్రామ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా జరిగిన రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూముల అక్రమ క్రయవిక్రయాలపై తక్షణమే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమగ్ర విచారణ జరిపించాలని సామాజిక కార్యకర్త బెజ్జంకి అనిల్ డిమాండ్ చేశారు. మేడిపల్లి సర్వే నంబర్లు 76, 96, 11 లలో గల దాదాపు 20 ఎకరాల ప్రభుత్వ భూమిని చిన్నకోదూరు మాజీ జెడ్పిటిసి ముక్కిస లతా సత్యనారాయణ రెడ్డి, వారి తమ్ముడు పాపిరెడ్డి తమ రాజకీయ, ఆర్థిక, అంగబలంతో అక్రమంగా ఆక్రమించుకున్నారని ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీకి చెందిన వీరు సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ప్రధాన అనుచరులుగా చలామణి అవుతూ ఈ భూదోపిడీకి పాల్పడ్డారని పేర్కొన్నారు. గతంలో దళితులకు కేటాయించిన, నిషిద్ధ రిజిస్ట్రేషన్ల జాబితా (22-A) లో ఉన్న ఈ ప్రభుత్వ భూములను నాటి కలెక్టర్ వెంకట్రామిరెడ్డి ప్రోత్బలంతో తప్పుడు రికార్డులు, ఫోర్జరీ పత్రాలు సృష్టించి ఆక్రమించడమే కాకుండా ఇతరులకు అమ్మి కోట్లాది రూపాయలు వెనకేసుకున్నారని మండిపడ్డారు.సమాచార హక్కు చట్టం ద్వారా తాను సేకరించిన అధికారిక సమాచారం ప్రకారం ఈ భూములకు సంబంధించి ఎమ్మార్వో గానీ ఆర్డీఓ గానీ ఎలాంటి ప్రతిపాదనలు పంపలేదని అధికారులు రాతపూర్వకంగా తెలిపారన్నారు. సదరు భూస్వాముల కుటుంబ సభ్యులకు ఎలాంటి ఎన్ఓసి ఇవ్వలేదని, అసలు దానికి సంబంధించిన ఫైళ్లే కార్యాలయంలో లేవని అధికారులు స్పష్టం చేశారని వెల్లడించారు. నియమ నిబంధనలకు వ్యతిరేకంగా నాటి కలెక్టర్ జారీ చేసినట్లుగా చెబుతున్న ఆ ఫేక్ ఎన్ఓసి వెనుక ఉన్న సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు సమాచారంతో భూములను ఆక్రమించిన ముక్కిస పాపిరెడ్డి, సత్యనారాయణ రెడ్డి నుండి ఆ 20 ఎకరాల భూమిని ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. స్వాధీనం చేసుకున్న భూమిని స్థానిక అర్హులైన దళితులకు, భూమి లేని నిరుపేదలకు పంపిణీ చేయాలన్నారు. నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ భూమిని విక్రయించిన నాయకులపై, సహకరించిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. రాజకీయ బలంతో పేదల భూములను కాజేసిన వారిపై ప్రస్తుత జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు.

# బస్సు టైర్ల కింద తొక్కించి చంపుతా

- పదవ తరగతి విద్యార్థి పై ఆర్టీసీ డ్రైవర్ దౌర్జన్యం

**నెల్లికుదురు ప్రజా వాయిస్**...మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలో పదో తరగతి విద్యార్థిపై ఆర్టీసీ డ్రైవర్ దురుసుగా ప్రవర్తించాడనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. తనను దుర్భాషలాడుతూ, బస్సు టైర్ల కింద తొక్కించి చంపుతానని బెదిరించాడని విద్యార్థి ఆరోపించాడు. ఈ ఘటనపై బాధిత విద్యార్థి కుటుంబ సభ్యులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.బస్సులో రద్దీ.. డ్రైవర్ పక్కన నిలబడిన విద్యార్థిబాధితుడు వీరవెల్లి భార్గవ్ తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రూరు డిపోకు చెందిన TS 26 T 1266 నంబర్ బస్సులో శుక్రవారం సాయంత్రం రావిరాల గ్రామానికి చెందిన మోడల్ స్కూల్ పదో తరగతి విద్యార్థి భార్గవ్ స్వగ్రామానికి వెళ్లేందుకు బస్సు ఎక్కాడు. బస్సులో రద్దీ ఎక్కువగా ఉండటంతో డ్రైవర్ పక్కన నిలబడినట్లు తెలిపాడు. నెల్లికుదురు వ్యవసాయ మార్కెట్ వద్ద కొంతమంది ప్రయాణికులు దిగే సమయంలో డ్రైవర్ స్వామి తనను లోపలికి వెళ్లాలని దుర్భాషలాడుతూ, "బస్సు టైర్ల కింద తొక్కించి చంపుతా" అంటూ బెదిరించాడని విద్యార్థి ఆరోపించాడు. అంతేకాకుండా తన అంగి గల్లా పట్టుకుని బలవంతంగా బస్సులోకి నెట్టినట్లు తెలిపాడు.భయాందోళనకు గురైన విద్యార్థి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు జరిగిన విషయాన్ని చెప్పాడు. కుటుంబ సభ్యులతో కలిసి నెల్లికుదురు పోలీస్ స్టేషన్కు వెళ్లి డ్రైవర్ స్వామిపై ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. విద్యార్థిపై దురుసుగా ప్రవర్తించిన ఘటనపై సమగ్రంగా విచారణ జరిపి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు పోలీసులను కోరారు.



# జోనల్ టీమ్‌కు బొందిలి తరుణ్ ఎంపిక!

- ఎంపీ యూపీఎస్ పిల్లిగుండ్ల నుంచి తొలిసారిగా జోనల్ స్థాయికి ఎంపిక
- ప్రత్యేకంగా అభినందించిన ఉపాధ్యాయుల బృందం
- విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి
- ప్రధానోపాధ్యాయుడు ఎండి మోసిన్



**ప్రజా వాయిస్/వికారాబాద్:** గత కొన్ని రోజులుగా జోనల్ స్థాయిలో పాఠశాల విద్యార్థులకు అండర్ 17 , అండర్ 14 విద్యార్థులకు వివిధ రకాలైన క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు.అందులో బాగంగా ఎంపిక కార్యక్రమం జరుగుతుంది, జోనల్ స్థాయిలో అండర్ 14 లో మర్పల్లి మండల పరిధిలోని ఎంపీ యుపిఎస్ పిల్లిగుండ్ల విద్యార్థి బొందిలి తరుణ్ ఎంపికయ్యారు.అండర్ 14 కబడ్డీ మోమి స్టేట్ జోనల్ టీం కి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఎండి మోసిన్ మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని వారిలో ఉన్న ప్రతిభని వెలికి తీయాలని అన్నారు, ఇలాంటి మట్టిలో మాణిక్యం లాంటి విద్యార్థుల ప్రతిభను బయటికి తీసి వారిని ప్రోత్సహించాలన్నారు.మారుమూల గ్రామమైన పిల్లిగుండ్ల నుంచి మొదటిసారి ఒక విద్యార్థి ఎంపిక అవడం పట్ల గ్రామ సర్పంచ్, ఏ ఏ పీ సీ చైర్మన్, పాఠశాల బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. అయితే ఎంపీయుపిఎస్ పాఠశాల నుండి మొట్టమొదటి సారిగా విద్యార్థి ఎంపిక కావడం విశేషం.

# గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన డీసీపీ వెస్ట్ జోన్

- మజ్జనం ప్రశాంతంగా జరిగేలా భద్రతా ఏర్పాట్లు చేయాలి
- .అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పటిష్ట బందోబస్తు
- తొర్రూరు (జె) చెరువు నిమజ్జన ప్రదేశాన్ని పరిశీలించిన డీసీపీ రాజా మహేంద్ర నాయక్



**ప్రజా వాయిస్/పాలకుర్తి** /సెప్టెంబర్ 19పాలకుర్తి: డీసీపీ వెస్ట్ జోన్ రాజా మహేంద్ర నాయక్, ఐపీఎస్ శనివారం తొర్రూరు (జె) గ్రామంలోని చెరువు గణేష్ నిమజ్జన ప్రదేశాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జనం సమయం లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన భద్రతా, ట్రాఫిక్ ఏర్పాట్లు చేపట్టాలని పోలీసు సిబ్బందికి, నిర్వాహకులకు సూచించారు.అనంతరం పాలకుర్తిలోని గణేష్ మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వ హించి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఐ భరత్, ఎస్ఐ పావన్ కుమార్, పాలకుర్తి పాల్గొన్నారు.పాలకుర్తి గ్రామం లో ప్రతి సంవత్సరం నిమజ్జనం నిర్వహించే కోనమ్మకుంటలో నీరు లేని కారణం గా, ఈ సంవ త్సరం గణేష్ నిమజ్జనం తొర్రూరు (జె) చెరువు వద్ద నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రజ లు, గణేష్ మండపాల నిర్వాహకులు ఈ విషయా న్ని గమనించి పోలీసులకు సహకరించాలని కోరారు.

# మహిళా సంఘం ప్రతినిధి చేతివాటం?

- జక్కేపల్లి మహిళా సంఘంలో ₹4 లక్షల బకాయిలపై విచారణ?
- సమగ్ర విచారణ చేపట్టిన అడిషనల్ డీఆర్ డీఓ జయశ్రీ, డీపీఎం ఆంజనేయులు
- వీవోఏ పర్యవేక్షణ శూన్యం
- బ్యాంక్ నిర్లక్ష్యంతోనే నిధుల స్వాహా?



**ప్రజా వాయిస్ ఖమ్మం:** మహిళలు కష్టపడి పొదుపు చేసుకుంటున్న సంఘం నిధులను బాధ్యతాయుత స్థానంలో ఉన్న ప్రతినిధే దారిమళ్లించిన ఘటన వెలుగు చూసిందా? గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లా, కూసుమంచి మండలం జెక్కేపల్లి గ్రామానికి చెందిన మహాలక్ష్మి స్వయం సహాయక సంఘం సభ్యులు బ్యాంకు లింకేజీ ద్వారా రుణం పొందారు. అయితే, సంఘం సభ్యులు ప్రతి నెలా సక్రమంగా చెల్లిస్తున్న రుణ వాయిదాల సొమ్మును గ్రూపు ప్రతినిధి బ్యాంకు ఖాతాలో జమ చేయకుండా తన సొంతానికి వాడుకున్నట్లు తోటి సభ్యులు ఆరోపించారు. ఈ క్రమంలో గత మే నెలలో అనుమానం వచ్చిన సభ్యులు బ్యాంకుకు వెళ్లి ఆరా తీయగా ఈ గోల్‌మాల్ బయటపడిందని. సంఘం మొత్తంలో దాదాపు రూ. 5 లక్షల వరకు వ్యత్యాసం ఉండగా, అందులో సదరు ప్రతినిధి, ఆమె అత్తగారి వాటా కింద రూ. 1,30,000 మినహాయించగా, మిగిలిన ఎనిమిది మంది సభ్యులకు సంబంధించి సుమారు రూ. 4,30,000 పైచిలుకు నిధులు పక్కదారి పట్టినట్లు తెలిసింది. విషయం తెలిసిన వెంటనే మే, జూన్, జులై నెలల వాయిదాలను సభ్యులే స్వయంగా బ్యాంకుకు వెళ్లి చెల్లించారు. మరోవైపు సంఘాల కార్యకలాపాలను పర్యవేక్షించాల్సిన వీవోఏ స్థాయిలో క్షేత్రస్థాయి పరిశీలన సరిగా జరగలేదని, అలాగే రుణం ఇచ్చిన బ్యాంక్ కూడా సరిగా స్పందించకుండా స్టేట్మెంట్ విషయంలో కాలయాపన జరిపిందని అధికారులు తెలిపారు.ఈ ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో అడిషనల్ డీఆర్‌డీవో జయశ్రీ, డీపీఎం ఆంజనేయులు, సీసీ హరికృష్ణ, శ్రీనివాస రావు మరియు స్థానిక సర్పంచ్ సమక్షంలో క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. రికార్డులను సమగ్రంగా పరిశీలించి లెక్కలు తేల్చారు. కాగా, స్థానిక మండల పరిధిలో కాకుండా రాజేశ్వరం బ్రాంచ్‌లో ఖాతా ఉండటంతో పర్యవేక్షణ లోపించిందని, దీనివల్లే ఈ పరిస్థితి తలెత్తిందని సిబ్బంది వివరించారు. మహిళల కష్టార్జితాన్ని కాజేసి చేతులెత్తేస్తే ఊరుకునేది లేదని, బాధ్యుల నుంచి తక్షణమే రికవరీ చేయాలని, లేనిపక్షంలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతామని అధికారులు హెచ్చరించారు.

## రైతుల సమస్య పై 'ప్రజా వాయిస్' ప్రభావం

- దిగొచ్చిన విద్యుత్ శాఖ అధికారులు!
- వార్త ప్రచురణతో కదిలిన అధికారులు..
- ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలకు మరమ్మతులు
- రైతుల భద్రతకు భరోసా..
- తీగలను పైకి బిగించిన విద్యుత్ శాఖ




**శామీర్ పేట / ప్రజా వాయిస్ :** మూడు చింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అద్రస్‌పల్లి గ్రామంలో సర్వే నంబర్ 64లో వ్యవసాయ క్షేత్రంపై విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్న విషయాన్ని 'ప్రజా వాయిస్' దిన పత్రిక శుక్రవారం వెలుగులోకి తీసుకువచ్చింది. రైతులకు ప్రమాదం పొంచి ఉన్న అంశాన్ని ప్రముఖంగా ప్రచురించడంతో విద్యుత్ శాఖ అధికారులు శనివారం స్పందించారు. విద్యుత్ అధికారులు క్షేత్రానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి, కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలను పైకి బిగించి టైట్‌గా కట్టారు. దీంతో వ్యవసాయ పనులు చేసుకునే రైతులకు ఇబ్బందులు లేకుండా, ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టారు. రైతుల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి శ్రీపతి నాగరాజు ఇచ్చిన వివరణతో పాటు 'ప్రజా వాయిస్'లో వచ్చిన కథనం అధికారుల్లో కదలిక తీసుకువచ్చిందని స్థానికులు పేర్కొన్నారు. సమస్యను గుర్తించి వెంటనే స్పందించిన విద్యుత్ శాఖ అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే కాకుండా, సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం జరిగే వరకు ప్రజా వాయిస్ తన బాధ్యతను కొనసాగిస్తుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# అద్వాన్న ఆర్ అండ్ బి రోడ్లు

- పదేపదే చెప్పిన ఇంజనీర్ల నిర్లక్ష్యం
- ఏళ్ల తరబడి కంకర తేదీన రోడ్లు
- పనులు చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని సర్పంచ్ల ఫిర్యాదు
- నత్తతో పోటీపడుతున్న ఆర్ అండ్ బి బిటి రోడ్ల పనులు



**ప్రజా వాయిస్ కామారెడ్డి/**అద్వాన్నపు రోడ్లు భవనాల శాఖ రోడ్లతో నిత్యం నరకయాతన ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. పదేపదే చెప్పిన ఫిర్యాదులు చేసిన రోడ్లు భవనాల శాఖ అధికారులు ఇంజనీర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మూడేళ్లుగా ప్రధాన రహదారి కంకర తేలి ఉండడంతో కంకర వేసి కాంట్రాక్టర్ మరిచిపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి వాహనదారులు వికలాంగులవుతున్నారు. ప్రధాన రోడ్లు కంకర తేలి అద్వాన్నంగా మారి మోకాళ్ళ లోతు గుంతలు ఏర్పడిన అధికారులు ప్రజాప్రతినిధుల్లో చలనం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. 2022లో కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ శంకుస్థాపన చేసిన క్యాసము పల్లి దోమకొండ వయా ముత్యంపేట బిటి రోడ్డు కంకర తేలి తరబడి ప్రజలను ప్రభుత్వ అధికారులను వెక్కిరిస్తుంది. మూడేళ్ల తరబడి కంకర వేసి నిర్లక్ష్యం చేస్తున్న కాంట్రాక్టర్ ని బ్లాక్ లిస్టులో పెట్టాలని దోమకొండ సర్పంచులు అధికారులకు ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేశారు. కామారెడ్డి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలలో రోడ్లు భవనాలు వీటి రోడ్లు నత్తతో పోటీపడి నడుస్తున్నాయి. కామారెడ్డి దోమకొండ భిక్కనూరు మాచారెడ్డి బిబిపేట పాల్వంచ రాజంపేట మండలాలలోని రోడ్లు భవనాల శాఖ రోడ్లు అద్వాన్నం పరిస్థితిలో గుంతలు తేలి ప్రజలకు వాహనదారులకు నిత్యం నరకయాతన చూపిస్తున్నాయి.నిత్యం రోడ్డు ప్రమాదాలు వేలాదిమంది ప్రజలు వాహనదారుల నరకయాతన పడుతున్నారని పదుల సంఖ్యలో ఫిర్యాదులు ఉన్నాయి.రోడ్లు భవనాల శాఖ లో ఏడాది గా బిల్స్ రావడం లేదని కాంట్రాక్టర్ల గగ్గోలు పెడుతున్నారు. దోమకొండ ముత్యంపేట రోడ్డుకు ఇంకా ఎనిమిది కోట్ల రూపాయల బిల్లు రావాల్సిందని నవీత కన్స్ట్రక్షన్ కంపెనీ కాంట్రాక్టర్ ప్రతినిధులు చెబుతున్నారుకామారెడ్డి నియోజకవర్గంలోని మండలాలలోకంకర తేలిన రోడ్లతో నిత్యం నరకయాతన చూపిస్తున్నాయి అద్వాన్న రోడ్లు మోకాళ్ళ లోతు గుంతలు పడ్డాయని వాహనదారులు చెబుతున్నారు. పదేపదే విజ్ఞప్తులు చేసిన రిపేర్లు లేని ఆర్ అండ్ బి శాఖ అధికారులు చేపట్టడం లేదని విమర్శలు ఉన్నాయి. ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యంపై ప్రజలు మండిపడుతున్నారు. పదుల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయి అధికారుల్లో నేతలలో చలనం లేదని వాహనదారులు విమర్శిస్తున్నారు.దోమకొండ ముత్యంపేట ఆర్ అండ్ బి బీటీ రోడ్డు కంకర వేసి మూడేళ్లు అవుతుంది. పదుల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయి నిత్యం ప్రమాదాలతో వాహనదారులు వికలాంగులవుతున్నారు. క్యాసమ్ పల్లి ముత్యంపేట రోడ్డుకు కొత్త రోడ్డు పక్కన మొరం వేయలేదు. క్యాసం పల్లి దోమకొండ వయా ముత్యంపేట రోడ్డు 2022లో రాష్ట్ర ప్లాన్ గ్రాంట్ లో 25 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. క్యాసం పల్లి నుండి ముత్యంపేట వరకు బీటీ రోడ్డు పూర్తయింది. ముత్యంపేట నుండి దోమకొండకు నవీత కన్స్ట్రక్షన్ కంపెనీ మూడేళ్ల క్రితం కంకర వేసి వదిలేశారు నవీత కన్స్ట్రక్షన్ కాంట్రాక్టర్ మాచారెడ్డి ఎక్స్ ఎంపీపీ కావడంతో అధికారులు ప్రజాప్రతినిధులు గుత్తిదారున్నీ ఏమీ అనలేకపోతున్నారు. ముత్యంపేట రోడ్డు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పదుల సంఖ్యలు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి.ఆ రోడ్డులో ఇంకా నాకు 8 కోట్ల రూపాయలు పెండింగ్ బిల్స్ రావాల్సి ఉన్నాయని గుత్తేదారు చెబుతున్నారు.ప్రభుత్వాలు నిధులు విడుదల చేయకపోవడం కాంట్రాక్టర్ అసంపూర్తిగా బీటీ రోడ్లను నిర్మించడం ప్రజలకు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### దసరా తర్వాత పనులు ప్రారంభిస్తాం

కామారెడ్డి ఆర్ఎన్బి డిప్యూటీ ఇంజనీర్ కామారెడ్డి నియోజకవర్గంలో పెండింగ్లో ఉన్న రోడ్డు పనులను ముత్యంపేట రోడ్డును దసరా తర్వాత ప్రారంభిస్తామని కామారెడ్డి ఆర్ అండ్ బి డిప్యూటీ ఇంజనీర్ వినోద్ కుమార్ విలేకరులతో చెప్పారు. 99 రోడ్లకు ప్యాచ్ వర్క్ లకు నిధులు మంజూరు కాగా పనులు పూర్తి చేశామన్నారు.

## ప్రజాప్రతినిధుల భర్తల వేధింపులపై పారిశుద్ధ్య కార్మికుల సమరభేరి

- విధులను బహిష్కరిస్తూ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం

**ప్రజా వాయిస్ దుబ్బాక** మీరుదొడ్డిసిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని మిరుదొడ్డి మండల కేంద్రంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామ పంచాయతీలో సక్రమంగా విధులు నిర్వర్తిస్తున్న దళిత పారిశుద్ధ్య కార్మికులపై వార్డు సభ్యుల భర్తలు పిట్ల ప్రశాంత్, జ్ఞానేశ్వర్, తుమ్మల యాదగిరి, కుమ్మరి శ్రీను అనవసరంగా పెత్తనం చలాయిస్తూ, దుర్భాషలాడుతున్నారంటూ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు ప్రజాప్రతినిధులుగా గెలిస్తే వారి భర్తలు తమపై ఒత్తిడి తెస్తూ, అసత్య ప్రచారాలు చేయడం ఎంతవరకు సమంజసమని వారు తీవ్ర స్థాయిలో ప్రశ్నించారు. గత పది సంవత్సరాలుగా గ్రామంలో నిబద్ధతతో పనిచేస్తున్న తమ పట్ల దళితులనే వివక్షతో అకారణంగా నిందలు వేస్తున్నారని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వేధింపులను నిరసిస్తూ 19/09/2026 నుంచి విధులను బహిష్కరిస్తున్నట్లు స్పష్టం చేశారు. బాధ్యులైన వార్డు సభ్యుల భర్తలు బహిరంగంగా క్షమాపణ చెప్పి, తమ సమస్యలను పరిష్కరించే వరకు పారిశుద్ధ్య పనులకు హాజరయ్యేది లేదని తెగేసి చెబుతూ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య సిబ్బంది ముక్కపల్లి నవీన్, ధర్మారం మహేష్, రాజు, పరశురాములు, కుమార్, ఎల్లవ్వ, ఎల్లయ్య, గల్లావ్వ, లక్ష్మి, ముత్తమ్మ, పోశయ్య, దుర్గవ్వ తదితరులు పాల్గొని తమ మద్దతు తెలిపారు.



# గురుకుల విద్యార్థి మృతిపై నిరసనల సెగ

- అధ్యాపకులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ ఎస్ వీ డిమాండ్
- కళాశాల ఎదుట బైఠాయించి ఆందోళన
- నాయకుల అరెస్ట్
- బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని వెల్లడి




**ప్రజా వాయిస్ – నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 19:**గురుకుల కళాశాల విద్యార్థి భరత్ ఆత్మహత్య ఘటనపై బీఆర్ఎస్వీ చేపట్టిన నిరసనతో నాగర్‌కర్నూల్ జిల్లాలో శనివారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విద్యార్థి మృతికి కారణమయ్యారని ఆరోపణలు ఎదుర్కొంటున్న అధ్యాపకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ నాయకులు ఆందోళన చేపట్టారు.బల్మూర్ మండలం జినుకుంట గ్రామానికి చెందిన భరత్ తెలకపల్లి మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. కళాశాలలో అధ్యాపకులు మందలించడంతో మనస్తాపానికి గురై స్వగ్రామానికి వెళ్లి ఆత్మహత్య చేసుకున్నట్లు బీఆర్ఎస్వీ నాయకులు ఆరోపించారు. అయితే ఘటనకు సంబంధించిన పూర్తి కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.విద్యార్థి మృతి విషయం తెలుసుకున్న బీఆర్ఎస్వీ నాయకులు, విద్యార్థులు కళాశాల వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. కళాశాల ఎదుట బైఠాయించి నినాదాలు చేస్తూ విద్యార్థి మృతికి బాధ్యులుగా తేలిన అధ్యాపకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు.అనుమతి లేకుండా ఆందోళన చేపడుతున్నారంటూ పోలీసులు నిరసనకారులను అడ్డుకున్నారు. పలువురు బీఆర్ఎస్వీ నాయకులను అదుపులోకి తీసుకుని తెలకపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు అతినారపు విష్ణువర్ధన్ మాట్లాడుతూ.. భరత్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు. విద్యార్థులను వేధించారనే ఆరోపణలపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని, బాధ్యులుగా తేలిన అధ్యాపకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రేపు ఉదయం 10 గంటల్లోగా సంబంధిత అధ్యాపకులపై చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. భరత్ మృతికి నిరసనగా నాగర్‌కర్నూల్ పట్టణంలో కళాశాల బంద్ నిర్వహిస్తామని తెలిపారు. అరెస్టులతో తమ గొంతుకను అణచలేరని, న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.మరోవైపు భరత్ మృతితో జినుకుంట గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సమీక్షలు ఎందుకు..?- సమస్యలు పరిష్కరించేదెప్పుడు..?

- సర్పంచుల సమస్యలపై అధికారులను నిలదీసిన కరణం కీర్తి రామకృష్ణ

**ప్రజావాయిస్/మోమిన్‌పేట్** సర్పంచుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారని రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి కరణం కీర్తి రామకృష్ణ ఆరోపించారు. శనివారం నాడు వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండల కేంద్రంలో ఎంపీడీవో సృజన సాహిత్య అధ్యక్షతన నిర్వహించిన మండల సమీక్ష సమావేశంలో ఆయన అధికారుల తీరుపై ప్రశ్నలు లేవనెత్తారు. సమస్యలు పరిష్కరించకుండా సమీక్ష సమావేశాలు ఎందుకు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. గ్రామాల అభివృద్ధికి నిధుల కేటాయింపులో పక్షపాతం లేకుండా సమానంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.సమావేశంలో జెడ్పీ సీఈవో సుధీర్ మాట్లాడుతూ గ్రామాల్లో మంజూరైన డ్వాక్రా భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వర్క్‌షెడ్లు, పల్లె దవాఖానాల నిర్మాణాలను ఈ నెలలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మొదటి విడత మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను సకాలంలో పూర్తి చేసేలా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారులను ప్రోత్సహించాలని సూచించారు.కార్యక్రమంలో మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి,మండల ప్రత్యేక అధికారి సదానందం, తహసీల్దార్ మునీరుద్దీన్, ఎంపీవో సంజయ్‌కుమార్, ఏవో రామకృష్ణారెడ్డి, ఏపీఎం మధుకర్, ఏపీవో శంకర్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు కోస్గి సురేందర్, పిఏసిఎస్ చైర్మన్ రామచంద్రా రెడ్డి,వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.







## ఘనంగా ముగిసిన SGFI పోటీలు

- విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి
- విజేతలకు బహుమతులు, పతకాలు అందజేసిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**మిర్యాలగూడ, ప్రజా వాయిస్:** మిర్యాలగూడ మండలం తుంగపాడు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (SGFI) మిర్యాలగూడ నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ఘనంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (BLR) ముఖ్య అతిథిగా హాజరై వివిధ క్రీడా విభాగాల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు, పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే.. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థినీ అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, క్రీడా నిర్వాహకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చెత్త సేకరణ లేక కోతులు,కుక్కల, ఈగలు దోమలు స్వైరవిహారం

- మొద్దు నిద్రలో అధికారులు..!
- పట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు మరియు సిబ్బంది..!

**భువనగిరి/ ప్రజా వాయిస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా పట్టణంలోని భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని బొమ్మాయిపల్లి 11వ వార్డు పరిధిలో శ్రీగ్ధ వెంచర్లో గత 15 రోజులుగా చెత్త సేకరణ లేక చెత్త తీసుకెళ్ళక కోతులు,కుక్కల స్వైరవిహారం చేస్తున్న నిర్లక్ష్యం వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది. పారిశుధ్య పనులు నిర్వహించక సతమతవతున్న 11వ వార్డు ప్రజలు. మున్సిపాలిటీ సిబ్బంది లేక వార్డు లో చెత్త చెదారం నిండిపోయి దుర్వాసన వెదజల్లు తుంది. దోమలు ఈగలు వాళ్లతో కుక్కలు, కోతులు ఇండ్లలో పాడైపోయిన వస్తువులను సైతం చిందర వందరం చేసి ఆ మురికి మొత్తం ఇండ్లలో పడేస్తూ ప్రజలకు కంటిమీద కొనుక్కో లేకుండా చేస్తున్న మున్సిపల్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. చెత్త సేకరణ లేకపోవడంతో వార్డు ప్రజలు అనారోగ్యనికి గురి అయ్యి ఆసుపత్రి పాలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే సంబంధిత అధికారులు, మున్సిపల్ కమిషనర్ పట్టించుకోని మున్సిపల్ సిబ్బందిని నియమించి చెత్త చదరం లేకుండా కాలనీ మొత్తం పరిశుద్ధంగా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో హైజినిక్ ఉండే ఏకైక పేరుగాంచిన శ్రీగ్ధ వెంచర్ కి ఇలాంటి పరిస్థితి ఉంటే భువనగిరి పరిధిలో ఉన్న మిగతా కాలనీల పరిస్థితి ఏమిటి? అని ప్రజా పాలన అని చెప్పుకునే కాంగ్రెస్ నాయకులు ఎక్కడ పోయారని ప్రజల నుండి విమర్శలు వెదజల్లుతున్నాయి. ఇప్పటికైనా బోనగిరి మున్సిపాలిటీలో మున్సిపల్ అధికారులు మొద్దు నిద్ర విడవాలని ప్రజలు కోరారు.



# మహిళపై బలప్రయోగం

## .కేసు నమోదు చేసిన పోలీసులు

**ప్రజా వాయిస్,తెలకపల్లి.** తెలకపల్లి మండలం పర్వతాపూర్ గ్రామానికి చెందిన డి.రాధ ఇంట్లోకి చొరబడి దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారని. తేదీ 16.09.2026 సాయంత్రం 6:00 గంటలకు తాను వంటగదిలో పని చేసు కుంటున్న సమయంలో అదే గ్రామానికి చెందిన కొనిజల రామస్వామి తండ్రి వెంకటయ్యా ఉద్దేశపూర్వకంగా ఇంట్లోకి ప్రవేశించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న తన కుడి చేతిని గట్టిగా పట్టుకొని గౌర వానికి భంగం కలిగించేలా బలప్ర యోగం చేశాడని తెలిపారు. ఆత్మరక్షణ కోసం తాను కూడా అతనిపై చేయి చేసు కున్నట్లు బాధితురాలు వెల్లడించింది. ఈ ఘటనపై విచారణ జరిపి నిందితు డిపై చట్టపరమైన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని తెలకపల్లి పోలీసు లను ఆశ్రయించగా నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలక పల్లి ఎస్సై బి రమేష్ తెలిపారు



# జమ్మికుంట మున్సిపాలిటీలో అసలేం జరుగుతోంది...?

- కౌన్సిలర్ వర్సెస్ శానిటరీ ఇన్ స్పెక్టర్
- వైరల్ గా మారిన కాల్ రికార్డింగ్ సంభాషణలు
- జమ్మికుంట మొత్తం హాట్ టాపిక్ గా మున్సిపాలిటీ వ్యవహారం
- హైదరాబాద్ వెళ్తున్న సమయంలో డీజిల్ బంకు ప్రస్తావన ఎందుకు వచ్చింది?
- మున్సిపల్ డీజిల్ నిర్వహణ ఎవరి పరిధిలో ఉంది?
- ప్రస్తావించిన రూ.2-3 లక్షల బకాయి ఏమిటి?
- రూ.7 లక్షల జేసీబీ పనుల పూర్తి లెక్కలు ఏమిటి?
- పాత మున్సిపల్ కార్యాలయంలోని గది ఎవరికి అధికారికంగా కేటాయించారు?
- ఈ ప్రశ్నలకు వైరల్ ఆడియో కంటే అధికారిక రికార్డులే స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సి ఉంది.




**ప్రజా వాయిస్,జమ్మికుంట,** ( సెప్టెంబర్ 19 ): కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపాలిటీలో కౌన్సిలర్లు, శానిటరీ విభాగం ఉద్యోగి మధ్య నెలకొన్న వివాదం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. పాత మున్సిపల్ కార్యాలయంలోని శానిటరీ విభాగం గది వినియోగం, డీజిల్ నిర్వహణ, పెట్రోల్ బంకులకు సంబంధించిన బకాయిలు, జేసీబీ పనుల ఖర్చులపై ఇప్పటికే ప్రశ్నలు తలెత్తగా.. తాజాగా కౌన్సిలర్, ఉద్యోగి మధ్య జరిగినట్లు చెబుతున్న ఫోన్ సంభాషణ బయటకు రావడంతో వ్యవహారం మరింత చర్చకు దారితీసింది.పాత మున్సిపల్ కార్యాలయంలో గది వ్యవహారంపై వివాదంకౌన్సిలర్ల ఆరోపణల ప్రకారం.. పాత మున్సిపల్ కార్యాలయంలోని శానిటరీ విభాగం గదికి శానిటరీ ఇన్స్పెక్టర్ తాళం వేసి ఉంచారని, కౌన్సిలర్లు ప్రశ్నించగా తాను వచ్చినప్పుడు మాత్రమే గది తెరుస్తానని చెప్పినట్లు ఆరోపించారు.ప్రజలు తమ సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావడానికి పాత మున్సిపల్ కార్యాలయానికి వస్తుంటారని కౌన్సిలర్లు తెలిపారు. అలాంటి కార్యాలయంలోని గది ఎవరికి కేటాయించబడింది? శానిటరీ ఇన్స్పెక్టర్‌కు అధికారికంగా కేటాయించి ఉంటే అందుకు సంబంధించిన ఉత్తర్వులు ఉన్నాయా? అనే ప్రశ్నలను వారు లేవనెత్తారు.ఆరోపణలను ఖండించిన శానిటరీ ఇన్స్పెక్టర్తనపై వస్తున్న ఆరోపణలను శానిటరీ ఇన్స్పెక్టర్ ఖండించారు. తాను ఉద్యోగ నిబంధనల ప్రకారమే విధులు నిర్వహిస్తున్నానని తెలిపారు. తనపై కొంతమంది వ్యక్తులు డీజిల్ టోకెన్లు, డబ్బులు తదితర అంశాలకు సంబంధించి ఆరోపణలు చేస్తున్నారని, వాటిలో వాస్తవం లేదని పేర్కొన్నారు.తాను ఎవరిపైనా ఎస్సీ, ఎస్టీ కేసు పెడతానని చెప్పలేదని ఆయన స్పష్టం చేశారు. తనపై ఆరోపణలు చేస్తున్న వారు ఆధారాలు ఉంటే నిరూపించాలని చెప్పినట్లు తెలిపారు.ఇప్పుడు వైరల్‌గా మారిన ఫోన్ సంభాషణఈ వివాదం మధ్యలో కౌన్సిలర్, శానిటరీ ఇన్స్పెక్టర్ జరిగినట్లు చెబుతున్న ఫోన్ సంభాషణ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. కాల్ రికార్డింగ్‌లోని సంభాషణ ప్రకారం. శానిటరీ ఇన్స్పెక్టర్ పాత మున్సిపల్ కార్యాలయంలో ఉన్నానని, ఒక డ్రైవర్‌తో కలిసి వాహనం మరమ్మతు విషయంపై మాట్లాడుతున్నామని తెలిపారు. కొద్దిసేపటి తర్వాత అవతలి వ్యక్తి తాను హైదరాబాద్ వెళ్తున్నట్లు చెప్పారు. అనంతరం "ఆ బంకులో ఏమైనా చెప్తావా..?" అని శానిటరీ ఇన్స్పెక్టర్ను ప్రశ్నించారు. దీనికి శానిటరీ ఇన్స్పెక్టర్ స్పందిస్తూ.. డీజిల్ బంకుల వ్యవహారం తన చేతిలో లేదని, ఆ బాధ్యత తనకు ఇంకా అప్పగించలేదని తెలిపారు. డీజిల్ వ్యవహారాన్ని మున్సిపల్ కమిషనర్ చూస్తున్నారని చెప్పినట్లు కాల్ రికార్డింగ్‌లో ఉంది.ఈ సంభాషణతో హైదరాబాద్ వెళ్తున్న సమయంలో డీజిల్ బంకు ప్రస్తావన ఎందుకు వచ్చింది? "ఆ బంకులో ఏమైనా చెప్తావా?" అనే మాటకు ఉద్దేశం ఏమిటి? అనే ప్రశ్నలు స్థానికంగా చర్చకు వచ్చాయి.అయితే ఈ సంభాషణ ఆధారంగా ఎవరైనా వ్యక్తిగత ప్రయోజనం కోసం మున్సిపల్ డీజిల్‌ను వినియోగించుకున్నారని నిర్ధారించలేం. ఆ వ్యాఖ్యకు సంబంధించిన పూర్తి సందర్భం, డీజిల్ బిల్లులు, బంకుల రికార్డులు పరిశీలించిన తర్వాతే వాస్తవ పరిస్థితి స్పష్టమవుతుంది.రూ.2-3 లక్షల పాత బకాయి ప్రస్తావనఇదే ఫోన్ సంభాషణలో మున్సిపాలిటీకి సంబంధించిన పాత బకాయిల విషయం కూడా ప్రస్తావనకు వచ్చింది. సుమారు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు పాత బకాయి ఉన్నట్లు శానిటరీ ఇన్స్పెక్టర్ పేర్కొన్నట్లు కాల్ రికార్డింగ్‌లో ఉంది.అయితే ఆ బకాయి ఏ పెట్రోల్ బంకుకు సంబంధించినది? ఏ కాలానికి సంబంధించినది? బిల్లులు ఎంత? చెల్లింపులు ఎంత జరిగాయి? ఇంకా ఎంత బకాయి ఉంది? అనే వివరాలు అధికారిక రికార్డుల ద్వారా తేలాల్సి ఉంది. ఫోన్ సంభాషణలో మరో కీలక అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. గతంలో చేపట్టినట్లు పేర్కొన్న సుమారు రూ.7 లక్షల జేసీబీ పనులకు సంబంధించిన లెక్కలు, దరఖాస్తు వివరాలను సిద్ధం చేయాలని శానిటరీ ఇన్స్పెక్టర్ను కోరారు. ఈ ఫైల్ కమిషనర్ వద్ద ఉందని, తన వద్ద లేదని శానిటరీ ఇన్స్పెక్టర్ చెప్పినట్లు కాల్ రికార్డింగ్‌లో ఉంది. అనంతరం ఆ వివరాలను తీసుకుని జిల్లా కలెక్టర్‌ను కలవనున్నట్లు అవతలి వ్యక్తి చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో ఆ జేసీబీ పనులకు ఎవరు అనుమతి ఇచ్చారు? వర్క్ ఆర్డర్ ఉందా? ఎంత పని జరిగింది? ఎంత మొత్తానికి బిల్లు చెల్లించారు? కొలతల పుస్తకం (ఎం.బి)లో వివరాలు ఏమున్నాయి? అనే ప్రశ్నలు తెరపైకి వచ్చాయి.కౌన్సిలర్-ఉద్యోగి మధ్య అసలు వివాదం ఏమిటి? ఒకవైపు కౌన్సిలర్లు శానిటరీ విభాగం పనితీరు, పాత కార్యాలయ గది వినియోగం, డీజిల్ వ్యవహారాలు, ఇతర ఖర్చులపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. మరోవైపు శానిటరీ ఇన్స్పెక్టర్ తనపై చేస్తున్న ఆరోపణలు నిరాధారమని చెబుతున్నారు.దీంతో ఇది కేవలం కౌన్సిలర్-ఉద్యోగి మధ్య వ్యక్తిగత వివాదమా? లేక మున్సిపల్ పరిపాలనకు సంబంధించిన అంశాలపై ఏర్పడిన వివాదమా? అన్నది చర్చనీయాంశంగా మారింది.రికార్డులు పరిశీలిస్తే అసలు విషయం తేలే అవకాశంఈ వ్యవహారంపై వాస్తవాలను నిర్ధారించాలంటే మున్సిపల్ వాహనాల డీజిల్ బిల్లులు, డీజిల్ టోకెన్లు, వాహనాల లాగ్‌బుక్స్, జీపీఎస్ వివరాలు, పెట్రోల్ బంకుల బిల్లులు, చెల్లింపు రికార్డులు, పాత మున్సిపల్ కార్యాలయ గది కేటాయింపు ఉత్తర్వులు, జేసీబీ పనుల వర్క్ ఆర్డర్లు, పరిపాలనా అనుమతులు, ఎం.బి లు, బిల్లులు, చెల్లింపు వోచర్లు తదితర అధికారిక పత్రాలను పరిశీలించాల్సి ఉంటుంది. కౌన్సిలర్లు ఈ వ్యవహారాన్ని ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అధికారిక విచారణ జరిగి రికార్డులను పరిశీలిస్తే ఈ వ్యవహారంలో ఎవరి వాదనలో ఎంతవరకు వాస్తవం ఉందో స్పష్టమయ్యే అవకాశం ఉంది.

# ఎలినోనా పేరిట ఆంధ్రకు సాగు జలాలు దోచిపెడుతున్న రేవంత్

- ఫిరాయింపు ఎమ్మెల్యేలకు హైకోర్టు తీర్పు చెంపపెట్టు
- పాలమూరులో రైతులకు విద్యుత్, సాగునీటి కష్టాలు
- కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందుచూపు లేదని విమర్శ.
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్.



ప్రజా వాయిస్.. వనపర్తి: వనపర్తి నియోజకవర్గంలోని పెబ్బేరు పట్టణంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పాలమూరు రైతులు విద్యుత్, సాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 7 మెగావాట్లుగా ఉన్న విద్యుత్ సామర్థ్యాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం 24 వేల మెగావాట్లకు పెంచిందని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ హయాంలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి పాలమూరులో సుమారు 7 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని పేర్కొన్నారు. చెక్‌డ్యామ్‌లు, చెరువులను నింపడంతో పాలమూరులో నీటి లభ్యత పెరిగిందన్నారు.రైతులతో కలిసి రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లను సందర్శించామని, ఆరు గంటలకు మించి విద్యుత్ సరఫరా కావడం లేదని రైతులు తమ సమస్యలను వివరించారని కేటీఆర్ తెలిపారు. లో-వోల్టేజ్, తరచూ విద్యుత్ కోతలతో మోటార్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. నీళ్లు, కరెంట్ ఉన్నప్పటికీ రైతులకు అందించలేని పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వంలో నెలకొందని విమర్శించారు.పోతిరెడ్డిపాడు, వెలిగొండ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు నీళ్లు వెళ్తున్నాయని, జూరాలకు ఎగువ నుంచి నీరు రావడం లేదని అధికారులు చెబుతున్నారని కేటీఆర్ అన్నారు. ఏపీకి నీళ్లు వెళ్తుంటే తెలంగాణకు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. కల్వకుర్తి పంపులను సక్రమంగా నిర్వహించాలని, పంపులను పదేపదే ఆన్, ఆఫ్ చేయడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు.కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు కృష్ణా జలాలపై ప్రణాళికలతో ముందుకు వెళ్తుంటే తెలంగాణ ప్రభుత్వం మాత్రం ముందుచూ పు లేకుండా వ్యవహరిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఆలమట్టి ఎత్తు పెంచే కర్ణాటక ప్రతిపాదనపై తెలంగాణ ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన వాటా సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని అన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయం లో హైకోర్టు తీర్పు చెంపపెట్టులాంటిదని వ్యాఖ్యానించారు. అలాగే ఎలినోనా ప్రాజెక్టు పేరిట ఆంధ్రప్రదేశ్‌కు సాగునీరు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు.



# జర్నలిస్టుల సమస్యలపై నల్లగొండలో రిలే నిరాహార దీక్ష

- సంఘీభావం తెలిపిన కొండమల్లేపల్లి మండల పాత్రికేయులు

**ప్రజా వాయిస్, కొండమల్లేపల్లి,** జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నల్లగొండ జిల్లాలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు కొండమల్లేపల్లి మండల జర్నలిస్టులు సంఘీభావం తెలిపారు. టీయూడబ్ల్యూజే-ఐజేయూ దేవరకొండ డివిజన్ అధ్యక్షులు గాదే గిరిధర్‌రావు ఆధ్వర్యంలో మండల పాత్రికేయులు స్వచ్ఛందంగా రిలే దీక్షలో పాల్గొన్నారు.జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు పెండింగ్‌లో ఉండటం, అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందకపోవడం, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రక్రియ ముందుకు సాగకపోవడం వంటి సమస్యలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. అలాగే జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య భద్రత కల్పించే హెల్త్ కార్డుల అమలు సక్రమంగా జరగడం లేదని పేర్కొన్నారు.అక్రిడిటేషన్ విషయంలో చిన్న పత్రికలు, యూట్యూబ్, డిజిటల్ మీడియా జర్నలిస్టులకు గుర్తింపు కార్డులు పొందడంలో కఠిన నిబంధనలు అడ్డంకిగా మారుతున్నాయని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు తమ మద్దతు కొనసాగుతుందని కొండమల్లేపల్లి మండల పాత్రికేయులు తెలిపారు.

# చేతికొచ్చే సమయంలో యూరియా కొరతా?

- యూరియా కోసం రైతుల పరుగులు
- పంటకు కీలక దశఆలస్యమైతే దిగుబడిపై ప్రభావం
- అన్నదాతల్లో ఆందోళన
- యాప్ చిక్కుల తో మరింత ఇబ్బంది పడుతున్న రైతులు
- సాగు విస్తీర్ణం ఆధారంగా ముందుగానే యూరియా కేటాయించాలి
- క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఎక్కడ?
- వ్యవసాయ అధికారులకు రైతుల ప్రశ్న?

**ప్రజా వాయిస్/జనగామ జిల్లా బ్యూరోజనగామ:** వరి పంట చేతికొచ్చే దశకు చేరుకుంటున్న సమయంలో యూరియా అందకపోతే పంటపై ప్రభావం పడుతుందనే ఆందోళన రైతుల్లో నెలకొంది. ఇప్పటికే యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతుండగా.. మరోవైపు కొత్త యాప్ ద్వారా బుకింగ్ విధానం కూడా కొందరు రైతులకు అర్థం కాకపోవడంతో సమస్య మరింత తీవ్రమవుతోందని రైతులు వాపోతున్నారు.వరి సాగులో పంట ఎదుగుదలకు అవసరమైన నత్రజనిని దశలవారీగా అందించడం ముఖ్యమని ఐసీఏఆర్ వ్యవసాయ సలహాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా టిల్లరింగ్, పానికల్ ఇనిషియేషన్ దశల్లో అవసరమైన ఎరువుల నిర్వహణ కీలకం.

### ఇప్పుడు అందకపోతే ఎలా?

ప్రస్తుతం పంట కీలక దశలో ఉందని రైతులు చెబుతున్నారు. ఈ సమయంలో అవసరమైన యూరియా అందక ఆలస్యం జరిగితే పంట ఎదుగుదల, దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి శ్రమించి పండించిన పంట చేతికొచ్చే సమయంలో ఎరువుల కోసం రైతులు తిరగాల్సిన పరిస్థితి రావడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

### యాప్ తెలియని రైతుల పరిస్థితి ఏంటి?

గ్రామాల్లో ఇప్పటికీ పాతతరం రైతులే వ్యవసాయం చేస్తున్న పరిస్థితి ఉంది. వారికి యాప్ లో నమోదు, బుకింగ్, ఇతర సాంకేతిక ప్రక్రియల పై పూర్తిస్థాయి అవగాహన ఉండకపోవచ్చు. అలాంటి రైతులకు ప్రత్యామ్నాయ సహాయ వ్యవస్థ లేకుండా యాప్ ఆధారిత విధానాన్ని అమలు చేయడం వల్ల యూరియా పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు చెబుతున్నారు.

### రైతుల వివరాలు అధికారులే సేకరించాలి

ప్రతి గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి వరి సాగు చేస్తున్న రైతుల వివరాలను సేకరించాలని రైతులు కోరుతున్నారు. రైతు పేరు, సాగు చేస్తున్న ఎకరాలు, పంట దశ, అవసరమైన యూరియా పరిమాణాన్ని నమోదు చేసి.. ఆ వివరాల ఆధారంగా యాప్ లో బుకింగ్ చేసి రైతులకు సకాలంలో సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### అన్నదాతకు అడ్డంకులు కాకుండా అండగా నిలవాలి

ఎరువుల పంపిణీ విధానం రైతుకు సులభంగా ఉండాలే తప్ప.. కొత్త సమస్యగా మారకూడదని రైతులు అంటున్నారు. యూరియా కోసం రైతులు దుకాణాలు, అధికారుల కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా గ్రామ స్థాయిలోనే సరఫరా, పర్యవేక్షణ వ్యవస్థను పటిష్టం చేయాలని కోరుతున్నారు.పంట చేతికొచ్చే సమయంలో యూరియా కొరత ఏర్పడి రైతుకు నష్టం జరిగితే బాధ్యత ఎవరిదని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల వారీగా సాగు విస్తీర్ణాన్ని గుర్తించి, రైతుల అవసరానికి అనుగుణంగా యూరియా అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు.

# ప్రజా సమస్యలు పట్టవా?





- విద్యుత్, తాగునీరు, నిధుల విని యోగంపై ప్రజాప్రతినిధుల నిలదీత
- అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆదేశం
- గ్రామీణ మౌలిక వసతులు రేషన్, వ్యవసాయం, విద్యపై ప్రత్యేక దృష్టి
- మండల ప్రత్యేక అధికారి జూలకంటి రంగారెడ్డి.

**ప్రజా వాయిస్, మిర్యాలగూడ:** మిర్యాలగూడ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం డాక్టర్ జూలకంటి వెంకట్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం సర్పంచ్ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్, తాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని అన్నారు. వ్యవసాయానికి పగటిపూట 6 నుంచి 7 గంటలు కూడా త్రీ-ఫేస్ విద్యుత్ అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని, తాగునీటి సరఫరాకు కూడా అంతరాయం కలుగుతోందన్నారు. పైస్థాయి నుంచి ఆదేశాలు వస్తేనే త్రీ-ఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని సిబ్బంది చెప్పడం సరికాదన్నారు. సమస్యలపై సమాధానం చెప్పాల్సిన ఏఈ, డీఈ స్థాయి అధికారులు సమావేశానికి హాజరు కాకపోవడంపై ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కెనాల్స్ ద్వారా చెరువులను నింపడంలో పర్యవేక్షణ లోపం ఉందని, నీరు వృథాగా పోతున్నా చెరువులు నిండడం లేదని విమర్శించారు. వీబీజీ రాంజీ, సీడీపీ, ఎంపీల్యాడ్స్, డీఎంఎఫ్‌టీ, ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టే పనుల్లో గ్రామ పంచాయతీ తీర్మానాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, సర్పంచులకు సమాచారం లేకుండా వెండర్ వ్యవస్థ ద్వారా పనులు చేపట్టడాన్ని నిలిపివేయాలని కోరారు.

### రేషన్, వ్యవసాయం, విద్యపై అధికారుల వివరణ:

తహసీల్దార్ పి. శ్రీనివాస్ అర్హులైన వారు రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, సన్న బియ్యం సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ అధికారి రుషేంద్ర మణి ఎరువులు, విత్తనాల సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్, నోట్‌బుక్స్, రెండు జతల యూనిఫాంలు పంపిణీ చేసినట్లు మండల విద్యాధికారి ధర్మానాయక్ తెలిపారు. పశువులకు టీకాలు, నట్టల నివారణ మందులు, కృత్రిమ గర్భధారణ కార్యక్రమాలు చేపట్టినట్లు పశుసంవర్ధక అధికారి జ్ఞానేశ్వర్ ప్రసాద్ వివరించారు. తక్కెళ్లపాడు, ఆలగడప, లక్ష్మీపురం గ్రామాల్లో వీవో భవనాలు, ఎస్బీఎం సోక్‌పిట్ల పనులు త్వరగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఏఈ వరలక్ష్మి సూచించారు. ఆర్-5 ఎత్తిపోతల పథకం మరమ్మతులు పూర్తయ్యాయని నీటిపారుదల ఏఈ ప్రభాకర్ తెలిపారు. మిర్యాలగూడ-దిలావర్‌పూర్ రోడ్డు వెడల్పు పనులు ప్రగతిలో ఉన్నాయని ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు. డ్రిప్ పరికరాలకు రైతులకు రాయితీలు, ఆయిల్‌పామ్ సాగుపై ఉద్యానవన శాఖ అధికారి నసీమా వివరించారు. గ్రామాల్లో ఫారం పాండ్లు, ఇంకుడు గుంతలు, రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్, సోక్‌పిట్ల నిర్మాణంపై అవగాహన కల్పించాలని ప్రత్యేక అధికారి సూచించారు. మండలంలో మంజూరైన 12 అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని ఎంపీడీవో శేషగిరి శర్మ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.



# ఉరి వేసుకుని వ్యక్తి మృతి

**ప్రజా వాయిస్ లక్షెట్టిపేట**
మంచిర్యాల జిల్లా లక్షేటిపేట పట్టణంలోని భగత్ సింగ్ నగర్ కు చెందిన గుర్రాల జయకర్ అనే 40 సంవత్సరాల వ్యక్తి ఇంటి సమీపంలోని వేప చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడని ఎస్ ఐ గోపతి సురేష్ తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతునికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు.అందరికీ పెళ్లి లయ్యాయి.మృతునికి కుటుంబ కలహాలతో నిన్న గొడవలు జరగగా మృతుడు తన సోదరులకు ఫోన్ చేసి నాకు ఇంట్లో కుటుంబ కలహాలతో ఎప్పుడు గొడవ జరుగుతుంది నాకు బతకడం ఇష్టం లేదు అని ఫోన్ చేసి చెప్పి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సోదరుడు గుర్రాల చంద్రమౌళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



# గుంజపడుగులో ఉత్సాహంగా 'స్మార్ట్ రేషన్ కార్డ' పంపిణీ

- కార్యక్రమంలో పాల్గొన్న ఉపసర్పంచ్ ఎల్క లక్ష్మి, వార్డు సభ్యులు
- లబ్ధిదారులకు అందజేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు

**ప్రజా వాయిస్ మంథని**
మండలం గుంజపడుగు గ్రామంలో రెవెన్యూ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో డిప్యూటీ సర్పంచ్ ఎల్క లక్ష్మి, వార్డు సభ్యులు పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను చేతుల మీదుగా అందజేశారు. ?ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మాట్లాడుతూ... ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ప్రతీ పేదవాడికి చేరాలనే లక్ష్యంతో ఈ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని చేపట్టినట్లు తెలిపారు. డిజిటల్ విధానంలో రూపొందించిన ఈ కార్డులతో భవిష్యత్తులో పారదర్శకంగా సేవలు అందుతాయని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారుల సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ?ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఉదరీ కవిత, దేవళ్ళ లక్ష్మి, బోగే రాజేశ్వరి, బోగే సంపత్, దేవరకొండ పోచం, సింగిల్ విండో డైరెక్టర్ దేవళ్ళ విజయకుమార్, గ్రామ జీపీఓ రవీందర్, రెవెన్యూ సిబ్బందితో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# గ్రామ సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి

**మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్ రావు**

**ప్రజా వాయిస్ వేములపల్లి**
వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళికలో భాగంగా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసే గ్రామ సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్రావు అన్నారు వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పైలట్ గ్రామపంచాయతీగా ఎంపికైన మండలంలోని మొలక పట్నం గ్రామంలో శనివారం వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు ఈ ప్రాణాలికలో భాగంగా 22 ప్రభుత్వ శాఖల ద్వారా గ్రామాభివృద్ధికి అవసరమైన సుమారు 31 లను గుర్తించడం జరిగిందన్నారు రానున్న మూడు సంవత్సరాల్లో వీటన్నిటిని ప్రాధాన్యత క్రమంలో పూర్తిచేసి గ్రామ సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేయునట్లు ఆయన తెలిపారు ఇందుకు అధికారులు గ్రామ ప్రజా ప్రతినిధులు పౌరులు సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో ఎర్రిపోతుల మౌనిక ఎంపీడీవో జ్యోతి ఎ పి ఓ శ్రీనివాస్ రెడ్డి, ఏఈలు వేణుగోపాల్ గంగాభవాని మండల వ్యవసాయ అధికారి కిషోర్ నాయక్ పశు వైద్య కారి అశోక్ ఆర్టికల్చర్ ఎక్స్టెన్షనల్ ఆఫీసర్ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు

# అప్ అండ్ డౌన్ అధికారులపై చర్యలేవి?

- జిల్లా కలెక్టర్ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటే...
- మంథని డివిజన్‌లో నిర్లక్ష్యం
- స్థానికంగా ఉండరు... సమయానికి రారు!
- అలవెన్సులు నిండుగా... అందుబాటు మాత్రం సున్నా!
- పనుల కోసం వచ్చి నిరీక్షిస్తున్న సామాన్యులు
- స్థానికంగా ఉండాలని ప్రజాల డిమాండ్

ప్రజా వాయిస్ మంథని
జిల్లా కలెక్టర్ నిత్యం ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాత్రింబవళ్లు పర్యటిస్తుంటే, మంథని డివిజన్, మండల స్థాయి అధికారులు మాత్రం విధులను కేవలం అప్ అండ్ డౌన్ టూర్లుగా మలుచుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు కలెక్టర్ స్వయంగా పల్లె నిద్రలు, సర్ప్రైజ్ విజిట్లతో ప్రజల్లో ఉంటే... మంథనిలోని కొందరు అధికారులు మాత్రం ఆఫీసులకు రావడం చుట్టపు చూపుగా మారిందని స్థానికులు మండిపడుతున్నారు.

అలవెన్సులు లభించేది స్థానికంగా ఉండేందుకే..!
ప్రభుత్వం ప్రజాప్రతినిధులు, అధికారులకు స్థానిక హెడ్‌క్వార్టర్స్‌లోనే నివాసముండాలనే నిబంధన విధించడంతో పాటు, దానికి తగినట్లుగానే రవాణా, ఇంటి అద్దె, ఇతర అలవెన్సుల రూపంలో వేలల్లో నిధులు చెల్లిస్తోంది. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ అత్యవసర సమయంలో సేవలందించాలన్నదే ఈ సదుపాయాల వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం. కానీ మంథనిలోని కొందరు డివిజన్, మండల స్థాయి అధికారులు మాత్రం కరీంనగర్, పెద్దపల్లి లేదా ఇతర సమీప పట్టణాల నుండి ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తున్నారు. ఉదయం ఆలస్యంగా రావడం, సాయంత్రం వేళల్లో ఆఫీసు వేళలు ముగియకముందే తిరుగు ప్రయాణమవ్వడం పరిపాటిగా మారింది.

ప్రజలకు తప్పని తిప్పలు
దూరప్రాంతాల నుంచి వివిధ పనుల నిమిత్తం, అర్జీలు ఇచ్చేందుకు కార్యాలయాలకు వచ్చే సామాన్య ప్రజలకు అధికారుల దర్శనం లభించడం గగనంగా మారింది. మధ్యాహ్నం 12 గంటల దాటినా సీటులో లేకపోవడం, సాయంత్రం 4 గంటలకే నిష్క్రమించడంతో నిరుపేదలు, రైతులు, విద్యార్థులు రోజంతా వేచి చూసి నిరాశతో వెనుతిరగాల్సి వస్తోంది. కలెక్టరేట్ స్థాయిలో స్పందన కనిపిస్తున్నా, మంథని డివిజన్ పరిధిలో మాత్రం




అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల పాలన గాడి తప్పుతోందని ప్రజా సంఘాలు, స్థానికులు ఆరోపిస్తున్నారు.ప్రజాధనాన్ని జీతాల రూపంలో, అలవెన్సుల రూపంలో పొందుతున్న అధికారులు ఇప్పటికైనా తమ తీరు మార్చుకొని, స్థానిక హెడ్‌క్వార్టర్స్‌లోనే అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించాలని మంథని డివిజన్ ప్రజలు కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సదరు అధికారుల తీరుపై తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# వరి సాగులో నీటి సమర్థ వినియోగంతో అధిక దిగుబడులు సాధించాలి

- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- రైతు బలపడితేనే దేశం అభివృద్ధి చెందుతుంది
- హైకోర్టు అడ్వకేట్ బుద్ధార్తి నవీన్ పటేల్

**ప్రజా వాయిస్ పెద్దపల్లి**
వరి సాగులో ఆధునిక సాంకేతిక పద్ధతులను అవలంబిస్తూ నీటిని సమర్థవంతంగా వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష రైతులకు సూచించారు.పెద్దపల్లి పట్టణ పరిధిలోని రంగంపల్లి వెంకట పద్మ ఫంక్షన్ హాల్‌లో సౌ ఠ రీప్ క్లైమేటెక్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వరి వరహాలు రైతుల అభినందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీటి సమర్థ వినియోగ పద్ధతులను (ఆల్టర్నేట్ వెట్టింగ్ అండ్ డ్రైయింగ్) అనుసరించిన రైతులకు ఎకరాకు రూ.500 చొప్పున ప్రోత్సాహక చెక్కులను అందజేశారు. ?ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు సాంప్రదాయ సాగు విధానాల నుంచి ఆధునిక సాంకేతిక పద్ధతుల వైపు మారాల్సిన అవసరం ఉందన్నారు. వరి సాగులో అవసరమైన సమయంలో మాత్రమే నీటిని అందించడం ద్వారా నీటి వృథాను తగ్గించడమే కాకుండా పంట దిగుబడులను



మెరుగుపరచవచ్చని తెలిపారు. పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల పరిధిలో రైతులను ఆధునిక వరి సాగు పద్ధతుల వైపు ప్రోత్సహించేందుకు సౌ & రీప్ క్లైమేటెక్ సంస్థ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఆధునిక సాగు పద్ధతులను అనుసరించి విజయవంతమైన రైతులు తమ అనుభవాలను తోటి రైతులతో పంచుకోవాలని పిలుపునిచ్చారు.

**మంథని ప్రాంతంలోనూ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి**
కార్యక్రమంలో పాల్గొన్న హైకోర్టు అడ్వకేట్, యువ జనతా ఫౌండేషన్ అధ్యక్షుడు బుద్ధార్తి నవీన్ పటేల్ మాట్లాడుతూ, రైతులకు ప్రయోజనం చేకూర్చే ఇలాంటి మంచి కార్యక్రమానికి నన్ను ఆహ్వానించినందుకు సంస్థ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. సౌ ఠ రీప్ క్లైమేటెక్ సంస్థ ద్వారా ఆల్టర్నేట్ వెట్టింగ్ అండ్ డ్రైయింగ్ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించడమే కాకుండా, సుమారు రూ.20 లక్షలకు పైగా ప్రోత్సహకాలను అందజేయడం అభినందనీయమన్నారు. ఈ పద్ధతి ద్వారా రైతులకు పంట దిగుబడి పెరగడమే కాకుండా అదనపు ఆదాయం కూడా సమకూరుతుందని పేర్కొన్నారు. ఇలాంటి ఆధునిక సాగు అవగాహన కార్యక్రమాలను జిల్లాలోని కొన్ని గ్రామాలకే పరిమితం చేయకుండా తమ మంథని ప్రాంతంలోనూ విస్తృతంగా నిర్వహించాలని సంస్థ ప్రతినిధులను కోరారు. రైతు బలపడితేనే గ్రామం, జిల్లా బలపడతాయని, రైతు అభివృద్ధి చెందితేనే దేశం సర్వోతోముఖాభివృద్ధి సాధిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీ కంతయ్య, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ శ్రీనాథ్, డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ (పెద్దపల్లి), తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తూము రవీందర్ పటేల్, ఎంఏఓ నాగార్జున పాల్గొన్నారు. అలాగే సౌ ఠ రీప్ క్లైమేటెక్ తరఫున సీఓఓ ఎన్. మురళీధర్, డైరెక్టర్ డి. దివ్యా రెడ్డి, ఆపరేషన్స్ మేనేజర్ సీహెచ్. వెంకట రమణ, ఎన్‌బీఎస్ హెడ్ పృథ్వీరామ్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి. స్వప్నతో పాటు సంస్థ బృందం, పెద్దసంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా పటిష్ట ఏర్పాట్లు

**పోచమ్మ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్**

**ప్రజా వాయిస్ బెల్లంపల్లి టౌన్**
మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణం మరియు పరిసర ప్రాంతాలకు చెందిన వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగే పోచమ్మ చెరువు వద్ద చేపట్టిన ఏర్పాట్లను మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్ మున్సిపల్ చైర్‌పర్సన్ స్వాతి, సబ్ కలెక్టర్, తహసీల్దార్, మున్సిపల్,పోలీస్ మరియు ఇతర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. వినాయక విగ్రహాలు వచ్చే మార్గం, నిమజ్జనం అనంతరం బయటకు వెళ్లే మార్గం, పరిసర ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ నిమజ్జన శోభాయాత్ర సజావుగా సాగేందుకు శోభాయాత్ర మార్గంలో ఉన్న గుంతలను తాత్కాలికంగా పూడ్చి, వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్, మున్సిపల్ కమిషనర్‌లను ఆదేశించారు. ప్రస్తుతం అవసరమైన తాత్కాలిక ఏర్పాట్లు చేపడుతున్నారని, సబ్ కలెక్టర్ కూడా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. నిమజ్జన ప్రాంతంలో తగినంత వెలుతురు ఉండేలా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని సూచించారు. చెరువులో డ్రెడ్జింగ్ ద్వారా లోతును పెంచడంతో పాటు అవసరమైన ఇతర ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. పోలీస్ శాఖ తరఫున 3 షిఫ్టుల్లో పూర్తిస్థాయి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా సుమారు 2,800 వినాయక విగ్రహాల నిమజ్జనం జరగనున్న నేపథ్యంలో నిర్వాహకులు, ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జన చెరువులు, నిమజ్జన పాయింట్ల వద్ద చిన్నపిల్లలు, వృద్ధులు,ఈత రాని వ్యక్తులు నీటి వద్దకు వెళ్లకుండా నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ప్రధాన నిమజ్జన పాయింట్ల వద్ద మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు.విగ్రహాలను తరలించే సమయంలో విద్యుత్ తీగలు, కేబుల్ వైర్ల ఎత్తును ముందుగానే పరిశీలించి, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అన్ని నిమజ్జన పాయింట్లను జియో ట్యాగింగ్ చేసి, అధికారులు పగలు, రాత్రి వేళల్లో నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.పోలీస్ శాఖ సూచనలు,భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని డీసీపీ కోరారు.డీసీపీ వెంట బెల్లంపల్లి రూరల్ ఇన్స్పెక్టర్ హనోక్ ,బెల్లంపల్లి 1 టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, మున్సిపల్ అధికారులు,ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు ఉన్నారు.



# మిల్ కార్మికుల ఆకలి కేకలు నివారించాలి

**తొర్రూర్ ప్రజా వాయిస్..**
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గత పది రోజులుగా రైస్ మిల్లులు బంద్ కావడంతో లక్షలాది మంది కార్మికులు పనులు లేక ఆకలి కేకలతో అల్లాడుతున్నారని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టి యు సి ఐ) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైస్ మిల్లర్ల సమస్యలను వెంటనే పరిష్కరించి మిల్లులు నడిపిస్తే కార్మికులకు ఉపాధి దొరుకుతుందని లేదంటే వారి కుటుంబాలు రోడ్డున పడతాయని ఆయన అన్నారు. మాది ప్రజా ప్రభుత్వం అంటున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్షలాది కార్మికుల పై చూపుతున్న తీవ్ర ప్రభావాన్ని ఎందుకు పరిగణలోకి తీసుకోవటం లేదని అన్నారు. రైస్ మిల్ యజమానులు, సివిల్ సప్లై అధికారులు, ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని



కోరారు. దళిత గిరిజన అట్టడుగు వర్గాల ప్రజలు హమాలీలుగా పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారని ఆయన గుర్తు చేశారు. చత్తీస్గఢ్, బీహార్,బెంగాల్,మహారాష్ట్ర బ్రతుకుతెరువు కోసం వలస వచ్చి ఇక్కడ మిల్లులో పనిచేస్తుంటే గత పది రోజులుగా వారి పని లేక పస్తులు ఉండాల్సిన దుస్థితితో తిరిగే వెళ్లి పోతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక కుటుంబాల ప్రయోజనాల కోసమైనా మిల్లు యజమానులతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని రవి డిమాండ్ చేశారు. హమాలీ కార్మికుల కోసం సమగ్ర వేతన చట్టాన్ని, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి అన్ని రకాల కార్మికులకు లబ్ధి చేకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. 20 మంది దాటిన ప్రతి మిల్లులో పిఎఫ్ సౌకర్యం కల్పించాలని అందుకు కార్మిక శాఖ ప్రావిడెంట్ ఫండ్ అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. మిల్లులు తెరిపించి లక్షలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించకపోతే మా ఈ ఉద్యమాన్ని అన్ని సంఘాలను ఆందోళన ఉధృతం చేస్తామని తెలియజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాం పుల్లయ్య, కార్మిక నాయకులు శ్రీను, సూరజ్ శివ వీరన్న వెంకట్ యాకయ్య తదితరులు పాల్గొని ప్రసంగించారు...

# హామీలు పక్కనపెట్టి.. డైవర్షన్లలో రేవంత్ రెడ్డి

### బీఆర్ఎస్ తొగుట మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి

**ప్రజా వాయిస్ దుబ్బాక/ తొగుట**
ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, డిక్లరేషన్ లు, 420 ఎన్నికల హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ డైవర్షన్లతో కాలయాపన చేస్తోందని బీఆర్ఎస్ తొగుట మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి విమర్శించారు. తొగుట లో బి ఆర్ ఎస్ నాయకులు సుతారి రమేష్, చంద స్వామి తో కలిసి మాట్లాడారు.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వొచ్చి 1,000 రోజుల పాలన పూర్తవుతున్నా హామీల అమలుపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ప్రజలు ఎన్నికల హామీల కోసం నిలదీస్తుంటే,మెడిగడ్డ, కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, ఫార్ములాఈ రేస్, హైడ్రా, ఫార్మా విలేజ్, మూసీ, ఫామ్‌హౌస్, భూముల అంశాలను ముందుకు తెచ్చి ఇచ్చిన హామీలను, ప్రజా సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు."డైవర్షన్లతో కాలం గడిపినా ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, సరైన సమయంలో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు కూడా దానం నాగేందర్‌కు ఎదురైన చట్టపరమైన పరిణామాలే ఎదురుకావడం ఖాయమన్నారు.. శాసనసభలో ప్రజా సమస్యలు చర్చించాల్సింది పక్కన పెట్టి ప్రతిపక్ష నాయకులను బయటకు పంపి కేసీఆర్ కేటీఆర్ హరీష్ రావు లపై కక్షపూరిత రాజకీయాలకు సభా సమయం దుర్వినియోగం చేయడం జరిగిందన్నారు..ఎర్రవల్లి ఫామ్‌హౌస్ భూముల విషయంలో కేసీఆర్ ఒక్క గజం అసైన్డ్ భూమి కూడా తీసుకోలేదన్న మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు స్వీకరించి న్యాయ విచారణకు సిద్ధం కావాలని అయన డిమాండ్ చేశారు. ఎర్రవల్లి తరహాలో రేవంత్ రెడ్డి కుటుంబ ఆస్తులపై వారి మంత్రుల కుటుంబ ఆస్తులపై విచారణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఆరోపణలు, రాజకీయ విమర్శలతో కాకుండా తెలంగాణలో రైతులు కరెంటు సమస్యలతో, సాగునీటి ఘోష లో ఉన్నారని, వాటి పరిష్కారం చేయాలని రైతు బీమా కొనసాగించాలని 22ఖ సమస్యకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు .



## జేఎన్‌టీయూహెచ్ సుల్తాన్‌పూర్‌లో
# వైభవంగా వినాయక నిమజ్జనం

**ప్రజా వాయిస్,సంగారెడ్డి :**
జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, సుల్తాన్‌పూర్‌లో వినాయక నిమజ్జనం వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. విశ్వనాధ రాజు, వైస్ ప్రిన్సిపాల్, బోధన మరియు బోధనేతర సిబ్బంది ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.వినాయక చవితి సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ప్రతిష్ఠించిన శ్రీ విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు మరియు హారతులు నిర్వహించారు. అనంతరం వినాయకుని విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా నిమజ్జన ప్రదేశానికి తరలించారు. విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది భక్తి గీతాలు, నినాదాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు ఆనందోత్సాహాలతో నృత్యాలు చేస్తూ, డప్పు వాయిద్యాల నడుమ గణనాథునికి ఘనంగా వీడ్కోలు పలికారు. కళాశాల ప్రాంగణమంతా "గణపతి బప్పా మోరియా" నినాదాలతో మార్మోగింది. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో నిమజ్జన వేడుక సందడిగా సాగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, వినాయక చవితి వేడుకలు విద్యార్థుల్లో ఐక్యత, సోదరభావం, సాంస్కృతిక విలువలు మరియు ఆధ్యాత్మిక భావనలను పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు మరియు పండుగల విశిష్టతను తెలుసుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు.వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన వైస్ ప్రిన్సిపాల్, బోధన, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు. ప్రశాంతమైన మరియు భక్తిపూర్వక వాతావరణంలో నిమజ్జన కార్యక్రమం ముగిసింది.ఈ కార్యక్రమంలో కళాశాల బోధన మరియు బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### బిబి రూ. 2.కోట్లతో పలు వార్డులో సీసీ రోడ్డు పనుల శంకుస్థాపన
### ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

**ప్రజా వాయిస్ కల్వకుర్తి ( సెప్టెంబర్ 19 ):**
ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇందులో భాగంగా ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో రూ. 2 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకాంత్ కాలనీలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణంలోని కాలనీల్లో రహదారి సౌకర్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. రోడ్ల నిర్మాణంతో ఆయా కాలనీల్లో ప్రజల రాకపోకలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు కేవలం ప్రారంభోత్సవాలకే పరిమితం కాకుండా, ప్రజలకు పూర్తిస్థాయి ప్రయోజనం చేకూరేలా ఉండాలని అన్నారు. ప్రజాధనం ఖర్చు చేస్తున్న ప్రతి అభివృద్ధి పనిలో నాణ్యతే ప్రధాన ప్రమాణంగా ఉండాలన్నారు. నిర్ణీత ప్రమాణాల ప్రకారం పనులు చేపట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. 8వ వార్డు సంకటోనిపల్లి బీసీ కాలనీలో రూ. 40 లక్షలు, 9వ వార్డు శ్రీకాంత్ కాలనీలో రూ. 40 లక్షలు, 10వ వార్డు విటాయిపల్లి ఒ పెండ తండాలో రూ. 50 లక్షలు, 11వ వార్డు పద్మశాలి కాలనీలో రూ. 30 లక్షలు, 12వ వార్డులో రూ.40 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ఇంకా అవసరమైన ప్రాంతాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, మార్కెట్ చైర్మన్ యాట గీత, కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, కౌన్సిలర్లు వెంకటయ్య, రాము, జగన్, అనిత, మహేష్, ఆంజనేయులు, శ్రీశైలం, రమేష్, కో-ఆప్షన్ సభ్యులు అల్లాజీ, ఖాదర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యాట నర్సింహా, గుర్రం కేశవులు, శ్రీనివాస్ రెడ్డి, సత్యం మరియు కండే భాస్కర్ తదితరులు పాల్గొన్నారు





# ఆర్టీసీ బస్సు ఢీకొని ఒక వ్యక్తి మృతి

**ప్రజా వాయిస్ కొండమల్లేపల్లి మండలం సెప్టెంబర్ 19**
కొండమల్లేపల్లి మండలం దర్గా తండ గ్రామానికి చెందిన రామవత్ శ్రీరాములు తండ్రి లక్ష్మణ్ వయసు 35 సంవత్సరాలు వృత్తి మేస్త్రి పని చేసి జీవనం కొనసాగిస్తున్నాడు 18.9.2026 శుక్రవారం నాడు. 7.10 నిమిషాల సమయం లో. దేవత్ పెల్లి స్టేజి వద్ద కిరాణా షాపు వద్దకు వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుండి కొండమల్లేపల్లి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు టీఎస్ 05 జెడ్ 0206 గల ఆర్టీసీ బస్సు డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా నడిపి రోడ్డు దాటుతున్న శ్రీరాములు ఢీకొట్టగా తలకు కాళ్లకు తీవ్ర గాయాలు కాగా దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స పొందుతూ రాత్రి 8:30 సమయంలో మృతి చెందాడు మేస్త్రి శ్రీరాములు మృతికి కారకమైన బస్సు డ్రైవర్ బోడ హనుమంతు పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని మృతి తల్లి కొండమల్లేపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయడమైనది కొండమల్లేపల్లి ఎస్సై అజ్మీరా రమేష్ తెలియజేశారు

# సంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడిగా పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి

**ప్రజా వాయిస్ నారాయణఖేడ్:**
సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడిగా పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ శనివారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. పార్టీ చేపట్టిన సంస్థాగత పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా తెలంగాణలోని పలు జిల్లా కాంగ్రెస్ కమిటీలకు అధ్యక్షులను నియమించగా, సంగారెడ్డి జిల్లా బాధ్యతలను చంద్రశేఖర్‌రెడ్డికి అప్పగించారు.చంద్రశేఖర్‌రెడ్డి నారాయణఖేడ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాల్లో కొనసాగుతూ వస్తున్నారు. గతంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా కూడా బాధ్యతలు నిర్వహించారు.సంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడిగా నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని ప్రకాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఆయన నియామకంతో జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త అధ్యక్షుడి నాయకత్వంలో పార్టీ కార్యక్రమాల నిర్వహణపై ఆసక్తి నెలకొంది.






# ఎస్.జి.ఎఫ్ ఆటల పోటీల్లో మాస్ట్రో విద్యార్థుల ప్రతిభ

**ప్రజా వాయిస్, కథలాపూర్:**
మండల కేంద్రంలో జరిగిన ఎస్.జి.ఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆటల పోటీల్లో మాస్ట్రో పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ చాటారు. పద్నాలుగేళ్ల లోపు బాలికల కబడ్డీ, బాలుర ఖో-ఖో విభాగాల్లో ప్రథమ స్థానం సాధించారు. అలాగే పద్నాలుగు, పదిహేడేళ్ల లోపు చదరంగం (చెస్) పోటీల్లో విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. విజేతలైన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ ఆకుల రాజేష్, ప్రధానోపాధ్యాయులు ఆకుల రంజిత్, డైరెక్టర్ ఆకుల రాజేందర్, వ్యాయామ ఉపాధ్యాయులు మల్లేష్, లింబ, బాలమణి మరియు ఉపాధ్యాయ బృందం అభినందించారు.




## బ్యాగ్ డే: జెడ్పీహెచ్ఎస్
# విద్యార్థుల ఫీల్డ్ విజిట్

**ప్రజా వాయిస్, కోరుట్ల:**
స్థానిక జెడ్పీహెచ్ఎస్ (బాలుర) ఉన్నత పాఠశాల విద్యార్థులు 'నో బ్యాగ్ డే' సందర్భంగా శనివారం క్షేత్రస్థాయి పరిశీలన (ఫీల్డ్ విజిట్) నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక గ్రంథాలయం, పోలీస్ స్టేషన్, పోస్టాఫీసులను సందర్శించి ఆయా సంస్థల విధులు, సేవలు, నిర్వహణపై ప్రత్యక్ష అవగాహన పొందారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్.ఎం. జ్యోత్స్న, ఉపాధ్యాయులు మోహన్ ప్రసాద్, యూసుఫ్, సైఫుద్దీన్, నరేందర్ రాజు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# పౌష్టిక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

**ప్రజా వాయిస్ :-**
తిరుమలగిరి మండల కేంద్రంలోని కొంపెల్లి గ్రామంలో గర్భిణీలకు,బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారం ద్వారానే ఆరోగ్యంతో ఎదుగుతారని ఐ సి డి ఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జంగాల సాలమ్మ ( రవీందర్) మరియు అంగన్వాడి టీచర్స్ సుజాత, సుగుణమ్మ, నాట్ కో టీచర్స్ అశ్విని, శిరీష, బాలింతలు గ్రామ తదితరులు పాల్గొన్నారు.

# అదుపుతప్పిన స్కూటీ.. చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**ప్రజా వాయిస్, కథలాపూర్:**
బైక్ అదుపుతప్పి పడిపోవడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై రవికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం... ఇప్పపెల్లి గ్రామానికి చెందిన ఒగ్గు రమేష్ (42) ఈ నెల 14న రాత్రి తాండ్రియల నుంచి స్కూటీపై వస్తుండగా పెద్దమ్మ గుడి సమీపంలో అదుపుతప్పి పడిపోయాడు. తలకు తీవ్ర గాయమవ్వడంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చేర్పించగా, శనివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి బావమరిది చిట్యాకరి మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.





# హోటల్ నిర్వాహకులు నాణ్యత ప్రమాణాలను పాటించాలి: సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్

**ప్రజా వాయిస్/ఆత్మకూరు(ఎం):**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని ప్రతి హోటల్ నిర్వాహకులు తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలతో పాటు పరిశుభ్రతను పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ అన్నారు.ఆహార పదార్థాల తయారీలో మంచి నాణ్యమైన వంట నూనె మాత్రమే ఉపయోగించాలని,హోటల్ పరిసరాలు, వంటగది, వంట పాత్రలతో పాటు తయారుచేసిన ఆహార పదార్థాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.నిబంధనలు పాటించకుండా పరిశుభ్రత తో పాటు నాణ్యతను నిర్లక్ష్యం చేసే హోటళ్లపై గ్రామ పంచాయతీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.హోటల్ నిర్వాహకులందరూ సహకరించి ప్రజలకు శుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందించాలని కోరారు.



# రైతులు డిజిటల్ క్రాప్ సర్వేకు సహకరించాలి: ఏఈఓ దూడల మౌనిక

**మోటకొండూరు/ప్రజా వాయిస్:-**
కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'డిజిటల్ క్రాప్ సర్వే'తో వ్యవసాయ రంగంలో మరింత పారదర్శకత రానుందని, ఈ సర్వేకు రైతులంతా సహకరించాలని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) దూడల మౌనిక పిలుపునిచ్చారు. మోటకొండూరు క్లస్టర్ పరిధిలో జరుగుతున్న సర్వేను శనివారం ఆమె క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఏఈఓ మౌనిక మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు చేశారు.రైతుల పొలాల వద్దకే నేరుగా వచ్చి, డిజిటల్ విధానంలో సాగు వివరాలను నమోదు చేస్తున్నాం. ఏ సర్వే నంబర్లో, ఎంత విస్తీర్ణంలో, ఏ పంట వేశారనే పూర్తి వివరాలను పారదర్శకంగా యాప్‌లో పొందుపరుస్తున్నాం" అని ఆమె వివరించారు.వ్యవసాయ రంగానికి సంబంధించిన ఖచ్చితమైన సమాచారం ప్రభుత్వాల వద్ద ఉంటే.. భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు, రాయితీలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు నష్టపరిహారం నేరుగా అర్హులైన రైతులకే అందుతాయి. అందుకోసమే ఈ సర్వే నిర్వహిస్తున్నాం" అని పేర్కొన్నారు.సర్వే కోసం వస్తున్న అధికారులకు రైతులు తమ పొలాల్లో సాగు చేస్తున్న పంటల పూర్తి సమాచారాన్ని అందించి సహకరించాలి. వాస్తవ వివరాలను నమోదు చేయించి ఈ ప్రక్రియను విజయవంతం చేయాలి" అని ఆమె రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ దూడల మౌనికతో పాటు వాలంటీర్ ఎగ్గిడి రాజు తదితరులు పాల్గొని క్షేత్రస్థాయిలో రైతుల పొలాలను పరిశీలించి పంటల వివరాలను డిజిటల్ విధానంలో నమోదు చేశారు.



# విద్యార్థులకు బ్యాగ్లెస్ డే

**ప్రజా వాయిస్/ఆత్మకూరు(ఎం):**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలంలోని కోరటికల్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బ్యాగ్లెస్ డేను నిర్వహించారు.విద్యార్థులు నెల రోజుల పాటు పాఠశాల కు బ్యాగ్ ల తో హాజరై ,ఒత్తిడికి లోనూ కాకుండా ప్రతి నెల మూడవ శనివారం జాయ్ ఫుల్ లెర్నింగ్ ,ఒత్తిడి లేని విద్య అందించడం లో భాగంగా క్విజ్ పోటీలు నిర్వహించి ఆటలు ఆడించారు.చదువు లో వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యం తో ప్రతి మూడవ శనివారం ఇలాంటి కార్యక్రమాలను ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని పాఠశాల ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు డి.వెంకన్న తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వామి,రవి,వర ప్రసాద్,శ్రీనివాసచారి,అనురాధ, వెంకటేశం,మాధవి,విద్యార్థులు పాల్గొన్నారు.

# కీసరలో యువకుడి మిస్సింగ్.. కుటుంబానికి సీపీ సుమతి భరోసా

**అజయ్‌కుమార్ ఆచూకీ కోసం ప్రత్యేక దర్యాప్తు**
**వెంటనే పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని హామీ**



**ప్రజా వాయిస్, కీసర:**
మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో గంధమాల అజయ్‌కుమార్ (21) అదృశ్యమైన ఘటనపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని కుటుంబ సభ్యులు కోరారు. సెప్టెంబర్ 3వ తేదీ నుంచి అజయ్‌కుమార్ కనిపించకుండా పోగా, సెప్టెంబర్ 4న కుటుంబ సభ్యులు కీసర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటికీ, 15 రోజులు గడుస్తున్నా అజయ్‌కుమార్ ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో శుక్రవారం (సెప్టెంబర్ 19) కీసర మండల సామాజిక సేవా కార్యకర్త తుడుం శ్రీనివాస్ ఆధ్వర్యంలో అజయ్‌కుమార్ కుటుంబ సభ్యులు సీపీ సుమతి, డీసీపీ శ్రీధర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.అజయ్‌కుమార్ అదృశ్యంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి, అతని ఆచూకీని త్వరితగతిన గుర్తించేలా చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు అధికారులను కోరారు. దీనిపై స్పందించిన సీపీ సుమతి, డీసీపీ శ్రీధర్ వెంటనే పూర్తి స్థాయిలో ఎంక్వైరీ చేపడతామని, అజయ్‌కుమార్‌ను సురక్షితంగా కుటుంబ సభ్యుల వద్దకు చేర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.అదృశ్యమైన యువకుడి కుటుంబానికి అధికారులు భరోసా కల్పించడంతో కుటుంబ సభ్యులు కొంత ఊరట వ్యక్తం చేశారు. తక్షణమే స్పందించి విచారణకు హామీ ఇచ్చిన సీపీ సుమతి, డీసీపీ శ్రీధర్‌కు తుడుం శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు. అజయ్‌కుమార్ సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు.




# చదువుతోపాటు విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

**కృష్ణవేణి ఉన్నత ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు..**

**ప్రజా వాయిస్ జహీరాబాద్:**
మండల లీగల్ సర్వీసెస్ కమిటీ జహీరాబాద్ వారి ఆధ్వర్యంలో స్థానిక కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సును సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి. కవిత దేవి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి దాసరి బేస్లీ లు నిర్వహించి విద్యార్థులకు ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో జడ్జిలు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో ఉండాలని, చదువుపై శ్రద్ధ వహించి చక్కగా చదువుకోవాలని, పెద్దలను తోటివారిని గౌరవించాలని, చదువుతోపాటు సాధారణ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. బాలికల పట్ల, మహిళల పట్ల ఎవరైనా అసభ్యంగా, దురుసుగా ప్రవర్తించిన వారు కఠిన శిక్షలకు లోనవుతారని తెలియ జేశారు. విద్యార్థినులకు గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ఉపాధ్యాయులు మనకు దిశా నిర్దేశకులని, వారిని గౌరవించడం మన విధి అని తెలియజేసారు. ప్రతి విద్యార్థి ఒక లక్షాన్ని నిర్దేశించుకుని, ఆ లక్ష సాధనకు ఉపాధ్యాయుల సహకారం తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అదేవిధంగా మోటార్ వాహనాల చట్టం, బాల కార్మిక నిరోధక చట్టం విద్యార్థులకు తెలయజేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో న్యాయవాదులు అనూష ,ఇస్మాయిలప్ప, దామోదర్ రెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు లీగల్ సర్వీసెస్ సిబ్బంది, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు..




# తపస్ సభ్యతత్వ నమోదు

**ప్రజా వాయిస్ వేములపల్లి**
నల్గొండ జిల్లా వేములపల్లి మండల పరిధిలోని పలు పాఠశాలలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో శనివారం సభ్యతత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా తపస్ నాయకులు గుడిపాటి కోటయ్య మాట్లాడుతూ విద్యారంగ ఉపాధ్యాయుల సమస్యలపై సంఘం చేస్తున్న పోరాటం పట్ల ఆకర్షితులై ఎంతోమంది ఉపాధ్యాయులు తపస్ సంఘంలో సభ్యతత్వం స్వీకరించడం జరుగుతుందన్నారు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన ఆరు డిఏలతో పాటు, పి ఆర్ సి ని ఆలస్యం చేయకుండా తక్షణమే ప్రకటించాలన్నారు అదేవిధంగా సిపిఎస్ కేజీబీవీ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపాలన్నారు ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షుడు బంటు జనార్ధన్, ప్రధాన కార్యదర్శి నామిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సంఘం సభ్యులు ధూపాటి రాజశేఖర్ నాగమణి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు




# చదువుతోపాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలి

**- జిల్లా డీవైఎస్ఓ అక్కపాక సురేష్, ప్రిన్సిపల్ మాధవీలత**

**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :**
విద్యార్థులు విద్యతోపాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకుని తమ ప్రతిభను చాటుకోవాలని పెద్దపల్లి జిల్లా డీవైఎస్ఓ అక్కపాక సురేష్ సూచించారు. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం నిర్వహించిన జోనల్ స్థాయి అథ్లెటిక్స్ పోటీలను పరిశీలించారు. జోన్ పరిధిలోని నాలుగు మండలాల నుంచి బాలబాలికలు పోటీలకు హాజరై వివిధ అథ్లెటిక్స్ విభాగాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని డీవైఎస్ఓ అక్కపాక సురేష్ పేర్కొన్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారికి అవసరమైన ప్రోత్సాహం అందించాలని అన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ మాధవీలత మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర వికాసానికి క్రీడలు కీలకమని తెలిపారు. ప్రతిరోజూ కొంత సమయం క్రీడలకు కేటాయించాలని, పోటీల్లో పాల్గొనడం ద్వారా నాయకత్వ లక్షణాలు, పోటీతత్వం పెంపొందుతాయని అన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు డీవైఎస్ఓ, ప్రిన్సిపల్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జోనల్ కన్వీనర్ దాసరి రమేష్, మండల కన్వీనర్ తాండ్ర ప్రణయ్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



# నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

**ప్రజా వాయిస్ దౌల్తాబాద్, సెప్టెంబర్ 19:**
నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని ఎస్సై అరుణ్‌కుమార్ అన్నారు. శనివారం దౌల్తాబాద్ మండలం గువ్వలేగి గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సర్పంచ్ అల్లి శేఖర్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంతో పాటు నేరాలు జరిగినప్పుడు నిందితులను గుర్తించేందుకు పోలీసులకు ఆధారాలు లభిస్తాయని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గ్రామ భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన గ్రామస్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నర్సింలు, సాయిలు, మహేందర్, రవి, శ్రీనివాస్, చంద్రం, నర్సింలు, యాదగిరి, పవన్, శ్రీనివాస్, నవీన్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు



# బండరాళ్ల బ్లాస్టింగ్ ఘటనలో గాయపడ్డ బాధితుడికి ఆర్థిక సహాయం

**రూ.10 వేల ఆర్థిక సహాయం అందించిన బచ్చనబోయిన జోగయ్య**

**ప్రజా వాయిస్, కొండమల్లేపల్లి.**
కొండమల్లేపల్లి మండలం చింతకుంట్ల గ్రామానికి చెందిన కుంచం గిరి తండ్రి వెంకటయ్య కొద్దిరోజుల క్రితం దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రామావత్ రవీంద్రకుమార్ నాయక్‌కు చెందిన క్రషర్ మిల్లులో బండరాళ్లకు బ్లాస్టింగ్ హోల్స్ వేస్తున్న సమయంలో ప్రమాదానికి గురయ్యారు. కట్టపై నుంచి వచ్చిన రాయి గిరి కాలుకు బలంగా తగలడంతో తీవ్రంగా గాయపడ్డారు.బాధితుడిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని బేగంపేట వెల్‌నెస్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. గిరి కుడికాలు తీవ్రంగా దెబ్బతినడంతో వైద్యులు ఆ కాలును తొలగించగా, మరో కాలుకు ఆపరేషన్ చేశారు.ఈ విషయం తెలుసుకున్న చింతకుంట్ల గ్రామానికి చెందిన బచ్చనబోయిన జోగయ్య బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆపద సమయంలో ఆర్థిక సహాయం అందించిన జోగయ్యకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గిరిని దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని కోరారు.జోగయ్య వెంట గ్రామ యువకులు కుంచం విష్ణు, శ్రీరాములు, రాజు, నాగార్జున ఉన్నారు.

# కరెంటు తీగలపై మృత్యు నీడ

**అమీనాబాద్ 1వ వార్డులో నిత్యం షార్ట్‌సర్క్యూట్లు.. గంటల తరబడి కరెంటు కట్**
**గాలి వీస్తే చాలు.. ఇళ్లపై తీగలు పడే ప్రమాదం**
**అంధకారంలో చిన్నారులు, వృద్ధులు..**
**భయంతో బిక్కుబిక్కుమంటున్న జనం**

**ప్రజా వాయిస్,అనంతగిరి:**
సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల పరిధిలోని అమీనాబాద్ గ్రామంలో విద్యుత్ తీగలకు చెట్లు అల్లుకుపోవడంతో 1వ వార్డు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రైవేటు స్థలంలో విచ్చలవిడిగా పెరిగిన చెట్ల కొమ్మలు విద్యుత్ లైన్లను తాకుతుండటంతో తరచూ షార్ట్‌సర్క్యూట్లు, నిప్పురవ్వలు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**గాలి వీస్తే.. గుబులు**
గాలివాన వచ్చినప్పుడల్లా విద్యుత్ తీగలు తెగి ఇళ్లపై పడే ప్రమాదం ఉందని వార్డువాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడుతున్నామని చెబుతున్నారు. రాత్రివేళ విద్యుత్ అంతరాయంతో చిన్నారులు, వృద్ధులు ఉక్కపోతతో అంధకారంలో గడపాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అనుమతిస్తే.. వెంటనే తొలగింపు**
ప్రమాదకరంగా పెరిగిన చెట్లను తొలగించేందుకు విద్యుత్ శాఖ సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. స్థల యజమాని అనుమతి ఇస్తే జేసీబీతో చెట్లను తొలగించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని



స్పష్టం చేశారు. అయితే స్థల యజమాని ఇప్పటివరకు స్పందించకపోవడంతో సమస్య కొనసాగుతోందని పేర్కొన్నారు.

**ఇకనైనా స్పందించాలి**
స్థల యజమాని వెంటనే స్పందించి చెట్ల తొలగింపునకు సహకరించాలని వార్డువాసులు కోరుతున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన చెట్ల విషయంలో అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



# పాఠశాలల అభివృద్ధికి దివీస్ తోడ్పాటు అభినందనీయం

**వావిలపల్లి సర్పంచ్ ఐతరాజు సరళ**

**ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం**
గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి దివీస్ లేబరేటరీస్ అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం వాయిల్లపల్లి సర్పంచ్ అయితరాజు సరళ కొనియాడారు. శనివారం వాయిల్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో దివీస్ లేబరేటరీస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా, సర్పంచ్ సరళ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాతలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఉపాధ్యాయులు, విద్యార్థులు విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. క్రమశిక్షణతో కూడిన ఉత్తమ విద్యతోనే విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపడుతుందని ఆకాంక్షించారు. ఈ శిబిరంలో డాక్టర్ జయంత్ కుమార్, డాక్టర్ నరేష్ బృందం 144 మంది విద్యార్థులకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, సర్పంచ్ చేతుల మీదుగా ఉచితంగా మందులను అందజేశారు. దీనికి తోడుగా విద్యార్థుల చదువుకు ఆసరాగా రూ. 1,16,334లిలి విలువైన 3,033 నోట్ బుక్స్ ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్ రెడ్డి, దివీస్ ప్రతినిధి వెంకటేశ్వర్లు,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పితృవియోగంలో ఉన్న హర్షవర్ధన్ రెడ్డిని పరామర్శించిన కేటీఆర్

**ప్రజా వాయిస్ - వనపర్తి:**
పితృవియోగంతో బాధలో ఉన్న కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం పరామర్శించారు. ఎత్తం గ్రామ శివారులోని హర్షవర్ధన్ రెడ్డి వ్యవసాయ క్షేత్రానికి వెళ్లిన కేటీఆర్.. ఇటీవల మృతిచెందిన ఆయన తండ్రి లక్ష్మారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం హర్షవర్ధన్ రెడ్డిని ఆలింగనం చేసుకుని ఓదార్చారు. కుటుంబ సభ్యులను పరామర్శించి లక్ష్మారెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేశారు. హర్షవర్ధన్ రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి (87) అనారోగ్య కారణాలతో గురువారం మృతిచెందారు. ఆయన అంత్యక్రియలను శుక్రవారం కొల్లాపూర్ నియోజకవర్గంలోని ఎత్తం గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించారు. అంత్యక్రియలకు కేటీఆర్ హాజరవుతారని పార్టీ వర్గాల్లో ప్రచారం జరిగినప్పటికీ ఆయన శుక్రవారం కార్యక్రమానికి హాజరు కాలేకపోయారు. దీంతో శనివారం స్వయంగా వ్యవసాయ క్షేత్రానికి చేరుకుని కుటుంబాన్ని పరామర్శించారు. కేటీఆర్ రాక సందర్భంగా అక్కడ ఉన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు జై కేసీఆర్, జై జై కేటీఆర్ అంటూ నినాదాలు చేశారు. కేటీఆర్‌ను కలిసేందుకు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ముందుకు రావడంతో అక్కడ ఉత్సాహపూరిత వాతావరణం నెలకొంది. కేటీఆర్ వెంట మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఆశన్నగారి జీవన్‌రెడ్డి తదితర బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



# 100 అడుగుల రహదారిపై రగడ

**బీఆర్ఎస్ నేతలు వర్సెస్ బాధితులు**
**కార్తీక్‌రెడ్డి ధర్నాకు వ్యతిరేకంగా స్థానికుల నిరసన**
**ఇరువర్గాల మధ్య వాగ్వాదం**
**100 అడుగులు వద్దు'60 అడుగులే ముద్దు,టీడీఆర్ కాదు**
**నష్టపరిహారం కావాలి అంటూ బాధితుల ఆందోళన**
**బాధితుల నిర్ణయమే మా నిర్ణయం:కార్తీక్‌రెడ్డి**

**ప్రజా వాయిస్// రాజేంద్రనగర్:**
బండ్లగూడ చౌరస్తా నుంచి కిస్మత్‌పూర్ వరకు ప్రతిపాదించిన 100 అడుగుల రహదారి అంశం ఉద్రిక్తతకు దారితీసింది. రహదారి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ పి. కార్తీక్‌రెడ్డి,కిస్మత్ పూర్ లోని జిహెచ్ఎంసి కార్యాలయం ఎదుట పార్టీ నేతలు కార్యకర్తలతో కలసి శనివారం ధర్నా చేపట్టారు. దీనికి వ్యతిరేకంగా రహదారి నిర్మాణంతో ఇళ్లు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొంటూ సుమారు 150 ఇళ్లకు చెందిన స్థానికులు అక్కడికి చేరుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, బాధితుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇరువర్గాలు తమ వాదనలను వినిపించడంతో పరిస్థితి వేడెక్కింది. అనంతరం స్థానికులు తమ డిమాండ్లపై నినాదాలు చేస్తూ నిరసన కొనసాగించారు.

**60 అడుగుల రహదారికే స్థానికుల డిమాండ్**
తరతరాలుగా ఈ ప్రాంతంలో నివసిస్తున్నామని, సుమారు కొన్ని ఏళ్లుగా ఇక్కడే ఇళ్లు నిర్మించుకుని ఉంటున్నామని స్థానికులు తెలిపారు. అభివృద్ధి పేరుతో తమ నివాసాలను తొలగిస్తే కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం



చేశారు. 100 అడుగుల రహదారి వద్దు,60 అడుగుల రహదారే ముద్దు, 'టీడీఆర్ వద్దు' నష్టపరిహారం కావాలి' అంటూ నినాదాలు చేశారు. కార్తీక్‌రెడ్డికి వ్యతిరేకంగా 'గో బ్యాక్'అంటూ నిరసన వ్యక్తం చేశారు. 100 అడుగుల రహదారి ప్రతిపాదనపై స్థానికుల అభ్యంతరాలు,60 అడుగుల రోడ్డుకే కార్తీక్ రెడ్డి మద్దతు. టీడీఆర్ కాదు, నష్టపరిహారం కోసం పోరాటం చేస్తామన్నారు. బండ్లగూడ నుండి కిస్మత్పూర్ వరకు 100 అడుగుల రహదారి ప్రతిపాదనపై స్థానికుల అభ్యంతరాలకు బీఆర్ఎస్ నేత,రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పి. కార్తీక్‌రెడ్డి మద్దతు తెలిపారు. రహదారి విస్తరణతో ఇళ్లు కోల్పోయే కుటుంబాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ..బాధితుల నిర్ణయమే మా నిర్ణయం. వారు 60 అడుగుల రహదారిని కోరుతున్నారు. వారి అభిప్రాయాన్ని గౌరవించి 60 అడుగుల రహదారి కోసం నేను కూడా పోరాడతా,ఇళ్లు కోల్పోయే వారికి టీడీఆర్ కాకుండా న్యాయమైన నష్టపరిహారం అందేలా ప్రభుత్వం, అధికారులపై ఒత్తిడి తీసుకొస్తాం అని తెలిపారు. 100 అడుగుల రహదారి వల్ల సుమారు 150 ఇళ్లు ప్రభావితమయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని,అయితే తమ ఇళ్లను తొలగించే విధంగా రహదారి విస్తరణ ఉండకూడదని స్పష్టం చేశారు. 100 అడుగుల రహదారి వద్దు,60 అడుగుల రహదారే కావాలి,టీడీఆర్ వద్దు, నష్టపరిహారం కావాలి అంటూ తమ డిమాండ్లను వెల్లడించారు. రహదారి అభివృద్ధి,స్థానికుల ఇబ్బందులు రెండింటినీ పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం,అధికారులు పరిష్కారం చూపాలని కార్తీక్‌రెడ్డి కోరారు.

**బీఆర్ఎస్ కార్యకర్తలపై రోడ్డు విస్తరణ బాధితుల ఘాటు వ్యాఖ్యలు**
**కార్తీక్‌రెడ్డి ముందే కడిగిపారేసిన బాధితులు**
ఒక్క ఓటు కూడా రాదు డిపాజిట్లు కూడా కోల్పోతారు. 100 అడుగుల రహదారి ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్న బాధితులు బీఆర్ఎస్ కార్యకర్తలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేత, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.కార్తీక్‌రెడ్డి సమక్షంలోనే తమ అసంతృప్తిని ఘాటుగా వ్యక్తం చేశారు. బాధితులు మాట్లాడుతూ..బీఆర్ఎస్ కార్యకర్తలను నమ్ముకుంటే రానున్న ఎన్నికల్లో ఒక్క ఓటు కూడా రాదు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ఇలాగే వ్యవహరిస్తే డిపాజిట్లు కూడా కోల్పోతారంటూ వ్యాఖ్యానించారు. ఎలాంటి ఉద్రిక్తత పరిస్థితికి దారి తీయకుండా రాజేంద్రనగర్ పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా అక్కడ కట్టు దిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ఇరువర్గాలను సముదాయించి అక్కడ నుంచి పంపించి వేశారు.



# పల్లెర్లలో ఘనంగా పోషణ మాసం

**ప్రజా వాయిస్/ఆత్మకూరు(ఎం):**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలం పల్లెర్ల గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తండ మంజుల నర్సింహా గౌడ్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. పోషణ మాసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ జి. వాణిశ్రీ,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి. కృష్ణవేణి, వార్డు సభ్యురాలు పొడుగు భార్గవి సత్యనారాయణ,అంగన్వాడీ టీచర్లు మేడి మాధవి,నాయిని అండాలు, కానుకట్ల మేఘలత , ఆశ కార్యకర్తలు పొడుగు చంద్రకళ,ఏలూరి కవిత,గర్భిణీ స్త్రీలు,బాలింతలు,చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ పాఠశాలలో వినూత్న సెల్ఫీ పాయింట్

**సర్పంచ్ గొడుగుజయమ్మ నర్సింలు**

**ప్రజా వాయిస్ దుబ్బాక/తొగుట**
ప్రభుత్వ పాఠశాలలో చదివిన ప్రతి విద్యార్థి ఐదవ తరగతి పూర్తయ్యేసరికి తెలుగు మరియు ఆంగ్లంలో చదవడం మరియు రాయడం అలాగే గణితంలో చతుర్విధ ప్రక్రియలు సాధించడమే లక్ష్యంగా ఎఫ్ ఎల్ ఎన్ ( ఖీూచీ) ఫౌండేషన్ అఫ్ లిటరసీ న్యూమరసి కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సెల్ఫీ స్టాండు వద్ద సర్పంచ్ గొడుగు జయమ్మ నర్సింలు గారు చిన్నారులతో కలిసి సరదాగా సెల్ఫీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది సర్పంచ్ గారు ప్రభుత్వ బడిలో చదివే విద్యార్థులు ప్రైవేటు తరహా లో కూడా సాటి లేరు అనే విధంగా ప్రభుత్వ పాఠశాల ను బలోపేతం చేయడానికి గ్రామంలో ఉన్న పలువురి యువత కి, అధికారులకు, గ్రామస్తులకు సెల్ఫీ ఛాలెంజ్ ఇవ్వడం జరిగింది కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, అమరేందర్ రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది



# ఏలినోనా ప్రభావం ఉండకూడదు

**గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన**
**ఏఆర్ ఎస్సై హరీష్ కుమార్ చారి**

**ప్రజా వాయిస్.. వీపనగండ్ల**
విఘ్నేశ్వరుని ఆశీస్సులతో రాష్ట్రవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం ఉండకూడదని, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సంతోషంగా ఉండాలని ఏఆర్ ఎస్సై హరీష్ కుమార్ చారి ఆకాంక్షించారు. వీపనగండ్ల మండల కేంద్రంలోని మొదటి వార్డు మెంబర్ సుబ్రహ్మణ్య చారి తనయుడి ఆధ్వర్యంలో నిర్వహించిన గణనాథుని ప్రత్యేక పూజా కార్యక్రమంలో శనివారం ఏఆర్ ఎస్సై హరీష్ కుమార్ చారి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా500 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ కుమార్ చారి మాట్లాడుతూ,,, గణనాథుని కృపతో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, గ్రామాల్లో రైతులు సంతోషంగా ఉండాలని కోరారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని గణనాథుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, మహిళలు, యువకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# మాజీ ఎమ్మెల్యే చందర్ అభివృద్ధి పనుల శిలాఫలకాల తొలగింపుపై బీఆర్ఎస్ ఆగ్రహం

**ప్రజా వాయిస్ గోదావరిఖని**
రామగుండం నియోజకవర్గంలో బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనుల శిలాఫలకాలను కావాలనే తొలగిస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదావరిఖని పరిధిలోని 5 ఇన్‌క్లైన్, క్లబ్ ఏరియాను బీఆర్ఎస్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర



నాయకులు కౌశిక హరి, కార్పొరేటర్ బొడ్డు రవీందర్‌లతో పాటు ఇతర నాయకులు మాట్లాడుతూ, గత పదేళ్ల కాలంలో కేసీఆర్ ప్రభుత్వం, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో రూ.కోట్లతో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. గుళ్లు, రోడ్లు, షట్టర్లు, చివరికి సింగరేణి క్వార్టర్లలోని చెట్ల వరకు కూల్చివేస్తూ కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. అభివృద్ధి పనులు ఎవరి ఆధ్వర్యంలో, ఎంత నిధులతో జరిగాయో తెలిపేది శిలాఫలకాలేనని, వాటిని తొలగించినంత మాత్రాన చరిత్రను చెరిపివేయలేరని హెచ్చరించారు. ?అధికారంలో ఉన్న నాయకులు నిజంగా నియోజకవర్గానికి మేలు చేయాలనుకుంటే ప్రాణహిత వంటి ప్రాజెక్టులు, నిధుల సాధన కోసం పోరాడాలే తప్ప పాత శిలాఫలకాలను కూల్చడం ఏంటని ప్రశ్నించారు. రాజకీయ కక్షతో శిలాఫలకాలను తొలగించే వైఖరిని వీడకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# మున్సిపల్ దుకాణాల బహిరంగ వేలం వాయిదా

## మరింత అవకాశం కల్పిస్తూ దరఖాస్తుల గడువు పొడిగింపు

**శామీర్ పేట / ప్రజా వాయిస్ :**
మూడు చింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ దుకాణాల సముదాయం బహిరంగ వేలం వాయిదా పడింది. ఆశించిన స్థాయిలో దరఖాస్తులు, డీడీలు అందకపోవడంతో ఈ నెల 19న నిర్వహించాల్సిన వేలాన్ని వాయిదా వేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. మున్సిపల్ చైర్పర్సన్, కౌన్సిల్ సభ్యుల సూచనల మేరకు వేలంలో పాల్గొనే అభ్యర్థులకు మరింత అవకాశం కల్పించేందుకు దరఖాస్తుల స్వీకరణ గడువును పొడిగించారు. మొత్తం 77 మున్సిపల్ దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

**26న బహిరంగ వేలం...**
కొత్తగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 26, 2026న ఉదయం 11 గంటలకు మూడు చింతలపల్లి మున్సిపల్ కార్యాలయం మొదటి అంతస్తులో బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సెప్టెంబర్ 19 నుంచి 25 వరకు ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు సమర్పించవచ్చని అధికారులు తెలిపారు. వేలం ప్రకటనలో పేర్కొన్న నిబంధనలు, షరతులకు అనుగుణంగా అర్హత కలిగిన అభ్యర్థులు గడువులోగా దరఖాస్తులు సమర్పించి అధిక సంఖ్యలో వేలంలో పాల్గొనాలని మున్సిపల్ చైర్మన్ జాము రవి సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు నీరజ్ గౌడ్, నవీన్, మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేష్, నాయకులు రాంరెడ్డి, జగన్నాథం, వైద్యనాథ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కోసం మీ సేవలో ఖీఖీ సేవలు.. ఎరువుల బుకింగ్ మరింత సులభం.

## మండల వ్యవసాయ అధికారి పొనుగోటి యాదగిరి



**ప్రజా వాయిస్ హన్మకొండ /ఆత్మకూర్**
రైతులకు ఎరువుల కొనుగోలులో మరింత సౌకర్యం కల్పించేందుకు ఫ్రేమవర్క్ ఫర్ ఫర్టిలైజర్ సాలె (ఖీఖీ) సేవను ప్రస్తుతం మీ సేవ (మీసేవ ) కేంద్రాల్లో అందుబాటులోకి తీసుకువచ్చామని ఆత్మకూరు మండల వ్యవసాయ అధికారి పొనుగోటి యాదగిరి తెలిపారు.ఎరువుల కొనుగోలు కోసం ఆన్లైన్లో స్లాట్ బుక్ చేసుకోలేని. స్లాట్ బుకింగ్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు ఈ ఖీఖీ సేవను మీ సేవ కేంద్రాల ద్వారా వినియోగించుకోవచ్చు. రైతులు ఎరువుల కొనుగోలు కోసం ఆన్లైన్లో స్లాట్ బుక్ చేసుకోలేని రైతులు సమీపంలోని మీ సేవ కేంద్రాన్ని సంప్రదించి ఖీఖీ సేవను వినియోగించుకోవాలని కోరారు.రైతులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకొని ఎరువుల కొనుగోలుకు సంబంధించిన ప్రక్రియను సులభతరం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



# పేదల ఇండ్లకు పట్టాలు ఇవ్వండి

## మంత్రి పొంగులేటికి సిపిఐ వినతి

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి**
హనుమకొండ నగరంలోని సర్వే నంబర్ 964,966, దీన్ దయాల్ నగర్,బంధం చెరువు,కోట చెరువు, ఇందిరమ్మ కాలనీల లో గత అనేక సంవత్సరాలుగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్న సుమారు 1000 మంది నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ సిపిఐ ప్రతినిధి బృందం శనివారం హైదరాబాదులోని మంత్రి పొంగులేటి నివాసంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కలిసి వినతి పత్రం అందజేశారు. సిపిఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సిపిఐ నాయకులు కిషోర్,అలకుంట్ల మల్లన్న, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు,జోగుదుర్గ,కనకం కావ్య తదితరులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ,ఇల్లు లేనటువంటి నిరుపేదలకు పట్టాలు ఇచ్చి పక్క గృహాలు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారని . సిపిఐ నాయకులు తెలిపారు.

# పోలీస్ స్టేషన్లను సందర్శించిన డీఐజీ అంబర్ కిషోర్ ఝా

## నేరాల నియంత్రణ, మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశం


**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**
కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాళేశ్వరం జోన్-1 డీఐజీ అంబర్ కిషోర్ ఝా శనివారం ఆసిఫాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్, వాంకిడి సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. వివిధ విభాగాలు, రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతిని పరిశీలించారు. జిల్లా ఎస్పీ నితికా పంత్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. పోలీస్ అధికారులతో కలిసి సర్కిల్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, స్వాధీనం చేసుకున్న వాహనాలను క్రమబద్ధంగా భద్రపరచి వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. 5ఎస్ విధానం అమలుతో పాటు రికార్డులు, ఫైళ్లను క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. తీవ్రమైన నేరాల కేసులు, పెండింగ్ కేసుల ఫైళ్లను పరిశీలించి, దర్యాప్తు పురోగతి, నిందితుల అరెస్టులు, పెండింగ్కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ సిబ్బంది కిట్ను పరిశీలించి వారి శాఖాపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కేసుల దర్యాప్తులో నాణ్యత, వేగం ఉండాలని, ఆధారాలను పూర్తిగా సేకరించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని, మహిళలు, బాలికల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఐజీ అంబర్ కిషోర్ ఝా సూచించారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని పోలీస్ అధికారులకు సూచించారు.




# బెదిరింపుల ఆరోపణలతో అశ్వారావుపేటలో కలకలం

## సోషల్ మీడియాలో హత్య బెదిరింపులపై బీఆర్ఎస్ కార్యకర్త ఫిర్యాదు

## ఎఫ్ఐఆర్ నమోదు.. విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామన్న పోలీసులు







**ప్రజా వాయిస్ । అశ్వారావుపేట**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడపల్లి గ్రామంలో సోషల్ మీడియా వేదికగా హత్య బెదిరింపులు వచ్చినట్లు ఓ బీఆర్ఎస్ కార్యకర్త చేసిన ఫిర్యాదు కలకలం రేపుతోంది. తనను గ్రామానికి చెందిన కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు వాట్సాప్ గ్రూప్లో బెదిరించారని డేరంగుల రాంబాబు ఆరోపించారు.రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 9న స్థానిక వాట్సాప్ గ్రూప్లో తనను చంపుతామని బెదిరిస్తూ సందేశాలు వచ్చినట్లు పేర్కొన్నారు. ఒకరోజు మాత్రమే బతికి ఉండాలని, మరుసటి రోజు పరిస్థితి ఉండదంటూ హెచ్చరించారని ఆయన ఆరోపించారు. దీంతో ఈ నెల 10న స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.స్థానికంగా స్పందన లేకపోవడంతో ఈ నెల 12న జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, డీఎస్పీ సంతోష్ కుమార్లను కలిసి తనకు జరిగిన విషయాన్ని వివరించినట్లు రాంబాబు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల అనంతరం ఈ నెల 13న పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు వెల్లడించారు.

**ఎఫ్ఐఆర్ నమోదైనా చర్యలు లేవంటున్న బాధితుడు**
ఎఫ్ఐఆర్ నమోదైనప్పటికీ ఇప్పటివరకు నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోలేదని రాంబాబు ఆరోపించారు. కనీసం వారిని పోలీస్ స్టేషన్కు పిలిపించి హెచ్చరించిన దాఖలాలు కూడా లేవని అన్నారు. తనకు, తన కుటుంబానికి భద్రతపై ఆందోళన ఉందని పేర్కొంటూ ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.అయితే ఈ వ్యవహారంలో రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలపై సంబంధిత వర్గాల అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది. బెదిరింపులకు సంబంధించిన సోషల్ మీడియా సందేశాలు, ఇతర ఆధారాలపై పోలీసులు దర్యాప్తు చేయాల్సి ఉంది.

**విచారణ అనంతరం చర్యలు: ఎస్హెచ్ఓ**
ఈ విషయంపై ఎస్హెచ్ఓ యాయిత్ రాజ్ను వివరణ కోరగా.. బాధితుడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన విషయం వాస్తవమేనని తెలిపారు. ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఫిర్యాదు అందిన తర్వాత దర్యాప్తు కోసం సమయం అవసరమని, విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఎవరైనా మళ్లీ బెదిరింపులకు పాల్పడితే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని, ఆధారాల మేరకు మరో కేసు నమోదు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు.

# అనాథ వృద్ధ మహిళకు ఆశ్రమంలో ఆశ్రయం

**ప్రజా వాయిస్,సంగారెడ్డి :**
పటాన్చెరు మండల పరిషత్ దుకాణ సముదాయం సమీపంలో అనాథగా ఉన్న వృద్ధ మహిళకు జిల్లా మహిళా, శిశు, వికలాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులు తక్షణమే స్పందించి ఆశ్రయం కల్పించారు.పటాన్చెరు మండల పరిషత్ దుకాణ సముదాయం పక్కన గుర్తుతెలియని వ్యక్తులు సుమారు నాలుగు రోజుల క్రితం వృద్ధ మహిళను వదిలి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. అప్పటి నుంచి ఆమె అక్కడే ఉండటంతో పరిసర ప్రాంతాల వారు మానవతా దృక్పథంతో ఆమెకు భోజనం అందిస్తూ వచ్చారు.ఈ విషయాన్ని స్థానికులు జిల్లా మహిళా, శిశు, వికలాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆమె, వృద్ధ మహిళకు సురక్షితమైన ఆశ్రయం కల్పించాలని జిల్లా ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి సతీష్ కు ఆదేశించారు.జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాల మేరకు ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి తన సిబ్బందితో కలిసి వృద్ధ మహిళ ఉన్న ప్రదేశానికి చేరుకుని ఆమెకు భోజనం అందించారు. అనంతరం అవసరమైన దుస్తులు అందించి, ఆమెను అమీన్పూర్లోని మహిమ మినిస్ట్రీస్ వృద్ధుల ఆశ్రమానికి సురక్షితంగా తరలించి ఆశ్రయం కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనాథలు, నిరాశ్రయులు, వృద్ధులు, మహిళలు తదితరుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, ఎవరైనా నిరాశ్రయులుగా కనిపిస్తే సంబంధిత సంక్షేమ శాఖ అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వీణ, ప్రమీల, జబ్బర్, అల్తాఫ్ తదితర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు



# ఇంటర్ బోర్డులో డిజిటలైజేషన్, రిటైర్మెంట్ వయోపరిమితి పెంపు: మంత్రి లోకేశ్ నిర్ణయాలు

ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యారంగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడమే లక్ష్యంగా వైవిధ్యమైన సంస్కరణలకు తెరలేపారు. ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధ్యక్షతన జరిగిన ఇంటర్ బోర్డు 78వ పాలకవర్గ సమావేశంలో విద్యార్థుల భవిష్యత్తుతో పాటు ఉద్యోగుల సంక్షేమాన్ని పరిగణనలోకి తీసుకుంటూ అనేక కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేశారు.నకిలీ సర్టిఫికెట్ల అక్రమాలకు శాశ్వతంగా ముగింపు పలకాలనే దృఢ సంకల్పంతో 1978 నుంచి జారీ చేసిన ఇంటర్మీడియట్ విద్యార్హత పత్రాలన్నింటినీ సమగ్రంగా డిజిటలైజ్ చేయాలని ప్రతిపాదించారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు ఈ రికార్డులను అత్యాధునిక 'బ్లాక్చైన్ టెక్నాలజీ'తో అనుసంధానించనున్నారు.విద్యా పునర్నిర్మాణంతో పాటు ఇంటర్మీడియట్ బోర్డు పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి తీపి కబురు అందిస్తూ వారి పదవీ విరమణ వయోపరిమితిని 60 సంవత్సరాల నుంచి 62 ఏళ్లకు పెంచుతూ



తుది తీర్మానం చేశారు. దీనికితోడు పరీక్షల నిర్వహణ ప్రక్రియను వేగవంతం చేసే క్రమంలో ఇన్విజిలేటర్లు, మూల్యాంకనదారుల శ్రమను గుర్తించి వారు అందుకునే భత్యాలను ఏకంగా 25 శాతం వరకు పెంచే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు.పరీక్షల్లో విద్యార్థుల సౌకర్యార్థం థియరీ సబ్జెక్టులకు 32 పేజీల బుక్లెట్లను అందించనున్నారు. మూల్యాంకనంలో ఏమాత్రం అలసత్వం వహించినా లేదా తీవ్రమైన తప్పులకు పాల్పడినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని విద్యాశాఖ స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది.

# ఓల్డ్ సిటీలో అన్నప్రసాద వితరణ



**ప్రజా వాయిస్/ఆత్మకూరు(ఎం):**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని ఓల్డ్ సిటీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుని వద్ద ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం స్వర్గీయ మాజీ ఎంపీపీ జన్నాయికోడె అమృతమ్మ శంకరయ్యల జ్ఞాపకార్థం వారి కుమారుడు,కోడలు జన్నాయికోడె యుగంధర్ పూజిత అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి భక్తులు,గ్రామ ప్రజలు,ప్రజా ప్రతినిధులు,మాజీ ప్రజా ప్రతినిధులు,అఖిలపక్ష నాయకులు, యువజన మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులను తప్పుదోవ పట్టిస్తే హెచ్ఎంఎస్ నాయకులకు తగిన బుద్ధి చెప్తాం

**- సీఐటీయూ**

**ప్రజా వాయిస్ గోదావరిఖని**

సింగరేణి బొగ్గు గని కార్మికుల హక్కుల పోరాటంలో సిఐటియుకు పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక హెచ్.ఎమ్.ఎస్ నాయకులు నిస్సిగ్గుగా అసత్య ప్రచారాలకు ఒడిగడుతున్నారని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆర్జీ-2 బ్రాంచ్ కార్యదర్శి కుంట ప్రవీణ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. ?శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 17న జేఏసీ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎల్సీ, సింగరేణి సి అండ్ ఎండీ, డైరెక్టర్ (పా) గార్లకు ఉమ్మడిగా వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, అంతవరకు కార్మిక సంఘాలన్నింటినీ సమానంగా చూడాలని కోరినట్లు




పేర్కొన్నారు. ఉమ్మడి కార్యక్రమం అనంతరం, సీఐటీయు తరపున ప్రత్యేకంగా (ఇండివిడ్యుయల్) సింగరేణి కార్మికులకు 'సొంతింటి పథకం' అమలు చేయాలని, కంపెనీకి రూపాయి నష్టం లేకుండా సిద్ధం చేసిన ప్రాజెక్ట్ నివేదికను అధికారులకు సమర్పించామని తెలిపారు. ?ప్రత్యేకంగా వినతిపత్రం ఇచ్చే సమయంలో అక్కడే ఉన్న హెచ్.ఎమ్.ఎస్ నాయకులే స్వయంగా ఫోటోలు తీసి, ఇప్పుడు సీఐటీయుకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ఆ ఫోటోలను 'ఫేక్' అని ప్రచారం చేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. అలాగే కాంట్రాక్ట్ కార్మికుల సెటిల్‌మెంట్‌పై కూడా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, ఆ ఒప్పంద పత్రాలపై హెచ్.ఎమ్.ఎస్ నాయకుల సంతకాలు కూడా ఉన్నాయని స్పష్టం చేశారు. హెచ్.ఎమ్.ఎస్ నాయకుడు రియాజ్ అహ్మద్ గారు కార్మికులకు, సీఐటీయుకి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి నిరాధార అసత్యపు ప్రచారాలతో కార్మికులను తప్పుదోవ పట్టిస్తే హెచ్.ఎమ్.ఎస్ కుట్రలను కార్మిక క్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు. హెచ్.ఎమ్.ఎస్ కట్టుకథలను కార్మికులు నమ్మవద్దని, సీఐటీయుకి కార్మికులందరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

# మానవ అక్రమ రవాణా, లైంగిక దోపిడీలను అరికట్టాలి

**- జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్**

**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :** మానవ అక్రమ రవాణా, లైంగిక దోపిడీలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ అన్నారు. శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'మానవ అక్రమ రవాణా, లైంగిక దోపిడీ' అంశంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి గణేశ్ మాట్లాడుతూ బలవంతం, భయపెట్టడం, మోసం వంటి మార్గాల ద్వారా మనుషులను అక్రమంగా రవాణా చేయడం, మహిళలు, బాలికలపై లైంగిక దాడులకు పాల్పడటం చట్టరీత్యా తీవ్రమైన నేరమని తెలిపారు. ఉపాధి పేరుతో మహిళలను అక్రమంగా రవాణా చేసి లైంగిక దోపిడీకి పాల్పడే ముఠాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఇలాంటి కేసుల్లో నేరస్థులకు ప్రత్యేక కోర్టుల ద్వారా జీవిత ఖైదు విధించిన సందర్భాలు ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ విద్యపై దృష్టి సారించాలని జడ్జి సూచించారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను సేవించడం, సరఫరా చేయడం చట్టరీత్యా నేరమని, నేరస్థులకు కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు. అనంతరం మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేస్తామని విద్యార్థులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వోడ్నాల రవీందర్, ప్రధాన కార్యదర్శి అవునూరి సత్యనారాయణ, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ నేరెళ్ల శంకరయ్య, లోక్ అదాలత్ సభ్యుడు మాదూరి ఆంజనేయులు, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు




ఆవుల శివకృష్ణ, సంయుక్త కార్యదర్శి గడ్డ వెంకటేష్, న్యాయవాదులు బొబ్బిలి శ్యామ్, వేముల స్నేహ, మాదూరి పృథ్వీ, ఆకారపు రామకృష్ణారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత, ఎక్సైజ్ సీఐ రూప, విద్యార్థులు పాల్గొన్నారు.

# కుమారుడి జన్మదిన వేడుక..విద్యార్థులకు కానుక

**రూ.80 వేల విలువైన టీషర్టులు, ప్యాంట్లు పంపిణీ**

**ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించిన గాదెపాక దంపతులు**

**క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలి: సీఐ భరత్ సుమన్**

**ప్రజా వాయిస్ / పాలకుర్తి / సెప్టెంబర్ 19:**


పాలకుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గాదెపాక సేవా సంస్థ ఆధ్వర్యంలో రూ.80 వేల విలువైన టీషర్టులు, ప్యాంట్లను శనివారం పంపిణీ చేశారు. గాదెపాక సేవా సంస్థ వ్యవస్థాపకులు గాదెపాక సంపత్ కుమార్, అనూష దంపతులు తమ కుమారుడు, ఇదే పాఠశాలలో చదువుతున్న గాదెపాక సమర్పన్ రాజ్ జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు దుస్తులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాలకుర్తి పట్టణ సీఐ భరత్ సుమన్ హాజరై సమర్పన్ రాజ్‌ను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో తాను చదువుకున్న నాటి అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిదురాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షురాలు శ్రీలతతో పాటు ఆనందం, మొజెస్, సాలమన్, పదవీ విరమణ పొందిన రవాణా శాఖ అధికారి శాగంటి సత్యనారాయణ, నామాల పరశురాములు, గాదెపాక ఎల్లయ్య, గాయాల సాలయ్య, గాదెపాక యాకయ్య, గుండే సారయ్య, సిరి స్వచ్ఛంద సంస్థకు చెందిన చిదురాల ఎల్లయ్య, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాదెపాక సేవా సంస్థ ప్రతినిధులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు దుస్తులు అందించిన సంపత్ కుమార్, అనూష దంపతులకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.




## అండమాన్‌లో అల్పపీడనం..

# మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండం

ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి వర్ష సూచన వెలువడింది. ఉత్తర అండమాన్, దాని పరిసర ప్రాంతాలలో అల్పపీడనం ఏర్పడినట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఇది రానున్న రోజుల్లో మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని, దీని ప్రభావంతో కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ప్రజలు, ముఖ్యంగా మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. విపత్తుల నిర్వహణ సంస్థ కథనం ప్రకారం, ప్రస్తుతం అండమాన్‌లో కేంద్రీకృతమైన ఈ అల్పపీడనం క్రమంగా బలపడనుంది. సోమవారం నాటికి ఇది వాయుగుండంగా, మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉంది. అనంతరం వాయవ్య దిశగా పయనించి, బుధవారం ఉదయానికి దక్షిణ ఒడిశా - ఉత్తరాంధ్ర తీరాలకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఈ అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో వాతావరణం మారనుంది. ఆదివారం నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై, పలుచోట్ల విస్తారంగా వర్షాలు పడతాయని తెలిపింది. ముఖ్యంగా సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు కోస్తాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో రానున్న ఐదు రోజుల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, అలలు తీవ్రత ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నందున మత్స్యకారులు వేటకు వెళ్లరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. తీరప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.






# సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి**

జిల్లాలో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద శుక్రవారం సంబధిత అధికారులతో సందర్శించి పనులను పరిశీలించారు. పరిశీలన అనంతరం పనుల పురోగతి పై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష లో ఆసుపత్రి భవన నిర్మాణం, మౌలిక వసతులు, విద్యుత్, పారిశుధ్యం తదితర పనుల పురోగతి పై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఎలాంటి లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని అందుకు ఆసుపత్రి పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ఎంజీఎం పర్యవేక్షకులు హరీష్చంద్ర రెడ్డి, ఔ.ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, +ఔవీజ రాజకుమార్, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ ఆనందం, ఆర్ ఒ బీ ఈఈ రాజేందర్, ఆర్డీఓ సుమ, ఎల్ అండ్ టీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సర్వాణన్, తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# కబడ్డీ జిల్లా స్థాయి ఎంపిక పోటీలకు విశేష స్పందన

**- జిల్లా వ్యాప్తంగా 300 మంది బాలబాలికల హాజరు**

**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :**

కబడ్డీ జిల్లా స్థాయి సబ్‌జూనియర్, జూనియర్ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. సుల్తానాబాద్‌లోని ఆల్ఫోర్స్ పాఠశాలలో శనివారం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపిక పోటీలకు జిల్లా వ్యాప్తంగా సుమారు 300 మంది బాలబాలికలు హాజరై తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేసి, రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న పోటీలకు పంపనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ధర్మయ్య, కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పెద్దపల్లి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. ఎంపిక పోటీలకు వేదికను సమకూర్చిన ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డికి అసోసియేషన్ ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ఫోర్స్ పాఠశాల ప్రిన్సిపాల్ సత్యం, వ్యాయామ ఉపాధ్యాయులు దాసరి రమేష్, ప్రణయ్, దాసరి ప్రసాద్, ఆలేటి సంపత్, గెల్లు మధుకర్‌యాదవ్, మహమ్మద్ షఫీ, కిషోర్, రాజేందర్ ప్రసాద్, శివ, పిట్ట భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# మృతుల కుటుంబాలను పరామర్శించిన చల్లా ధర్మారెడ్డి

**దామెర, ప్రజా వాయిస్:**

దామెర మండల ఆంధ్రజ్యోతి రిపోర్టర్ మన్నెం ఇంద్రారెడ్డి తల్లి సరోజన, దామెర గ్రామానికి చెందిన దుర్గిణాల నరసింహారావు, సింగరాజుపల్లి గ్రామ బీఆర్ఎస్ నాయకుడు, ఉపసర్పంచ్ ఉప్పుల శ్రీను తండ్రి రామిరెడ్డి (రాములు) మృతిచెందిన విషయం తెలుసుకున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వారి స్వగ్రామాలకు వెళ్లి పార్థివదేహాలను సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ, తాను ఎల్లప్పుడూ అండగా ఉంటామని చల్లా ధర్మారెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వాయిస్



## ఆశ్రమ పాఠశాలల్లో సౌకర్యాలు పరిశీలించిన డిప్యూటీ డైరెక్టర్

### విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన జాదవ్ అంబాజీ

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని పానాపటార్, మార్లావాయి, కోహినూర్ ఆశ్రమ పాఠశాలలను గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ శనివారం సందర్శించారు. విద్యార్థుల వసతి గదులు, భోజన ఏర్పాట్లు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి, పానాపటార్ ఆశ్రమ పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.విద్యార్థులతో వారి చదువు, ఆరోగ్యం, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు తమ సమస్యలను డిప్యూటీ డైరెక్టర్ దృష్టికి తీసుకురాగా, విద్యాభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు.




## అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే చర్యలు

### వైద్య కళాశాలలో ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ హరిత

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె.హరిత స్పష్టం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించి సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అనుమతి లేకుండా గైర్హాజరైన అసిస్టెంట్ ప్రొఫెసర్లపై చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. సమయపాలన పాటించని, తరచూ గైర్హాజరయ్యే ఉద్యోగులను ఉపేక్షించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు.



## అవంతీపురంలో ఘనంగా మహా అన్నదానం

### గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 1,200 మందికి అన్నప్రసాద వితరణ

**ప్రజా వాయిస్,అవంతీపురం:**

శ్రీ ఛత్రపతి శివాజీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఘనంగా మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 1,200 మంది భక్తులు, గ్రామస్థులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.కార్యక్రమంలో మిర్యాలగూడ తహశీల్దార్ శ్రీనివాసులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చింతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ మట్టపల్లి సైదులు, గుమ్మాడేల్లి సోమయ్య, ఉప సర్పంచ్ ఉప్పతల మహేష్ తో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.కార్యక్రమ నిర్వహణలో పొడిశెట్టి వీరయ్య, లింగంపల్లి రవి, పట్టెం శ్రీను, గువ్వల సైదులు, మోతే శంకర్, షేక్ రహీం, కుర్ర రామస్వామి, గుమ్మడెల్లి భారత్, అభిలాష్, మురళి, అనిల్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.



## రిక్వెస్ట్ స్టాప్‌లో బస్సులు ఆపాలి

**ప్రజా వాయిస్ దుబ్బాక,సెప్టెంబర్ 19:**

సిద్దిపేట జిల్లాదుబ్బాక మండలంలోని రాజక్కపేట గ్రామానికి చెందిన యువకులు గ్రామంలో రిక్వెస్ట్ స్టాప్ వద్ద బస్సులు నిలిపేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ దుబ్బాక బస్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు.రాజక్కపేటలో ప్రస్తుతం బస్సులను ఒకే బస్‌స్టాప్ వద్ద నిలుపుతున్నారని, గ్రామంలో రిక్వెస్ట్ స్టాప్ ఉన్నప్పటికీ అక్కడ బస్సులు ఆపడం లేదని యువకులు పేర్కొన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం రిక్వెస్ట్ స్టాప్ వద్ద కూడా బస్సులు నిలిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు.వినతిపత్రం సమర్పించిన వారిలో పర్స దేవయ్య, బిట్ల లక్ష్మణ్, గాంతుల కృష్ణ యాదవ్, కరికే నర్సింలు, అక్కల శివగౌడ్, శ్రీరామ్ అనిల్, పడిగే చింటు, కొమ్ము రమేష్ తదితరులు ఉన్నారు.



## నూతన ట్రాఫిక్ ఔట్‌పోస్ట్ బూత్‌లు ప్రారంభం..

**ప్రజా వాయిస్,కరీంనగర్ (సెప్టెంబర్ 19):**

కరీంనగర్ నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రయాణికుల భద్రతే ధ్యేయంగా తెలంగాణ చౌక్, మంచిర్యాల చౌరస్తాలో ఏర్పాటు చేసిన నూతన ట్రాఫిక్ ఔట్‌పోస్ట్ లను సిపి గౌష్ ఆలం శనివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. నగరంలోని రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలను నియంత్రించడంతో పాటు నిరంతరం పర్యవేక్షించేందుకు ఈ ఔట్‌పోస్ట్ బూత్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రయాణికులు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామితో పాటు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సంజీవ్, అంజయ్య, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.



## గుండాయిపేట్ రైతులకు కరెంటు ఊరట

### ఎమ్మెల్సీ దండే విఠల్ చొరవతో తాత్కాలిక పరిష్కారం.

### రేపటి నుంచి అదనంగా రెండు గంటల విద్యుత్ సరఫరా

**ప్రజా వాయిస్, కౌటాల:**

మండలంలోని గుండాయిపేట్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మిర్చి సాగు చేస్తున్న రైతుల విద్యుత్ కష్టాలకు తాత్కాలిక పరిష్కారం లభించింది. 11 గ్రామపంచాయతీల పరిధిలో వందల ఎకరాల్లో మిర్చి సాగు జరుగుతుండగా, సరిపడా మూడు ఫేస్ విద్యుత్ సరఫరా లేక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గుండాయిపేట్ సర్పంచ్ బడగే సంతోష్ ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దాల దేవయ్య, మాజీ జెడ్పీ చైర్మన్ సిడాం గణపతి, మాజీ సర్పంచ్ సోయం సురేష్, రైతులు ఎల్ములే దత్తు పటేల్, గవుడే హనుమంతు, దుర్గం బండు, పురుషోత్తం తదితరులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం రోజుకు కేవలం 7 నుంచి 8 గంటలు మాత్రమే మూడు ఫేస్ విద్యుత్ సరఫరా అవుతోందని, అదికూడా రాత్రి వేళల్లో ఉండటంతో మోటార్లు కాలిపోతున్నాయని రైతులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. బోర్లలో నీరు ఉన్నప్పటికీ విద్యుత్ కొరత కారణంగా పంటలకు నీరు అందించలేకపోతున్నామని, లక్షల రూపాయలు అప్పులు చేసి సాగు చేసిన మిర్చి పంట కళ్లముందే వాడిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తూ రోజుకు కనీసం 20 గంటల విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. రైతుల సమస్యపై స్పందించిన ఎమ్మెల్సీ దండే విఠల్ వారి సమక్షంలోనే విద్యుత్ శాఖ ఎస్ఈ జాడి ఉత్తమ్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. దీనిపై ఎస్ఈ సానుకూలంగా స్పందిస్తూ రేపటి నుంచి ప్రస్తుతం అందిస్తున్న విద్యుత్‌కు అదనంగా మరో రెండు గంటలు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే వారం రోజుల తర్వాత ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, రానున్న రబీ సీజన్ నాటికి రోజుకు 20 గంటల విద్యుత్ నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. దీంతో రైతులు ఊపిరిపీల్చుకుని ఎమ్మెల్సీ దండే విఠల్, ఎస్ఈ జాడి ఉత్తమ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



## కలెక్టర్ చొరవతో వృద్ధుడికి కుటుంబ ఆసరా

### తండ్రిని ఇంటికి తీసుకెళ్లిన కుమారుడు

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం బోడేపల్లి గ్రామానికి చెందిన మల్లయ్య అనే వృద్ధుడు కుమారుడు తనను పట్టించుకోవడం లేదని ఆవేదనతో ఈ నెల 18న జిల్లా కలెక్టరేట్‌కు వచ్చారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ కె.హరిత వెంటనే స్పందించి, వృద్ధుడి వద్దకు స్వయంగా వెళ్లి పరిస్థితిని తెలుసుకున్నారు. తక్షణమే రక్షణ, వసతి కల్పించేలా అధికారులను ఆదేశించారు. విషయం తెలుసుకున్న కుమారుడు స్పందించి, తండ్రి బాధ్యతను పూర్తిగా స్వీకరిస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్ కుమారుడితో మాట్లాడి కుటుంబ బాధ్యతలను వివరించగా, తండ్రిని ప్రేమగా చూసుకుంటానని తెలిపి ఇంటికి తీసుకువెళ్లారు. తన సమస్య పరిష్కారమైనందుకు వృద్ధుడు సంతోషం వ్యక్తం చేశారు.వృద్ధాప్యంలో కుటుంబ సభ్యుల ఆదరణ, భద్రత అవసరమని, వృద్ధుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కలెక్టర్ కె.హరిత సూచించారు.



## చీలపల్లి ప్రజల సమస్యలకు పరిష్కారం

### వారం రోజుల్లో వాగులపై కల్వర్టుల పనులు ప్రారంభం

### ఎమ్మెల్సీ దండే విఠల్

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలం చీలపల్లి గ్రామ ప్రజలు వర్షాకాలంలో ఎదుర్కొంటున్న రాకపోకల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ తెలిపారు. చీలపల్లి మార్గంలోని రెండు వాగులపై కల్వర్టుల నిర్మాణానికి కలెక్టర్ నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు.వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరగా, అటవీ శాఖ అనుమతుల కారణంగా కొంత సమయం పట్టే అవకాశం ఉందని, అప్పటివరకు ఇబ్బందులు తగ్గించేందుకు వారం రోజుల్లో రెండు వాగులపై కల్వర్టుల పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో చీలపల్లి సర్పంచ్, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

### -కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు ప్రజాప్రతినిధులు

**ధర్మపురి, సెప్టెంబర్ 19 (ప్రజా వాయిస్)**

జగిత్యాల జిల్లాలోని బుగ్గారం మండలం లోని సిరి కోండ గ్రామంలో గల స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ యందు ఇదే పాఠశాల నందు గణిత శాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న వి రత్నాకర్ అనే ఉపాధ్యాయుడు శనివారం రోజు మధ్యాహ్నం వేళలో.. ఇదే పాఠశాలలో విద్యాను అభ్యాసిస్తున్న ఇద్దరు విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. వారు ఇద్దరు పాఠశాలకు దూరం నుండి వస్తున్నారని గ్రహించి తన సోంత డబ్బులతో ఇద్దరు విద్యార్థినిలకు సుమారు పది వేల రూపాయలకు పైగా విలువ కలిగిన సైకిళ్లను గ్రామ సర్పంచ్ ధర్మ రాజు చేతుల మీదుగా వారు ఇద్దరికీ పంపిణీ చేశారు. ఇట్టి కార్యక్రమంలో వారితో పాటు, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ విజయ్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ పాలక మండలి సభ్యులు, విద్యార్థినీ విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. కాగా తన సోంత డబ్బులు వెచ్చించి సైకిల్లు అందజేసిన రత్నాకర్ సార్ ని సర్పంచ్, ఉప సర్పంచ్, పాలక మండలి సభ్యులు ఎంతో ఘనంగా అభినందించారు.